



కవులు

రచనలు,జీవిత చరిత్ర

మహాకవి - మహా పురుషుడు గురజాడ అప్పారావు








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020010001838

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాధ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

మహాకవి - మహాపురుషుడు



గురజాడ అప్పారావు

రచన

పెట్టి ఈశ్వరరావు

ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం

బెజవాడ

మహాకవి - మహాపురుషుడు

గురజాడ అప్పారావు

రచన:
సెట్టి ఈశ్వరరావు

ప్రజాశక్తి కార్యాలయం
బెజవాడ

పరిచయం

విజ్ఞానానికి సహితం విలువలు మారుతూవుంటవి. ప్రపంచచరిత్ర ప్రాచీనపుటలు తిప్పి తరిచి యోచిస్తే, ఒక్కొక్కయుగంలో ఒక్కొక్క రూపంగా వికసిస్తూవొచ్చిన నాగరికతను ఆధారపరుచుకుని మానవ పరిణామం పరిపరివిధాల పక్వతను పొందుతూ వొచ్చింది.

తన వాతావరణంలో మార్పులు కల్పించుకోడంలో మానవసమాజం విజ్ఞానపరంగా వివిధవిధాల పరిణతను పొందింది. అందుచేతను విజ్ఞానానికి విలువలుకట్టడంలో పడికట్టురాళ్లు పదేపదే మారుతూ వొచ్చినవి.

సమాజజీవితంలో సమిష్టిని కలిగే మార్పు సారస్వతంలో ప్రతిబింబితం కాకతప్పదు. ఈదృష్టితో ఆంధ్రసారస్వతంలోని ఘట్టాలను విభజించి విలువకడితే నవయుగనిర్మాణానికి మూలపురుషులు గురజాడ అప్పారాయకవీ, గిడుగు రామమూర్తి పండితుడూ. వీరిని యిరువురిగా విడదీయడమే కూడదు.

"రెంటపారెడు రక్తమొక్కటె,
రెంటవెలిగెడు తేజమొక్కటె,
రెండనుటె తప్పు" అనక తప్పదు.

పరకీయ - ప్రపత్తిని ఆరాధించటంలో ఆంధ్రులకు అభిలాష హెచ్చు. ప్రాచీనంలో సంస్కృతవాణిని రాణిగా గౌరవించడంలో కవులు ఆంధ్రవాణికి నీచస్థానం కల్పించారు. తరువాత ఆంధ్రవాణిని కొత్త ఆదరించడం కలిగినప్పటికీ సంస్కృతవాణికి కోడరికంచేయడం ఆమెవిధి అయ్యింది. ఆ అత్తగారి అదమాయింపుతో మెలగవలసిన అగత్యం తప్పనందున తన సహజసౌభాగ్యాన్ని ప్రత్యేకసంపదగా, వృద్ధిచేసుకోలేక పోయింది. ఆంధ్రవాణికి అపూర్వ అలంకారాలని భ్రమించి అనాటివారు శబ్దశాసనంతో ఆమెకు కల్పించిన సంస్కృతిశృంఖలాల బంధింపువల్ల ఆమె తనవారైన సామాన్యజనుల ఆదరాభిమానాలకు అందుబాటు కాకుండా పోయింది. ఈ దుస్థితి తప్పించి, బేడీలు విడదీసి, ఆత్మీయులైన సామాన్యజనుల బాంధవ్యం సమకూర్చడంలో ఆమెకు ఆత్మచైతన్యం కలిగించిన మహనీయుడు గురజాడ అప్పారావు.

సంపూర్ణ స్వాతంత్ర్యంతోనూ, సజీవ సౌందర్యంతోనూ, సామాన్య జనుల వ్యవహారబలంతోనూ, విహరించవలసిన శిష్టవ్యావహారభాషను "నీచంగ్రామ్యమ్" అన్న అర్థాన్నపు 'ఆర్డినెన్స్' ప్రయోగంతో గడపదాట నీయకుండా చేశారు గ్రాంధికులు. ప్రజాభాషపక్షన యెర్రబావుటా యెత్తి 'ఆర్డినెన్స్'ను ధిక్కరిస్తామని ధైర్యంతో తిరుగుబాటు లేవనెత్తారు రామమూర్తి, అప్పారావుగార్లు.

పండిత ప్రకాండులు తమ పాత విలువలకు గొడ్డలిప్రేటు తగిలిందన్న భయంతో పరిషత్తుద్వారా ప్రత్యేకసభలద్వారా ఈ తిరుగుబాటును అణిచివేయడానికి అనేకయత్నాలు చేశారు. యావదాంధ్ర సంచారంచేసి పండితుల భాషాభేషజాన్నీ కృత్రిమ గ్రాంధికవాదాన్నీ అడ్డుకొని తన అపూర్వ పాండిత్య బలప్రదర్శనంతో పండితుల్ని భయభ్రాంతుల్ని చేయడంలో గిడుగు 'పిడుగు' అనే బిరుదు సంపాదించాడు రామమూర్తి. బహిరంగసభలలో, వాదోపవాదాలలో. ఆయన గ్రాంధికవాదాన్ని ఖండించి పాత పండితులను పరిభవిస్తూవుంటే -- అప్పారాయకవి తన ఉజ్వల భావాలనూ, ఉత్తమ లక్ష్యాలనూ, సంఘసంస్కరణ విధానాలనూ, రుచిగల రచనలద్వారా అందరికీ అర్థమయ్యే తియ్యని తెలుగు వ్యవహారభాషలో సృష్టించి తమ ఉద్యమానికి సరియైన పునాదులు స్థాపించాడు. ఈయన ప్రతిభ ఆకర్షణీయం కావడంవల్ల వాడుకభాషావాదం త్వరలో ప్రజాహృదయాన్ని ఆకర్షించి సుస్థిరరూపాన్ని పొందింది. భావనలో ఈతనికున్న అభ్యుదయ భావాలు భాషావిప్లవంతో జతకూడి ప్రజానీకానికి అనువైన రచనలను దేశానికి అందజేసింది. యుగకర్తగా కావ్యజగత్తు అంగీకరించిన ఈమహనీయుడి జీవితచరిత్ర ప్రజానీకానికి అందుబాటులోలేని కొరతను ఈ గ్రంథం శాయశక్తులా తీర్చడానికి యత్నించింది.

అప్పరాయకవి జీవితంలోని విశిష్టతను వివరిస్తూ గ్రంధకర్త దేశకాలపాత్రల బాంధవ్యాన్ని సమన్వయించి, తన పద్ధతికి సరియైన ప్రయోజనాన్ని సాధించాడు.

బెజవాడ,
2—3—45.

ముద్దుకృష్ణ.

౯

పరుల కలిమికి పొర్లి యేడ్చే
పాపి కెక్కడ సుఖం కద్దోయ్;
ఒకరి మేల్ తన మేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయ్!

౧౦

స్వంత లాభం కొంత మానుకు
పొరుగువానికి తోడుపడవోయ్;
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్

౧౧

చిన్నదై [illegible]
మెన్నక [illegible] వలసమున్నలుం;
[illegible]
[illegible]

అప్పారాయ మహాకవి స్వహస్తలిఖితం. చూ. 18 వ పుట.

విషయసూచిక

మహాకవి - మహాపురుషుడు

గురజాడ అప్పారావు

●

భారతదేశంలో ఇంగ్లీషువారి ప్రభుత్వం సుస్థాపిత మయింది. 'సిపాయిల తిరుగుబాట'ని *వ్యవహరింపబడే దేశీయుల ఆఖరు స్వాతంత్ర్య పోరాటంకూడా అణచివేయబడింది. తమకు స్వాధీనమైనదేశానికి ఆక్రమణదారులు చేకూర్చే శాంతిభద్రతలు భారతదేశానికి ఇంగ్లీషు ప్రభుత్వం చేకూర్చింది.

పాశ్చాత్యుల సంస్కృతితోను, సాంప్రదాయాలతోను విద్యావంతులైన భారతీయులకు సంపర్కం కలిగించి. పాలకజాతి పాలితజాతిపట్ల అవలంబించే 'ధర్మా'న్ని అనుసరించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లీషు విద్యావిధానం — యెంతటి బానిస విద్యావిధానమైనప్పటికీ — తాను కలలోనైనా అనుకోని ఫలితాన్ని యిచ్చింది. తానొకటితలిస్తే ఫలితం ఇంకొకటయింది.

అలసటచేత గాఢనిద్రలో మునిగిపోయిన భారతజాతికి ప్రపంచచరిత్ర మేలుకొలుపులు పాడింది. ఇంగ్లీషుప్రభుత్వం యెంత బుజ్జగించినా మళ్ళీ భారతీయులు నిద్రలో మునిగిపోరని స్పష్టపడుతున్న రోజులు - స్వాతంత్ర్యోద్యమాన్ని రగుల్కొల్పిన సంస్కృతీ విప్లవం జరుగుతున్న రోజులు.

మహాకవి జననం

తూర్పు బలబల తెల్లవారెను
తోకచుక్కయు వేగుచుక్కయు
ఒడయుడౌ వేవెల్గు కొలువుకు
వెడలమెరసిరి మిన్నువీధిని

---

* 1857 సం. తిరుగుబాటు.

వెలుగునీటను గ్రుంకె చుక్కలు;
చదల చీకటి కదలబారెను;
యెక్కడనొ ఒక చెట్టుమాటున;
నొక్కకోకిల పలుకసాగెను.

మేలుకొలుపులు కోడికూసెను;
విరులు కన్నులు విచ్చిచూసెను;
ఉండి, ఉడిగియు, ఆకులాడగ;
కొసరెనోయన గాలివీచెను.

('ముత్యాలసరములు')

ఆ రోజులలోనే * తెలుగు సాహిత్యానికి వెలుగుచూపిన మహాకవి గురుజాడ వెంకట అప్పారావుగారు విశాఖజిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో మాతామహులయింట నియోగి బ్రాహ్మణ కుటుంబములో జన్మించేరు. తండ్రి వెంకటరామదాసుగారు; తల్లి కౌసల్యమ్మగారు. తల్లిదండ్రు లిద్దరు సనాతనాచార పరాయణులు. వెంకట రామదాసుగారికి సంస్కృతంలో మంచి ప్రవేశముంది. ఆయన విజయనగరం సంస్థానపు పేష్కారుగాను, రెవెన్యూ సూపర్‌వైజరుగాను, ఖిలేదారుగాను పనిచేసి పింఛను పుచ్చుకున్నారు తరవాత విజయనగరం సమీపంలోవున్న 'ఊట గెడ్డ'ను ఆయన బండిలో దాటుతుండగా, హటాత్తుగా ఏరు ముంచుకొని వచ్చింది; అందులో వెంకట రామదాసుగారు చనిపోయేరు.

వెంకట రామదాసుగారు చీపురుపల్లికి బదిలీకావడంచేత అప్పారావుగారు పది సంవత్సరముల వయస్సువచ్చువరకు చీపురుపల్లిలో విద్యాభ్యాసం చేశారు. తరువాత విజయనగరంలో చదువుసాగించి 1886 లో బి. ఏ. పట్టభద్రులయ్యేరు.

విద్యార్థి దశ

హైస్కూలు తరగతులలో వున్నప్పుడే అప్పారావుగారు తమ ఉపాధ్యాయుల్ని ఉద్దేశించి హాస్యంగా శ్లోకాలు రచిస్తుండేవారు.

---

* దుందుభినామ సంవత్సర భాద్రపద శుద్ధ త్రయోదశి ఆదివారం అనగా 1861వ సంవత్సరం నవంబరు 30 వ తేదీని, జన్మించారు.

విజయనగరంలో చదువుతున్నప్పుడు అప్పారావుగారి ప్రతిభను కళాశాల ప్రిన్సిపాలు చంద్రశేఖరశాస్త్రిగారు గమనించి ప్రోత్సాహించేవారు. కొన్నాళ్ళు అప్పారావుగారు చంద్రశేఖరశాస్త్రిగారి యింట్లో బసచేసి చదువుకున్నారు.

చదువుకుంటున్న రోజుల్లో అప్పారావుగారూ ఆయనతమ్ముడు శ్యామలరావుగారూ విజయనగరంనుండి వెలువడే 'ఇండియన్ లీజర్ అవర్' [1] అన్న పత్రికలో ఇంగ్లీషుపద్యాలు ప్రచురించేవారు. 'ఇండియన్ లీజర్ అవర్'లో ప్రచురింపబడ్డ అప్పారావుగారి పద్యకావ్యమైన 'సారంగధర'ను సంపాదకులు గుండుకుర్తి వెంకటరమణయ్యగారు, 'రీస్ అండ్ రయ్యత్' [2] పత్రికకు పునఃప్రచురణార్థం పంపేరు. 'సారంగధర', 'చంద్రహాస' అన్నవి అప్పారావుగారి పెద్ద ఇంగ్లీషురచనలు. ఒకొక్కటీ ఐదువందల పంక్తులవరకూ వుంటాయి.

'రీస్ అండ్ రయ్యత్' పత్రికా సంపాదకులైన శంభు చంద్రముఖర్జీ గారు "ఆరోజుల్లో ఆంగ్లరచనకు ప్రసిద్ధిపొందిన పురుషులు....మన ఆంధ్రులలో శ్రీ రావుసాహెబు గిడుగు వెంకటరామమూర్తి పంతులుగారివలె స్వయంకృషివల్ల నికటమైన పాండిత్యమును సంపాదించినవారు....ఆయన పత్రికలో విమర్శఅంటే గవర్నరు జనరలుకూడా భయపడేవాడు" [3]

ముఖర్జీగారు వెంకటరమణయ్యగారికి 1883 ఆగష్టు 14న వ్రాసిన ఉత్తరంలో 'సారంగధర' కావ్యాన్ని చాలా ప్రశంసించి కవిని అన్నివిధాలా ప్రోత్సహించడానికి కుతూహల పడుతున్నామని రాశారు; కవిపేరు ('సారంగధర'. కవిపేరు లేకుండానే ప్రచురణార్థం పంపబడింది) చదువు, మొదలైన అన్నివివరాలు అడిగేరు.[4]

తరువాత ముఖర్జీగారికి అప్పారావుగారికి ఉత్తర ప్రత్యుత్తరాలు తరుచుగా జరుగుతుండేవి. ఆయన అప్పారావుగారి ఉపజ్ఞను గమనించేరు. శంభు చంద్రముఖర్జీగారు అప్పారావుగారిపట్ల యెంతో మమకారంచూపి ప్రోత్సాహపర్చేవారు.

---

1 'Indian leisure hour'

2 రాజు, రైతు

3 చూ. గురజాడ అప్పారావుగారి డైరీలు—డాక్టరు బుర్రా శేషగిరిరావుగారు.

4 చూ. 142వ పుట—Below 'An Indian journalist' by F. H. skrine I. C. S.

"దేశ శ్రేయస్సుకోసరమూ, ప్రపంచ శ్రేయస్సుకోసరమూ పాటు పడడానికి బలమైన యిచ్ఛా బాధ్యతలు గలవారు.........అమితమైన కష్టాలు పడడానికి సిద్ధపడాలి." •

"మీరు రాద్దామనుకున్న రాజకీయ పద్యకావ్యాన్ని ప్రారంభించారా? జానపదగేయాలు, వివిధ ఛందస్సులలో పద్యాలు రాయడానికి ప్రయత్నించండి" *

శంభుచంద్ర ముఖర్జీగారి ఉత్తరాల్లోని పైనుదహరింపబడిన రెండు భాగాలూ, విద్యార్థిదశలో అప్పారావుగారి ఆశయాల్ని, అభిరుచుల్ని కొంత వరకూ వ్యక్తంచేస్తాయి.

ఈ వుత్తరాలు 1884 సం న రాసినవి. అంటే కాంగ్రెసు పుట్టుకకు ఒక సంవత్సరం పూర్వానివన్నమాట. ఆనాటి భారతీయ మేధావుల్ని జాతీయభావాలు యెలాగ ఆకర్షిస్తున్నాయో యీ వుత్తరాలనుబట్టి మనం కొంతవరకు తెలుసుకోవచ్చు.

ఆ జాతీయభావాలే అప్పారాయ మహాకవిని ఆకర్షించి, దేశాభిమానినిగాచేసి రాజకీయ పద్యకావ్య రచనకు సంకల్పించుకున్నట్టు చేశాయి. కాని యీ రచన సాగినట్టు కనిపించదు. ఈ భావపరిణామమే అప్పారావుగారి వ్యక్తిత్వాన్ని నిర్మించి మన నవ్యసాహిత్యానికి శకస్థాపకుణ్ని ప్రసాదించింది.

అప్పారావుగారిలాగే ఆయన తమ్ముడు శ్యామలరావుగారు దేశాభిమానియైన ప్రతిభాశాలి; లా కాలేజీలో చదువుతూ అకాలమృతి చెందారు. కాంగ్రెసు నిర్మాతలూ, ఆనాడు బ్రిటిష్‌ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే సుప్రసిద్ధులూ అయిన హ్యూము, డబ్ల్యు. సి. బెనర్జీ, నార్టన్‌గార్ల మీద ఇంగ్లీషులో పద్యాలు 1 వ్రాసి 'హిందూ' 2 పత్రికలో శ్యామలరావుగారు ప్రచురించేరు.

• 1884 జనవరి 27 నాడు వ్రాసిన ఉత్తరం చూ. 151వ పుట 'An Indian Journalist'

* 1884 జూన్ 22 నాడు వ్రాసిన ఉత్తరం చూ. 151వ పుట.

1. 'To the Magnificient Seditionists'
2. 'The Hindu' Madras.

లెక్చరరు పదవి

అప్పారావుగారు విజయనగరం కళాశాలలో 1886 సం.న పట్టభద్రులయ్యేరు. ఫిలాసఫీ అభిమానశాస్త్రంగాను, సంస్కృతం రెండవ భాషగాను బి. ఏ. ప్యాసయ్యేరు. పట్టభద్రులు కాకపూర్వమే 1884 ఏప్రిల్ మాసంలో విజయనగరం కళాశాలా ఉపాధ్యాయులుగా నియమింపబడ్డారు. తరువాత యీ ఉద్యోగానికి సెలవుపెట్టి 1887 ఏప్రిలులో విజయనగరం జనరల్ డ్యూటీ డిప్యూటీ కలెక్టరాఫీసులో సబ్బోర్డినేటు హెడ్‌క్లార్కుగా చేరేరు. "కాలేజీ జీతం రు. 25/- అవడంచేతనూ, గవర్నమెంటు యుద్యోగంలో అప్పుడు పట్టభద్రులకు పెద్ద అవకాశాలుండడంచేతనూ కాబోలు, ఆయన యీమార్పు తలపెట్టాడు" •

తరువాత అప్పారావుగారు, కొద్దినెలలు మాత్రం కలక్టరాఫీసు ఉద్యోగంచేసి, 1887 విజయదశమినాడు (అక్టోబరు ప్రాంతం) 100 రూ. జీతంతో విజయనగరం కళాశాలలో నాలుగవ లెక్చరరుగా ప్రవేశించేరు. నాలుగు సంవత్సరాలతరువాత, 1891లో 125 రు. జీతంతో మూడవలెక్చరరు అయ్యేరు. ఇంగ్లీషు, వ్యాకరణం, సంస్కృతసారస్వతం, తర్జుమా, గ్రీకు, రోమనుచరిత్రలు, బి ఏ., యఫ్ ఏ. క్లాసులకు పాఠాలు చెప్పేవారు.

అప్పారావు మహాకవికి ఆనాటి పౌరహితకార్యకలాపాల్లో యెక్కువ ఆసక్తివుండేది. చెన్నరాష్ట్రంలోని ప్రముఖులతోను, రాష్ట్రేతర ప్రముఖులతోను ఆయన నడిపిన ఉత్తరప్రత్యుత్తరాలలో యిది ద్యోతకమవుతుంది. 'తెలుగుహార్పు'లో ఆయావిషయాలమీద సంపాదకీయవ్యాసాలు రాసేవారు. కస్పావీధి రేట్ పేయర్సు అసోసియేషన్ అధ్యక్షులుగాను, మ్యునిసిపల్ కౌన్సిలరుగాను స్థానికవిషయాలలో శ్రద్ధతీసుకునేవారు.

అప్పారావుగారి గురువులూ, ఆయన ప్రతిభను గుర్తించి ప్రోత్సాహించినవారూ, విజయనగర కళాశాల మొదటి ప్రిన్సిపాలుగావుండి ప్రముఖ విద్యావేత్తగా పేరుపొందిన చంద్రశేఖరశాస్త్రిగారే, అప్పారావుగారు లెక్చరరుగా నియమింపబడడానికి కారణమై వుండాలి. నియామకం గురించి తమడైరీలో రాస్తూ ఆనందగజపతికి మహారాజుకు, చంద్రశేఖర శాస్త్రిగారికి కృతజ్ఞత వెల్లడించేరు.

• 'ముత్యాలసరాలు' — రెండవకూర్పులో కిళాంబి రంగాచారిగారు.

కాలేజీలో లెక్చరరుగా పనిచేస్తున్నప్పుడే అప్పారావుగారికి ఆనంద గజపతి మహారాజుతో పరిచయమైంది. కళాపక్షపాతి అయిన ఆ మహారాజును అప్పారావుగారి ప్రతిభ ఆకర్షించింది. ఆనాటినుంచి ఆయన జీవితాంతంవరకూ అప్పారావుగారు మహారాజుకు పరమమిత్రులైన ఆంతరంగికు లయ్యేరు.

ఆనంద గజపతి మహారాజు సన్నిధానంలో, మన తెలుగుదేశంలో వన్నెకెక్కిన విద్వాంసులూ, కళావేత్తలూ వుండేవారు. ఆయన నిరంతరమూ విద్యావ్యాసంగంలో లీనమై ఉండేవారు. అటువంటి విద్యాధికులలో అప్పారావుగారు తమ యిరవై యెనిదవయేటనే, అంటే 1889 ఆగష్టు 16 తేదీని, విజయనగరాస్థానపు డిబేటింగు క్లబ్బుకు ఉపాధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. దీనినిబట్టి అప్పారాయ మహాకవి చిన్నవయసుననే అభినవ కృష్ణరాయులని పేరుపొందిన ఆనందగజపతి మహరాజు ఆస్థానంలో ఎన్నిక కెక్కేరని మనమూహించుకోవచ్చు.

లెక్చరరుగా వున్నప్పుడు తాము బోధించే విషయాల్లో కూలంకషమైన ప్రజ్ఞ సంపాదించడమే కాకుండా, చెన్నపట్నం, బెంగుళూరువంటి పట్టణాలకు వెళ్ళినప్పుడు అక్కడి అధ్యాపకులు బోధించేతీరులు జాగ్రత్తగా పరిశీలించేవారు. ఆ ప్రొఫెసర్లతో విద్యావిషయకమైన దీర్ఘచర్చలు చేసేవారు. [1] "ఈ సంప్రతింపులలో తమ విజయనగరం కాలేజీలోని పరిస్థితులకూ తాము ఆప్రాంతములలో చూచినవాటికి తేడాలు చూచుకొంటూ, మొత్తముపై విజయనగరంలోని విద్యాపరిస్థితులున్నూ వ్యాసంగమున్నూ, ఆ ప్రాంతమువాటికి తీసిపోవని గ్రహించారు. తమకు అక్కరలేకపోయినా తమతోటి సహోపాధ్యాయులైన విజయనగరం కాలేజీ లెక్చరర్లకు యూనివర్సిటీలో గౌరవము లభించేటట్లు అచ్చటివారితో గట్టిగా చేసిన సిఫారసులను బట్టిచూస్తే, ఆయన ఔదార్యమున్ను విజయనగరమందలి అభిమానమున్ను తేటపడును."

విద్యార్థులకు రావలసిన ముప్పయి అయిదుమార్కులు, తమకు రావలసిన జీతము పరమావధి, కావనీ, విద్యార్థులకూ, విద్యకూ వన్నెతేవడమే అధ్యాపకుని పరమావధని, అప్పారావుగారి మతమైనట్టూ, పై ఉదంతమూ, తాను లెక్చరరుగా నున్నప్పుడు డైరీలలో రాసుకున్న విషయాలూ

1 "గురజాడ అప్పారావుగారి డైరీలు"—బుర్రా శేషగిరిరావుగారు

వ్యక్తం చేస్తాయి. అందువల్లనే ఆయన శిష్యులకు ప్రీతిపాత్రులయ్యేరు. సజీవులై వున్న ఆయనశిష్యులు కొందరు యీనాటికి కూడా ఆయనను స్మరిస్తుంటారు.

అప్పారావుగారి ఉద్యోగధర్మ నిర్వహణాన్నీ, జ్ఞానపిపాసను ద్యోతకం చేసే ఒక ఉదంతాన్ని ఉదహరిస్తాను.

"గ్రీకు, రోమను గ్రంథపఠనంవల్ల 'రినేజాన్సు' దినములలో యూరపులో అన్నిరాజ్యములలోనూ స్వదేశీయ సారస్వత విజృంభణము ఒక్కమారు ప్రతిభావంతమైనదికదా! అట్లే ఆంగ్లుల ప్రసిద్ధ సారస్వత ప్రచారంవల్ల అట్టి విజృంభణ మన దేశీయులలో ఆంగ్లమందుగాని, స్వభాషలందుగాని యేలకలుగదాయెను"? అన్న సందేహం అప్పారావుగారిని చాలారోజులనుండీ బాధిస్తుండేది. పత్రికలు, గ్రంథాలు, ఉపన్యాసాలు, నాటకప్రదర్శనలు, పెద్దపెద్ద ప్రొఫెసర్లతో చేసిన చర్చలు—యేవీ అప్పారావుగారికి సమాధానం యివ్వలేకపోయేయి. కొన్నాళ్ళు మథనపడిన తరువాత ఆయనకే సమాధానం స్ఫురించింది. అది:

"ఆంగ్ల సాహిత్య పాఠములలో విద్యార్థులకు శైలి (స్టయిల్) లోను, వస్తువిన్యాసము (ట్రీట్మెంటు)లోను బాగోగులు విడదీసి బోధింపకుండుట, విమర్శగా చదువుట నేర్పకుండుట, స్వతంత్రయోచనాశక్తిని పురికొల్పునదిగా బోధనాక్రమముండకపోవుట, రసానుభవమూ, వివేచనా లేకుండుట — యివి కారణములుగా ఆంగ్లసాహిత్య వ్యవసాయము నిష్ఫలమగుచున్నది."

పరిపక్వమైన విమర్శనా కౌశల్యమూ, గాఢమైన దేశభక్తీ లేనివారిని యిట్టి సంశయం బాధించదు. బాధించినా వారికిటువంటి సమాధానం దొరకదు. మన బానిసవిద్యావిధానపు నగ్నస్వరూపం అప్పారాయ మహాకవికి ఆనాడే గోచరమైంది!

1896 జూన్ 5 వ తేదీని లెక్చరర్ పదవినుండి సంస్థానపు శాసన పరిశోధకుడుగా నియమింపబడ్డారు. 'కన్యాశుల్కం' మొదటికూర్పు ఉపోద్ఘాతం 1897 జనవరి 1 వ తేదీని రాసినట్టుంది. పైరెండు తారీఖులబట్టి కన్యాశుల్కం అప్పారావుగారు లెక్చరరుగా వున్నప్పుడే రాసినట్టు స్పష్టమవుతుంది. అచ్చుకావడం ఆయన సంస్థానంలో ఉద్యోగం చేస్తుండగా జరిగింది.

చారిత్రక పరిశోధన

ఆయనకు చారిత్రక పరిశోధన చాలా యిష్టమైన విషయం. ద్రావిడ భాషా తత్వశాస్త్రంలో ఆయన ప్రవీణులు. వ్యవహారికభాషకు వ్యతిరేకంగా మద్రాసు విశ్వవిద్యాలయం చేసిన నిర్ణయానికి అసమ్మతి తెలియజేస్తూ అప్పారావుగారు రాసిన విపులమైనవ్యాసం [1] ఆయన భాషాతత్వశాస్త్ర పాండిత్యాన్ని కొంత తెలియజేస్తుంది. [2] కళాశాల పనినుండి విరామం దొరికిన కాలంలో అప్పారావుగారు చారిత్రక పరిశోధన చేస్తుండేవారు.

తొమ్మిది సంవత్సరాలు కాలేజీలో లెక్చరరుగా పనిచేసిన తరువాత, 'అప్పారావుగారిని ఆనందగజపతి మహారాజు 1896 జూన్ 5 న సంస్థానపు శాసనపరిశోధకుడుగా నియమించేరు. తమ్ముడు శ్యామలరావుగారి మృతి అప్పారావుగారిని చాలా ఆందోళనపర్చింది. ఆయన ఆరోగ్యం చెడిపోయింది. అప్పారావుగారికి విశ్రాంతికరంగా ఉండడానికి, ఆనందజగపతి

---

1. చూ. 'Minute of Dissent'

2. "ఆ 1895 సం.లో వ్రాసుకున్న డైరీలో మొదటినెలలోనే శ్రీ మహారాజావారివద్ద గ్రంధములు తమ వాడుకలోవున్నవని రికార్డుచేసుకున్నవాటిలో 'Campbell's 'Telugu Grgmmar' అనే తెలుగు వ్యావహారికభాషా వ్యాకరణం కనబడుతున్నది. కన్నడ నిఘంటువులున్నూ. Brown's Telugu Grammer న్నూ తాను కొనుక్కొనినట్లు రికార్డుచేసినాడు. తమిళులు ఆంధ్రం మాట్లాడేటప్పుడు చేసేమార్పులు రికార్డుచేసి పరిశీలించారు. తమిళదేశంలో త్యాగయ్యగారి తెలుగుపాటలే ప్రచారంలో నుండనేల? అని దీర్ఘ విచారణ చేసినారు. తమిళులు మాట్లాడే తెలుగుభాషలో ఆంధ్రపదముల అర్థముల మార్పులు కొన్ని కనిపెట్టి వ్రాసుకున్నారు. ఒకేభాష వివిధప్రాంతములలో యెట్టిఉచ్ఛారణ భేదములు పొందుతూవుండునో పరిశీలించి ఆ సూత్రముల ననుసరించి 'ప్రాచీన ద్రావిడము' అనేది ఆంధ్ర,కర్ణాట,తమిళ, మళయాళములుగా విభాగిల్లిన మార్గములని నిరూపించ దలచినారు. అప్పటికే శబ్దశాస్త్రములోకూడ ఆయనకు ప్రవీణతవున్నట్లు చెన్నపురి పెద్దలు గమనించిరని యీడైరీలలోని ఒక చిన్న సంభాషణ సూచికవల్ల తెలుస్తుంది:

మే 4 వ తేదీ శనివారం : "క్లబ్బులో కూరెళ్ళ సుబ్బారాయుడు కొడుకు వెంకటలింగం కనబడ్డాడు. ద్రావిడభాషాశబ్దశాస్త్రము (Dravadian phylology) ను గురించి అడిగితే కెల్లెటుగారు నన్నుగురించి ప్రశంసావాక్యములుచెబుతూ నావద్దకువెళ్ళి తెలుసుకోమన్నారని చెప్పినాడు. అయ్యా! తమరు దయచేస్తే నేను రోజూ క్లబ్బుకువస్తానని అతడన్నాడు. ఈ చెన్నపట్నములో వాళ్లు చాలా వింత మనుష్యులు."

చూ. "గురజాడ అప్పారావుగారి డైరీలు"

మహారాజు ఆయనను లెక్చరరు పదవినుండి శాసన పరిశోధకునిగా నియమించేరు.

విజయనగర సంస్థానాధీశ్వరులైన పూసపాటివారి వంశచరిత్రను సమగ్రంగా రాయడానికి అప్పారావుగారు చాల శ్రమించి పరిశోధనచేసేరు. మాడుగులమత్స్య వంశంవారి చరిత్ర, విశాఖజిల్లాలోని చాణుక్యుల చరిత్రా పరిశోధనచేసి, చాలా కొత్తవిషయాలు కనిపెట్టారు.

1 "విజయనగరం సంస్థానం చరిత్ర రాయడానికి తగిన భోగట్టా అంతా సంపాదించారుగాని, దాన్నంతా ఒకచో కూర్చి వ్రాయడానికి ఆయనకు అవకాశం లేకపోయిందనే అనుకోవాలి. రెండుసంవత్సరాలుగడువు ఆపనికై కోరాడు. అది కుదిరిందికాదు. ఈ విషయాలన్నీ యథాస్థిరూపంగా, పుస్తకాల అంచుల్లో టిప్పణీలక్రింద, చెల్లాచెదరై, సూత్రంలేని విడిపూసలక్రింద విరజల్లబడినట్టు ఉన్నాయి. సూత్రంవాని బుద్ధిలోనే యుండిపోయింది. వాని మిత్రుడు శ్రీ గిడుగు రామమూర్తిపంతులు వీనిని సమకూర్చడానికి ప్రయత్నించాడు[2]గాని, ఆయనకు అవకాశం చిక్కినట్లు కనిపించదు. పూసపాటి గజపతుల చరిత్రగాని, విశాఖజిల్లా చాణుక్యుల చరిత్రగాని చిట్టచివరకు ఆయన వ్రాయలేదు."

కళింగదేశ చరిత్రను రాయడానికి అప్పారావుగారు చాల విషయాల్ని సేకరించేరు. కాని ప్రచురణకర్తలైన విజ్ఞానచంద్రికామండలివారు ఆగ్రంథం గ్రాంధికభాషలోనే వుండాలనీ, అప్పారావుగారు వ్యవహారికభాషలో తప్ప రాయననీ, పట్టుపట్టడంవల్ల, పై వాటివలెనే కళింగ దేశచరిత్రకూడా మనసులోనే మరుగుపడిపోయిన మహాకవి భావసంపదలాగా యీనాటికీ చిత్తుప్రతిగానే వుండిపోయింది. ఇదికూడా సూత్రంలేని విడిపూసలుగా విరజల్లబడివుంది.

ఈచరిత్రలిలాగవుండగా దురదృష్టవశాత్తు ఆనందగజపతిమహారాజు కీర్తిశేషులవడంచేత సంస్థానపు వారసత్వపుదావాలో 1897 నుండి 1912 వరకు అప్పారావుగారు తలమునుకలుగా వుండిపోవలసి వచ్చింది. పదిహేను సంవత్సరాలలో అప్పారాయమహాకవి చారిత్రకపరిశోధనకు, సాహిత్యవ్యాసంగాలకూ పెద్దఆటంకాన్నికలిగించి, యీ వారసత్వపు దావా తెలుగుజాతికి రావలసిన మహదైశ్వర్యాన్ని రాకుండాచేసింది.

---

(1) ముత్యాలసరాలు, రెండవకూర్పులో కిళాంబి రంగాచారిగారు
(2) అప్పారావుగారి మరణానంతరం

యుద్ధమల్లుని శాసనప్రాచీనతనుగురించి జరిపినచర్చ ఆయనప్రతిభను సూచిస్తుంది. నవ్యాంధ్రవాగనుశాసనుడైన గిడుగు రామమూర్తిగారికి పరిశోధనలో అభిరుచి కలిగించినవారు వారి బాల్యస్నేహితులైన అప్పా రావుగారే।

శాసనపరిశోధకుడుగా అప్పారావుగారుచేసిన కృషికి ఆనందగజపతి మహారాజు 2,350 రూపాయిలు పారితోషికం యిచ్చేరు.

ఆనందగజపతిమహారాజు

1897 వ సం. లో ఆనందగజపతి మహారాజు కీర్తిశేషులయ్యేరు. ఇది అప్పారావుగారికి తీరని కష్టంగలిగించింది. తమడైరీలో అప్పారావు గారిలా రాసుకున్నారు:

"శ్రీవారి శీలమూ, వ్యక్తిన్నీ చాలా పరిణితిపొందిన వారిమనస్సుల నాకర్షించి నిష్కల్మషమైన సాత్వికముచేతను, మనఃపూర్వకమైన దయ చేతను, దైవికమగు సత్యముచేతను, అట్టివారిఅవాజ్యమైనభక్తి నరికట్టినవి. మా జీవితములు వారి జీవితములో అల్లుకుపోయినవి .... ప్రపంచము నుండి యొకజ్యోతి వెడలిపోయినది."

"కన్యాశుల్కం" కృతిసమర్పణంలో ఆనందగజపతిమహారాజు గురించి అప్పారావుగారు ఈక్రింద వ్రాసినది అతిశయోక్తికాదు.

"....జ్ఞానసముపార్జనం వ్యసనంగాగలవాడు. ఆయన సారస్వతానికి చేసిన ప్రశంసాయుతమైన ప్రోత్సాహం సారస్వతసార్వభౌముల్ని ఆయన ఆస్థానికి ఆకర్షించి, తెలుగు సారస్వత చరిత్రలో ఒక ఉజ్వల శకాన్ని ప్రారంభించింది."

కొల్లూరు కామశాస్త్రులు, పేరి వెంకటశాస్త్రులు, మండా చిట్టికామ శాస్త్రులు, భగవత్యవి ముడుంబై నరసింహాచార్యస్వామి, మైసూరు భీమా చార్యులు, "ఆంధ్రకవిజీవితములు" రాసిన గురుజాడ శ్రీరామమూర్తి గార్లవంటి ప్రఖ్యాత విద్వాంసులు; ప్రిన్సిపాల్ కిళాంబి రామానుజా చార్యులు, కోదుభాషకు వ్యాకరణాన్ని సృష్టించిన లింగం లక్ష్మీజీపండితుడు, విష్ణల రామస్వామిశర్మ, గురజాడ అప్పారావుగార్లవంటి ఆంగ్లాంధ్ర సంస్కృతభాషాకోవిదులు; దూర్వాసుల సూర్యనారాయణశాస్త్రి. గురాచార్య వెంకటరమణదాసు, కర్రి పద్మనాభస్వామి, కలిగొట్ల కామరాజు, మతము

రాయాచార్యులు, కవిరాయుని వెంకటరమణయ్య, మహబత్ ఖాన్, మన్వర్ ఖాన్, అబిదుల్లాఖాన్, నిషావల్లీ ఖాన్ గార్లవంటి సుప్రసిద్ధ సంగీత శాస్త్రజ్ఞులు ఆనందగజపతి మహారాజుసభ నలంకరించిన ఉజ్వల నక్షత్రాలు.

"ఆనందగజపతి మహారాజుకు సాహిత్యాది కళాగోష్ఠి అక్షరాలా వ్యసనమైవుండేది. "ప్రభువు రాజ్యభారము మాతృశ్రీవారికినీ, మేనేజర్లకును ఒప్పగించి, నిత్యము సంగీత సాహిత్య విద్యావినోదములచేతనే కాలము గడుపుచువచ్చెను. ప్రతిదినము సాయంకాలము పండితసభ రాజమహలులో జరుగుచుండెను." *

1910, 1911 ఉగాది సంచికలలో కొంతభాగం ప్రచురింపబడి అసంపూర్ణంగా నిలచిపోయిన 'బిల్హాణీయం' అన్న అప్పారావుగారి నాటకంలో, ఆనందగజపతి దర్బారు విశేషాలు, ఆకాలపు విజయనగర సంస్థానంలోని ప్రధానపురుషుల పోలికలూ చాల కనిపిస్తున్నాయని అప్పారావుగారి శిష్యులైన డాక్టరు బుర్రా శేషగిరిరావుగారు అభిప్రాయపడుతున్నారు.†

పైని పేర్కొనబడ్డ విద్యావ్యాసంగాలే కాకండా ఆనందగజపతి మహారాజు ఆదరణకింద నాటకసమాజం ఒకటి వుండేది. సంస్కృతాంధ్రాంగ్ల నాటకాలాడేవారు. నటులు సాహిత్యంగలవారు. మొట్టమొదట 'కన్యాశుల్కా'న్ని యీ నాటకసమాజమే ప్రదర్శించింది.

ఆయన పోషకత్వంలో 'తెలుగుహార్పు' అన్న ఆంధ్రాంగ్లపత్రిక ప్రచురింపబడేది. అప్పారావుగారు మొదలైన ప్రముఖులరచనలు అందులో వెలువడేవి. 'తెలుగుహార్పు' వ్యవహారికాంధ్రానికి స్థానంయిచ్చిన మొట్టమొదటి పత్రిక.

ఈ 'విద్యాభోజుడు' విజయనగరం కళాశాలను విశ్వవిద్యాలయంగా చెయ్యడానికి ప్రయత్నించేరు. కాని నెరవేరలేదు.

ఆనందగజపతి మహారాజు బ్రతికివున్నంతకాలం సర్వకాల సర్వావస్థల్లో అప్పారావుగారిది సారస్వత జీవితమనే చెప్పాలి. సర్వసాధారణంగా అప్పారావుగారిపడకకూడా కోటలోనే. ఉదయం కోటలోకివెళ్లితే యెప్పుడో రాత్రివేళ యింటికి వచ్చేవారు. భోజనం, అల్పాహారాదులు అక్కడేజరిగేవి.

---

* 'ఆనందగజపతి విద్యావినోదములు' — ఆంధ్రపత్రిక తారణ సంవత్సరాది సంచికలో ఆడిదము రామారావుగారు.

† చూ. 'అప్పారావుగారి డైరీలు'

ఇంగ్లీషుమోజు అపరిమితంగావున్న ఆరోజుల్లో మహారాజుగారు అప్పారావుగార్ని ప్రోత్సహించి, ఆయన తెలుగురచనలు చేయడానికి కొంతవరకు కారణభూతులయ్యేరని వినికిడివుంది. సంస్కృత పద్య రచనకంటె తెలుగుపద్యరచన కష్టతరమైనదని అప్పుడు అప్పారావుగారు భావించేరట. సులభశైలికోసరం అప్పారావుగారు కంకణం కట్టుకొని నిలవడం యీందువల్లనే జరిగి వుండవచ్చు.

కన్యాశుల్క వివాహాల లెక్కలు సంగ్రహించడానికి ఆనందగజపతి మహారాజు 'కన్యాశుల్కం' రచనకు పదేళ్ళకుపూర్వం—సుమారు 1886-87 సం. మధ్య – ఏర్పాటుచేసేరు. అప్పారాయ మహాకవితోవున్న సన్నిహిత సంబంధంబట్టిచూస్తే, ఆయనను మహారాజు కన్యాశుల్కం రాయడానికి ప్రోత్సహించి వుండవచ్చు. ఆంధ్రసాహిత్యంలో నూతనశకాన్ని స్థాపించిన ఆకావ్యానికి కృతిభర్తయై ధన్యులయ్యేరు కృతులు రచింపించి గణుతికెక్కిన కవిరాజు.

పండితుడు, కవి, సంగీతాది కళాకుశలుడు, బహుభాషాకోవిదుడు, కళాపోషకుడు, ఆనందగజపతి మహారాజు. పురాణప్రబంధయుగాలు రాజరాజనరేంద్ర, కృష్ణరాయల ఆదరాభిమానాలవల్ల ప్రారంభమైనట్టే, నవ్యాంధ్ర సాహిత్యయుగానికి ఆనందగజపతి మహారాజు ఆదరాభిమానాలుండేవి. ఆనందగజపతి మహారాజు అకాలమృతివల్ల తెలుగు సారస్వతానికి తీరనినష్టం కలిగింది. పరిపక్వమై, ఆంధ్రసంస్కృతికి పెన్నిధులను సమకూర్చగల అప్పారావుగారి అమూల్యజీవితంలో సుమారు పదిహేను సంవత్సరాలకాలం, మహారాజు తదనంతరంవచ్చిన వారసత్వం దావాలో వ్యయపడి తెలుగు సారస్వతానికి తీరవినష్టం కలిగింది.

అయినా వీలుచిక్కినప్పుడు సారస్వత వ్యాసంగాన్ని అప్పారాయ మహాకవి చెయ్యక మానేవారుకాదు.

మహారాజు కీర్తిశేషులవడంవల్ల అప్పారావుగారు 1898 లో శాసన పరిశోధకుని (ఎపిగ్రఫిస్టు) పనినుండి, మహారాజుసోదరి రీవా మహారాణి అప్పలకొండయాంబగారికి కార్యదర్శిగా బదిలీ అయ్యేరు.

దే శ భ క్తి

ఇక్కడ కొంచం ఆగి, అప్పారావుగారు మహాకవి, మహాపురుషుడు కావడానికి సహాయపడ్డ ఆనాటి భౌతికపరిస్థితులను సింహావలోకనం చెయ్యవలసి వుంది.

'సిపాయిల తిరుగుబాటు' [1] బ్రిటిష్‌ప్రభుత్వపు పిడికిలినుండి తప్పించుకోడానికి భారతీయులుచేసిన పెద్ద ప్రయత్నాలలో ఆఖరుది. అప్పటికి వేళ్లతన్నుకపోయిన బ్రిటిషుసామ్రాజ్య మహావృక్షాన్ని కదల్చివేసింది. కాని పెకలించి వెయ్యలేకపోయింది. 'తిరుగుబాటు' అణచివేయబడింది. కాని భారత స్వాతంత్ర్య కాంక్ష అణగారిపోలేదు.

మహాకవి 1861 సం. లో—అంటే 'తిరుగుబాటు' విఫలమైన నాలుగేళ్ళ తరవాత—జన్మించేడు.

[2] సామ్రాజ్యతత్వ దోపిడీవిధానం భారతదేశపు మూలుగులు పీల్చుకుంటూంది. దేశం నాలుగుమూలలా కరువుకాటకాలు దావానలంలాగ వ్యాపిస్తున్నాయి. అంతవరకూ నివురుకప్పిన నిప్పుగా పడివున్న అసంతృప్తి, అశాంతి జ్వాలలు ప్రభుత్వాన్ని ఆవరించుకుంటున్నాయి. అక్కడక్కడ ప్రభుత్వంమీద తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. బ్రిటిష్ ప్రభుత్వాన్ని పెద్ద దెబ్బతియ్యడానికి లోలోపల ప్రయత్నాలు జరుగుతున్నాయి. పండువంటి భారతదేశం చేజారిపోయే పరిస్థితులేర్పడుతున్నాయి. బ్రిటిష్ ప్రభుత్వం మేలుకొంది. తన రాజనీతి తంత్రజ్ఞతను ప్రదర్శించింది. తీవ్రత చెందుతూన్న జాతీయ భావాలను బుజ్జగించి జోకొట్టడానికి పూనుకుంది. బ్రిటిష్ ప్రభుత్వం భారతీయులకు ఆశలు చూపింది. ప్రభుత్వ నిర్వాహణలో భారతీయులకు భాగం యిస్తానంది. మితవాద దృక్పధంగల భారతీయ మేధావులు కాంగ్రెసుసంస్థను [3] నిర్మించడానికి ప్రోత్సహించింది. స్వాతంత్ర్య భావప్రవాహం శాసనబద్ధమైన ఆందోళనా పద్ధతులవైపు మళ్ళింది.

భారతీయ మేధావులలో బాగా రాజకీయభావసంచలనం జరుగుతున్న ఆపరిస్థితులు యువకుడైన అప్పారాయమహాకవిమీదకూడా తమప్రభావాన్ని

1. 1857 వ సం॥

2. చూ. 'నేటిభారతదేశం' శీర్షికలలో 'భారతజాతీయోద్యమం.' పామీదత్తు.

3. 1885 లో కాంగ్రెసు పుట్టుక.

చూపెట్టేయి. శంభుచంద్రముఖర్జీగారు అప్పారావుగారికి రాసిన ఉత్తరాలు * యీవిషయాన్ని స్పష్టపరుస్తాయి. స్వాతంత్ర్యభావాలు అప్పారావుగారిని రాజకీయ పద్యకావ్యాన్ని రాయడానికి ప్రేరేపించినట్టు ఆ వుత్తరాలు వ్యక్త పరుస్తున్నాయి.

1887 అక్టోబరు 27 డైరీలో తాను స్థానికంగా జరిగిన కాంగ్రెసు మీటింగులో ఉపన్యసించినట్టువుంది. ఆరోజుల్లో కాంగ్రెసు సభలు విజయ నగరంలో జరుగుతున్నట్టూ, వాటిలో కళాశాల ఉపాధ్యాయులు ఉపన్యాసా లిస్తున్నట్టూ, 'తెలుగుహార్ప్'లో ఆ వార్తలు పడుతున్నట్టూ అప్పారావు గారి డైరీలవల్ల మనకు తెలుస్తుంది.

'కొండుభట్టీయం' 'కన్యాశుల్కం'లలో జాతీయోద్యమం విషయా లక్కడక్కడ కనిపిస్తాయి.

'గిరీశం' వెంకటేశాన్ని సురేంద్రనాథబెనర్జీ అంతటివాణ్ని చేసే స్తానని టప్పాలుకొడతాడు — బండివాడికి కాంగ్రెసునుగురించి దీర్ఘోప న్యాసం చేసేక, రామాయణం అంతావిని రాముడికి సీతేమవుతుందన్నట్టు, కాంగ్రెసువారు వాళ్ళవూరు పోలీసువాణ్ణి ఎప్పుడు బదిలీచేస్తారో చెప్ప మని అడుగుతాడు — † 'ది ఎలవెన్ కాజెస్ ఫర్ ది డిజనరేషన్ ఆఫ్ ఇండియా' అన్న విషయంమీద బ్రహ్మాండమైన ఉపన్యాసం తాను పూనాలో యిచ్చినట్టు గిరీశం చెప్పుకుంటాడు — 'కొండుభట్టీయం' లో మంజువాణి యింట్లో బంగారాన్ని సంగ్రహించడానికి బయలుదేరుతున్న కొండిభట్లు యేదో కేకవిని 'వందేమాతరం గుంటడి' నినాదమేమోనని అనుకుంటాడు.

1910 వ సంవత్సరానికి పూర్వం — అంటే 'ముత్యాలసరాల కూర్పుకు పూర్వం — రాసిన యీ రెండు నాటకాలలో వెలువడిన జాతీయ భావాలు సంస్కారాశయాలు ముత్యాలసరాలలో పరిణితి చెందేయి.

మితవాదధోరణిలోవున్న రాజకీయాలు రానురాను తీవ్రత చెందు తున్నాయి. సామ్రాజ్యవాదుల దుశ్చేష్టితాలు మేధావులతోబాటు ప్రజలకు కూడా వెగటుకలిగిస్తున్నాయి. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం అన్న నినా దాలు ప్రపంచమంతటా మారుమోగుతున్నాయి. వంగరాష్ట్రవిభజనం భారత దేశమందంతటా బ్రిటిష్వ్యతిరేకోద్యమానికి ఒక కొత్తరూపాన్నిచ్చింది.

* 1884 జనవరి 27; 1884 జూన్ 22 తేదీల ఉత్తరాలు.

† The Eleven Causes for the Degenaration of India

జాతీయోద్యమానికి ప్రభుత్వంతో బహిరంగంగా సంఘర్షణ మొద లైంది. ప్రదర్శనాలు, సభలు, హర్తాళాలు ప్రజలు చేయసాగేరు. ప్రభుత్వం నిర్బంధవిధానాన్ని అవలంబించింది. అప్పటివాతావరణాన్ని 'కాంగ్రెసు చరిత్ర' • యీవిధంగా వర్ణిస్తూంది.

"ప్రభుత్వము వారవలంబించిన యీ నిర్బంధ విధానము 1905-1906 లోని జాతీయోద్యమము నణచివేయుటకు బదులుగా 'నగారాను జోకొట్టి' నట్లయినది. ఆనాడెక్కడో ఒకమూలజరిగిన సంగతులు యావ ద్భారత దేశమునకు వెల్లడైనవి. ప్రభుత్వమువారు వంగరాష్ట్రములో నవలం బించిన నిర్బంధవిధాన ఫలితములు దేశమంతటను దృగ్గోచరమైనవి. వంగ రాష్ట్రసమస్య అఖిలభారత సమస్యయైనది. ప్రతి రాష్ట్రమునందలి ప్రజలూ, ఎన్నాళ్ళనుండియో వారి హృదయములలో దాగియున్న అసంతృప్తిని వెల్లడించి. జాతీయాందోళనము నింకను బలవత్తరముగాచేయ ప్రారం భించిరి..... లాలాలజపతిరాయులును, సర్దార్ అజితసింగును ప్రవాసము నకు పంపబడిరి. ఇట్టి తరుణములో కలకత్తా కాంగ్రెసుకు భారతపితా మహుడు దాదాభాయినౌరోజీ అధ్యక్షుడుగా నెన్నుకొనబడుట చాల సమంజ సము. ఆయన స్వరాజ్యము భారతదేశ రాజకీయోద్యమమునకు పరమావధి అనిచెప్పెను."

పాఠశాలా బహిష్కారోద్యమముచే, జాతీయవిద్యా ప్రాముఖ్యాన్ని గుర్తించడం జరిగింది. 1906 కలకత్తా కాంగ్రెసు జాతీయ విద్యావిధానం గురించి తీర్మానంచేసింది. 1907 లో బిపిన్‌చంద్రపాల్‌గారు ఆంధ్రదేశ పర్యటనంచేసి జాతీయాందోళనను రగిల్చేరు. అప్పుడే బందరులో జాతీయ విద్యాలయం స్థాపించబడింది.

అరవిందునివంటి మేధావులు జాతీయోద్యమంలో పాల్గొన్నారు.

అనేకులకు ప్రవాసశిక్షలు, ఉరిశిక్షలు విధింపబడ్డాయి. జాతీయోద్య మంలో దౌర్జన్యపద్ధతులుకూడ పొడచూపేయి. భారతదేశంలోను, ఇంగ్లం డులోకూడ, భారతీయులు రాజకీయహత్యలు చేయసాగేరు.

1908 జులై 13 వ తేదీని బాలగంగాధర తిలక్‌గారు అరెస్టుచేయ బడ్డారు. మనరాష్ట్రంలో ఆనాడే గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారితోబాటు మరియిద్దరు దేశభక్తులు అరెస్టుచేయబడ్డారు.

• భోగరాజు పట్టాభిసీతారామయ్యగారి "కాంగ్రెసు చరిత్ర"

1910 లో వ్రాసిన ముత్యాలసరాలకు యీ పరిస్థితులు చాలా దోహదంచేసి వుండకతప్పదు.

"దేశమును ప్రేమించుమన్నా
మంచిఅన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయి
గట్టిమేల్ తలపెట్టవోయి"

అనీ,

"దేశాభిమానం నాకు కద్దని
వొట్టిగొప్పలు చెప్పుకోకోయి;
పూని యేదైనాను వొకమేల్
కూర్చిజనులకు చూపవోయి"

అనీ అప్పారాయమహాకవి ప్రబోధించేరు.

"దేశమంటే మట్టికాదోయి
దేశమంటే మనుషులోయి" ('దేశభక్తి')

దేశం పూజాపునస్కారాలు చెయ్యవలసిన దేవతామూర్తికాదనీ, మనుషులే దేశమనీ, గొంతెత్తిపాడేరు.

"పంజరంబుననున్న కట్లను
పగలదన్నగలేక స్రుక్కితి;
నింగిపర్వగలేని జన్మము
సీరసంబని రోసితిన్" ('లంగరెత్తుము')

పై నుదహరించిన అప్పారాయమహాకవి వాక్యాలమీద జాతీయోద్యమ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ముత్యాలసరాల్లో ఆనాటి రాజకీయ సాంఘిక, సాహిత్య సంస్కారాశయాలు ప్రతిబింబించాయి.

మద్రాసు ఓరియంటల్ డ్రమెటిక్ కంపెనీ అధ్యక్షులూ స్థాపకులూ, ఆనందగజపతి మహారాజా విద్వద్బృందంలో ఒకరూ అయిన జి. సి. వి. శ్రీనివాసాచార్యగారు రచించిన ఇంగ్లీషు హరిశ్చంద్ర నాటకానికి, అప్పారావుగారు వ్రాసిన ఉపోద్ఘాతంలో ఆనాడు జరుగుతున్న సంస్కృతీ విప్లవాన్ని ఆయన యెంతచక్కగా విలువకట్టేరో తెలుస్తుంది. 1897 జనవరి 4 వ తేదీని అప్పారాయ మహాకవి ఉపోద్ఘాతంరాసేరు :

"రాష్ట్రాంతర వార్తా, వ్యవహార నిర్వహణ లో, ఇంగ్లీషుభాష, సంస్కృత, హిందుస్థానీభాషలను త్వరితగతితో స్థానభ్రష్టత్వం కలిగిస్తుంది. అంతేకాకుండా, ప్రతిసంవత్సరం అధికమవుతూన్న విద్యావంతులద్వారా నూతనభారతదేశాన్ని నిర్మించింది. ఈ విద్యావంతులలో పూర్వం జాతీయ భావాలు అనాచరణీయంగాను, అవాస్తవికంగాను వుండేవి. పురాతన భావాలకు నూతనభావాలతో సంపర్కం కలిగినప్పుడు అవశ్యంగా వుత్పన్నమయ్యే ఉత్సాహమూ, నూతన కార్యాచరణాపేక్ష, యిప్పుడు చాలా త్వరత్వరగా పెంపొందుతున్నాయి."

ఆ ఉపోద్ఘాతంలోనే, ఆంగ్లేయులకు భారతీయులకుకూడా హరిశ్చంద్ర నాటకం యెలా పనిజేస్తుందో తెలియచేసేరు :

"హరిశ్చంద్రుని సత్యదీక్ష, సత్యాచరణానికీ, సత్యవాక్య పరిపాలనకు తదితర విషయాలన్నిటినీ లోబర్చడమూ, ఆకిథారచనకాలంలోని భారత దేశహృదయాన్ని తెలియజేస్తుంది. ఈకథ సహృదయులైన ఆంగ్లేయులకు, భారతదేశ ఆదర్శాల ఉత్కృష్టతను చూపడానికి పనికివస్తుంది. అంతేకాకుండా, విద్యావంతులైన హిందువులలోనూ, వారి పలుకుబడిలోనికి వచ్చిన స్వదేశీయులలోనూ, శతాబ్దాల రాజకీయ బానిసత్వంవల్ల మరుగుపడిపోయిన ఉన్నతభావాలను పెంపొందించడానికి పనికివస్తుంది."

విచక్షణాజ్ఞానంలేకుండా పాశ్చాత్యనాగరికతా ప్రభావంలోపడి, మన ఆదర్శాలను మర్చిపోవడమేకాకుండా, పాశ్చాత్యుల ఆదర్శాలనుకూడా అలవర్చుకోలేని భారతీయులకు, జాతీయవీరులకథలు ఉత్తేజపరచి, దేశాభ్యుదయానికి తోడుపడతాయి ఈ ప్రయోజనమే హరిశ్చంద్రనాటకానికుందని అప్పారాయ మహాకవి అభిప్రాయం.

ఉత్కృష్ట జాతీయభావాలను జీర్ణించుకొన్న ప్రతిభావంతుడు గనుకనే అప్పారావుగారు దేశభక్తియుతమైన ముత్యాలసరాలను రచించగల్గేరు. నవకవులకు "స్వాతంత్ర్యపుటూర్పుపోసిన పరమేష్ఠి.... దేశభక్తి అంటేఏమిటో మొదట తెలియజెప్పిన మహానుభావుడితడే."[1]

నేటి కవులు ఆంధ్రాభిమానాన్నీ, దేశాభిమానాన్నీ బానిసప్రజల శ్రేయస్సునూ రేకెత్తించే కవిత్వంరాసేరంటే, వారివి ఉద్రేకపర్చిన స్వాతం

1. 'గురజాడ వాల్మీకి'. ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు.

త్ర్యోద్యమంతోబాటు జాతికి త్రోవచూపిన అప్పారాయ మహాకవి చలవే కారణమని నిస్సంశయంగా చెప్పవచ్చు.

స్వాతంత్ర్యపోరాటంలో ఐక్యత ప్రధానపాత్ర వహిస్తుంది. ఈనాటి రాజకీయాలలో ఐక్యతారాహిత్యంవలని దుష్ఫలితాలను విషాదకరమైన ఉదాహరణగా తీసుకోవచ్చు.

"ఓర్వలేమి పిశాచి దేశ-
మూలుగులు పీల్చేసెనోయి.
ఒరుల మేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయి :"

మతసామరస్యం గురించి మహాకవి ప్రబోధం :

"మతం వేరైతేను యేమోయి ?
మనసులొకటై మనుషులుంటే
జాతమన్నది వేచిపెరిగి
లోకమునరాణించునోయి !"

"చెట్టపట్టాల్ పట్టుకుని
దేశస్థులంతా నడవవలెనోయి
అన్నదమ్ములవలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయి." ('దేశభక్తి')

దేశంలో జాతీయోద్యమం అభివృద్ధిఅవుతుంటే ఒకవేపు సంకుచిత దృక్పథాలుకూడా పొడచూపేయి. సంకుచితదృష్టిగల హిందువులుకొందరు దేశానికి తామేవారసులమనీ, యితరులకు దేశంలోహక్కులేదనీ, యీనాటి లాగనే, వాదించేరు. చరిత్రజ్ఞానంతోను దేశభక్తి జనితమైన ఐక్యతా ప్రీతితోను చేసిన మహాకవి హెచ్చరికను వినండి :

"నిన్నవచ్చా రింగిలీషులు
మొన్నవచ్చిరి ముసలమను; లటు
మొన్న వచ్చినవాడ వీవని
మరచి, వేరులుబెట్టకోయి" *

* 'దేశభక్తి' అన్న శీర్షికతో ప్రచురింపబడ్డ గేయాల చిత్తుప్రతిలో యీ గేయంవుంది. ప్రచురింపబడినవాటిలో యిది చేర్చలేదు. మహాకవి స్వహస్త లిఖితంగావున్న యీ చిత్తుప్రతి వేరొకచోట యధాతథంగా ముద్రించబడింది.

మాతృదేశంగా భావించేవాళ్ళందరికోసం భారతదేశం అని ధ్వని.

'దేశమును ప్రేమించుమన్నా' దేశస్వాతంత్ర్యమన్నా దేశసౌభాగ్యమన్నమాట. అందుకే

"యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయి?"

అని మహాకవి ప్రశ్నిస్తున్నాడు.

"పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయి:
తిండికలిగితె కండకలదోయి
కండకలవాడేను మనిషోయి!"

"దేశమనియెడి దొడ్డవృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయి
నరులచెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయి!"

ఆ ఆదర్శసిద్ధికి

"మందగించక ముందు అడుగేయి
వెనకపడితే వెనకేనోయి!" అని హెచ్చరిస్తున్నారు.

సంఘ సంస్కారాశయాలు

ప్రాచ్యపాశ్చాత్యభావాల 'మేలుకలయిక'వల్ల, దేశాభ్యుదయానికి వేరుపురుగులైన సంకుచిత మూఢాచారాలకు వ్యతిరేకంగా దేశమంతటా ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. వంగరాష్ట్రంలో ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు, మహారాష్ట్రంలో మహాదేవ గోవిందరెనడే, మన తెలుగువారిలో యుగపురుషుడు వీరేశలింగంవంటి మహాపురుషులు దేశంలో అవతరించారు. సమాజాన్ని పట్టిన వేరుపురుగులను నాశనంచేస్తేనేకాని 'దేశమనియెడి దొడ్డవృక్షం' నిలబడలేదని గ్రహించి సంఘసంస్కారానికి తుపాను లేవదీసేరు.

వర్ణవ్యవస్థ, అంటరానితనం మొదలైనవి పెనుభూతాలవంటి సమస్యలయ్యేయి. ఈసందర్భంలో అప్పారావుగారి అభిరుచులు, కార్యదీక్ష

యేవిధంగా రూపొందుతూ వచ్చేయో ముత్యాలసరాలచూర్పు కొంత విశద పరుస్తుంది :

"[1]ఒకసారి మనోహరమగు స్త్రీల పాతపాట ఒకటి అప్పారావుగారి చెవినిబడి మనసున క్రొత్తసంగీతము తిరుగగా, తెనుగున ఒక క్రొత్త ఛందము నడిపింపవలెనని సంకల్పముదయించెను. 1910 లో బరంపుర మున జరిగిన నానావర్ణ సహపంక్తి భోజనములో అప్పారావు పాల్గొని నాడు. ఆ సంవత్సరమే తోకచుక్క (Halley's comet) పొడిచినది. ఒక విచిత్రమైన భావమథనమున అప్పారావు రసికచిత్తమువనుండి ఒక క్రొత్తకవితావేశము రూపుకట్టినది."

తాను జీవిస్తున్న ప్రపంచానికి అతీతుణ్ణికానని మనసారానమ్మే కవిభావన, అతనిచుట్టూరావున్న వాతావరణం ప్రభావం చూపకతప్పదు, నిజమైన కవిభావన ప్రతి చిరుగాలికీ చలించే ఆకువంటిది.

నానావర్ణ సహపంక్తి భోజనంలో పాల్గొని వర్ణవ్యవస్థను ధిక్క రించిన ఆదర్శవాది అప్పారావుగారు :

"ఎల్లలోకములొక్కయిల్లై
వర్ణభేధములెల్ల కల్లై
వేలనెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియ"

"మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలచివెలుగును;
అంతస్వర్గసుఖంబులన్నవి
యవని విలసిల్లున్."

పై రెండుగేయాలు, వర్ణానికీ, మతానికీ, దేశానికీ అతీతమైన జ్ఞానమే శాశ్వతమనీ అది సుస్థాపితమైననాడే 'స్వర్గసుఖంబులన్నవి యవని విల సిల్లు'ననీ అప్పారాయ మహాకవి తమ ఆదర్శప్రీతిని వ్యక్తపరచుకున్నారు. ఈగేయాలలో విశ్వమానవ సౌభ్రాతృత్వమూ, అంతర్జాతీయతా ప్రబోధింప బడ్డాయి.

---

1. 'ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము'లో కొంపెల్ల జనార్ధనరావుగారు.

మన వర్ణధర్మాల్లోని అక్రమాన్ని విమర్శించేరు మహాకవి. మాలకులం ఎలాగ ఏర్పడింది ?

"మలిన వృత్తుల మాలవారిని
కులములేర్చిన బలియురొక చె
శమున కొందరి వెలికిదోసిరి
మలినమే మాల."

కులంగలవాళ్ళెవరు ?

"కులములేదట ఒక్క వేటున
పసరముల హింసించువారికి;
కులముగలదట నరుల ద్రేచెడి
క్రూర కర్ములకున్."

మనవర్ణధర్మం యెంతధర్మమైనది ?

"మలినదేహుల మాలలనుచును
మలినచిత్తుల కధిక కులముల
నెలవొసంగిన వర్ణధర్మ
మధర్మ ధర్మంబే."

నిజమాలోచిస్తే ?

"మంచిచెడ్డలు మనుజులందున
యెంచిచూడగ, రెండె కులములు"

ఆ 'మంచియన్నది మాలయైతే, మాలనే అగుదున్!' అని 'లవణ రాజు కల'లో నాయకుని గొంతుకతో మహాకవి తమ ఆశయాలను వెల్లడించారు.

1910 లో తోకచుక్క కనిపించింది. యేదో పెద్దప్రళయం ముంచుకవస్తుందని ప్రజలలో అలజడిపుట్టింది. ఈ మూఢనమ్మకాన్ని అప్పారాయమహాకవి ఎదుర్కొన్నాడు.

"అరుదుగా మిను చప్పరంబున
చొప్పు తెలియని వింతపొడమగ
చన్నకాలపు చిన్నబుద్ధులు
బెదిరి యెంచిరి కీడుగా"

"కవులకల్పన కలిమినెన్నో
వన్నెచిన్నెలు గాంచువస్తువు
లందు వెర్రిపురాణగాథలు
నమ్మజెల్లనె పండితుల్"

లోకమక్కసుగురించి యదార్థాన్ని చెపుతున్నారు :

"దూరబంధువు యితడు భూమికి,
దారిపోవుచు చూడవచ్చెను—
దెబ్బదెనుబదియేండ్ల కొకతరి
నరుల కన్నులపండువై"

తరువాత, తోకచుక్కను చమత్కరించి చెప్పుతున్నారు :

"అంతెకాని రవంతయైనను
వంతనేగతి కూర్చనేర్చునె,
నలువనేరిమి కంతుయిదియన
నింగి తొడవయి వ్రేలుచున్"

"తెగులుఖకిరవని కతలపన్నుచు
దిగులుచెందు టిదేటికార్యము ?
తలతునేనిది సంఘసంస్కర
ణ ప్రయాణ పతాకగాన్"

పాశ్చాత్యభావాల సంపర్కంవల్ల ఆనాడు మొలకలెత్తిన నూతన భావాలులేని రచన ఒక్కటికూడా అప్పారావుగారు చేయలేదని చెప్పవచ్చు. అలాగని మన సంస్కృతినీ, సాంప్రదాయాలను పూర్తిగా తృణీకరించ లేదు. కాలాన్ని అతిక్రమించిన సాంప్రదాయాలను, సంకెళ్ళగా పరిణమించిన సాంప్రదాయాలను మాత్రం తెంచివేసి తెలుగు సాహిత్యానికి నూతన చైతన్యాన్నీ, నూతన స్వాతంత్ర్యాన్నీ, నూతన వికాసాన్నీ ప్రసాదించేరు.

అలాగే పాశ్చాత్యుల సంస్కృతినీ, సాంప్రదాయాలనూ విచక్షణ లేకుండా స్వీకరించలేదు. అప్పారావుగారు స్వీకరించినది పాశ్చాత్యుల నాగరికత — అనాగరకత కాదు.

"తిన్నగా నని వస్తుతత్త్వము
కాంచనేర్పును వింగిలీషు;
కల్లనొల్లదు; సారవిద్యల
కరచి సత్యము నరసితిన్"

చిన్నప్పటి ఇంగ్లీషు భాషావ్యామోహంనుండి మాతృభాషను చేపట్టటం, ఆయన మన సంస్కృతిని తిరస్కరించకపోవడమే కాకుండా గౌరవ భావం చూపేరనడానికి ఒక నిదర్శనం. అప్పారాయ మహాకవి మన సంస్కృతికి పంగనామంపెట్టేరని కొందరు భావించడంవల్ల యిదంతా చెప్పవలసివచ్చింది.

ఆయన రచనలు 'కొత్తపాతల మేలుకలయిక' మాత్రమే కాదు; 'కొమ్మెరుంగులు జిమ్మిన ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల మేలుకలయిక కూడా అని అప్పారాయమహాకవికి అర్ధశతాబ్దం తిరవాతనున్న మనకు స్పష్టపడింది.

వితంతువివాహం, సానిమేళాల్ని బహిష్కరించటం, మతంపేరిట జరుగుతున్న మోసాలు, అంటరానితనం, వర్ణవ్యవస్థలోని అవకతవకలు మొదలైన అనేకసమస్యలను రచనావస్తువులుగాతీసుకొని తెలుగు సాహిత్య భూముల్లో బంగారుపంటలు పండించేరు.

'దిద్దుబాటు' అన్న కథానికలో కథానాయకుడు సానిమేళం మోజు నుంచి తప్పుకోలేక వాటికి హాజరవుతూ, ఎక్కడికివెళ్ళేరని భార్యఅడిగితే మీటింగులకెళ్తున్నాననీ, 'లోకోపకారకరములగు నుద్యమముల నిదుర మాని' చేస్తున్నాననీ అబద్ధాలాడతాడు. కాని మంచివాడు. భార్య అలకను అర్ధంచేసుకొని పశ్చాత్తాపపడతాడు. నౌకరును కొట్టినందుకు విచారిస్తాడు. దర్పాదటూలేకుండా తనుచేసిన తప్పును దిద్దుకోవడానికి ఆందోళనపడతాడు. తను రాత్రిళ్ళు సానిమేళానికివెళ్ళడం భార్యకు వెల్లడైపోయి అలిగి పుట్టింటికి వెళ్ళిపోయిందని భ్రమించి బాధపడతాడు, విద్యావంతురాలు, నేర్పరి, భర్తపై మమకారంగల స్త్రీ "కమలిని" తాతలనాటినుండీ యింటిని కనిపెట్టుకునివున్న నౌకరు తీసుకోవలసినచర్యవు తీసుకొని రాముడు, కమలినిచేసిన 'కుట్ర'లో సహకారంచేస్తాడు. భర్తకు తను చెప్పదలుచుకున్న 'పాఠం' తలకెక్కిందని కనిపెట్టి, రసాభాసంకాకుండా మంచంకిందినుంచి కమలిని బయటికివస్తుంది. దీంతో, పర్యవసానంగురించి ఆతృతగావున్నచదువరిని,

కాథానాయకుణ్ని ఆశ్చర్యంలోను సంతోషంలోనూ ముంచి కథకుడు కథను సుఖాంతంచేస్తాడు.

'మీపేరేమిటి?' అన్న కథానిక అక్షరాలాసాటిలేనిది. దీన్ని మించిన కథానిక మన సాహిత్యంలో యిప్పటికికూడా పుట్టలేదంటే అతిశయోక్తికాదు

శైవ వైష్ణవమతాల పోటీలలో మోసగాళ్లూ, మతోద్రేకులూచేసే పనులు ప్రజల మనస్సులమీద యెలాగ పనిచేస్తున్నాయో, పూజాపునస్కారాలు దేవుళ్ళ యెలాపుడుతున్నారో యెలాగ పరిణామంచెందుతున్నారో అన్న విషయాలను - ఆయనకు ఆయనేసాటి అన్నట్టుగా - చిత్రించేరు.

అప్పారావుగారు యీకథలో మూడురకాల మనుషుల్ని మనకళ్ళ ముందు నిలబెట్టేరు.

మూఢభక్తి స్వార్థాలవల్ల వచ్చిన పచ్చిమోసాలుచేసే శైవ, వైష్ణవ మతనాయకులు, శరభయ్య - మనవాళ్ళయలు.

"ఏమతమైనా ప్రవృత్తివున్నవాడికి తోవవుంది." అదిలేకుండా ఎవడికైనా ఫలితంలేదు - అన్న దృక్పథంగల అయ్యావార్లంగారు, శుద్ధాస్తికులైన గురువుగారు.

మతంపట్ల నవనాగరికులకున్న నిర్లక్ష్యభావంగల రామమూర్తి వెంకయ్యలు.

ఈమూడుపక్షాలను ప్రవేశపెట్టి అప్పారావుగారు అత్యద్భుతమైన కథను అల్లేరు.

మతాధిక్యత నిరూపించుకోవడానికి శైవులూ, వైష్ణవులూచేసే మోటుపనులు, చెప్పే కుయుక్తులూ; మతంపేరిట, డాబుదర్పాలతోను తంత్రాలతోను అమాయకజనాన్ని మతనాయకులుచేసేదగా, యీకథలో అచ్చుతీసి చూపబడింది.

పులిహోరా దధ్యోజనాలమీదిభక్తితో నామాలుపెట్టుకున్న గ్రామంలోని నాయుళ్ళు, ప్రభలు రుంజలు జయగంటలు డమామీలలో శివాచార్లు అట్టహాసంచేసేసరికి, నామాలకు నామంపెట్టి, వీభూది రుద్రాక్షధారణం చెయ్యడం ఆరంభిస్తారు.

శివుడూ విష్ణూ పీర్లు అవుతారు. బుద్ధుడు శివుడవుతాడు, పక్కనున్న దేవీవిగ్రహం పార్వతి అవుతుంది.

ఇలాంటివిషయాల నెన్నిటినో యీకథలో పూసగుచ్చినట్లు చెప్పారు. మతపరిణామం యెలాగ వెరితలలుకాసిందో చెప్పారు. అందుకే యీ కథానిక ప్రారంభంలో

"దేవుడుచేసిన మనుషుల్లారా!
మనుషులుచేసిన దేవుళ్లారా!
మీపేరేమిటి?"

అని ఒక పెద్దప్రశ్నను విసిరేరు మహాకవి

'లవణరాజుకల'లో కథానాయికుడు 'మంచిచెడ్డలు' మనుజులందున ఎంచిచూడగ రెండెకులములు' అన్న విశ్వాసంతో అంటరాని కులానికి చెందిన కన్యను వివాహం చేసుకుంటాడు. నానావర్ణ సహపంక్తి భోజనము గురించి రాయబడిన 'ముత్యాలసరములు' అన్న పద్య కథానికలోకూడా (తోకచుక్క గురించి వున్న మూఢవిశ్వాసాన్నికూడా దీంట్లో వెల్లడి చేసేరు) పైనిచెప్పిన సత్యమే యింకోరూపంలో చిత్రించబడింది.

"కొండుభట్టీయం"లో లౌక్యవృత్తిలోనికిదిగిన వైదీకి కొండిభొట్లు తానెన్నిపాపాలుచేసినా పవిత్రుణ్నే అనుకుంటాడు. ఈయన విధవలను తరింపజేసే భూసురోత్తముడు; వేశ్యావృత్తిలోవున్న మంజువాణికి బేరాలు కుదురుస్తుంటాడు.

"దేవతలు బ్రాహ్మలుచేసేపనులు తప్పుపట్టకూడదు. స్వర్గంలో వాళ్ళు దేముళ్ళయితే, భూలోకంలో మేం దేముళ్ళము; అందుచేతనే మమ్మల్ని భూసురులంటారు. చదువుకున్నదానివి నీకుతెలియందేమున్నది"?

అని తన్నుతాను మోసం చేసుకుంటాడు. మంజువాణి నుంచుకున్న భీమారావుకుకూడా ఆ నమ్మకమే గట్టిగావుంది. మంజువాణి కొండిభట్లును వేళాకోళం చేస్తుంటే "నువ్వు యెంత యెకసెక్యంచేసినా మేం దేవతలమే అందుకు రవ్వంతైనా సందేహములేదు" అంటాడు.

వెంకన్న, రామమూర్తులమధ్య జరిగిన సంభాషణలు, ప్రాచ్య పాశ్చాత్య నాగరికతలు యెంత అవకతవకగా భావించబడుతున్నాయో మనోరంజకంగా చిత్రించుతున్నాయి. కీర్తికాముకత్వంతో సంఘసంస్కారంచేసే దివాన్‌బహదూర్ రాజారాం యీనాటకంలో కనిపించే యింకొకపెద్దమనిషి.

సంఘ సంస్కారానికి దోహదంచేసే పాత్రలూ, సంఘటనలూ యెన్నిటినన్నా పేర్కొనవచ్చు. ఈ సందర్భంలో అపూర్వవ్యక్తి గిరీశం గురించి నాలుగుముక్కలుచెప్పి యీ విషయం ముగిస్తాను.

పొంకహిత ఉద్యమాన్ని తమ స్వార్థానికి ఉపయోగించుకొనే అనే కుల ప్రతిబింబాలే గిరీశంలో కనిపిస్తాయి. నేడుకూడా యిటువంటివారు మనలో కలిసిమెలిసి తిరుగుతుంటారు. వీరివల్ల ఆయా ఉద్యమాదర్శాలు మలినం చేయబడతాయి. ఆ ఉద్యమాలకే పెద్దదెబ్బ తగులుతుంది.

* "కన్యాశుల్కమునకు గిరీశమువంటి నాయకునిపెట్టి సంఘ సంస్కరణోద్యమమును వేళాకోళములోనికిదించి యుపకృతికిమారు అపకృతియే చేసి"రని ఒకమారు తెలిసియో తెలియకో సాహసించి ఒకసభలో 'డాక్టరు శేషగిరిరావు'గారు అన్నారట. దానిమీద అప్పారావుగారి అభిప్రాయమేమిటో తెలియదుగాని, సంస్కరణోద్యమం ప్రబలమవుతున్న ఆరోజులలో, ఆఉద్యమాదర్శాలను చిలుకపలుకుల్లాగ వల్లిస్తూ, తమ స్వార్థంకోసం ఉద్యమానికి ముప్పుతెచ్చే పనులు చేసేవారు నేటివలెనే నాడుకూడా వుండేవారు; కబుర్లుచెపుతూ సంస్కర్తలుగా తెలియనివారిదగ్గిర చలామణీ అయ్యేవారు; అటువంటివారికి పాఠంచెప్పడమే గిరీశంపాత్ర సృష్టికి కారణం. ఇప్పటికీ సజీవులైవున్న అప్పారావుగారి మిత్రులనూ, సమకాలికులనూ, గిరీశంపాత్ర యెవరినైనా ఉద్దేశించి వ్రాయబడిందా అని నేనడిగితే, ఒకరు చెప్పింది యింకొకరుచెప్పకండా ఆనాటి వేరువేరువ్యక్తులను పేర్కొంటూ, వారినిబట్టే గిరీశంపాత్రను అప్పారావుగారు సృష్టించేరని అభిప్రాయపడుతున్నారు. ఈ వృద్ధులమాటలనుబట్టిచూస్తే, ఆనాడు కుహనాసంస్కారులూ, ఆషాఢభూతులూ అనేకులుండేవారన్నది స్పష్టపడుతుంది. అప్పారావుగారు వీరందరిలోని గుణాలనూ తీసుకొని గిరీశంపాత్రను సృష్టిచేసివుండవచ్చు. అందుచేత యిటువంటి ఉద్యమ విద్రోహులను గిరీశంపాత్రలో బహిర్గతం చెయ్యడం, సంఘ సంస్కరణోద్యమాన్ని వేళాకోళంలోనికి దించడమవుతుందనడం సమంజసంకాదేమో!

సాంఘిక దురాచారాలను బట్టబయలుచేసి సంఘసంస్కారానికి సాహిత్యంద్వారా, అప్పారాయమహాకవికి పూర్వంగాని తరవాతగాని, ఏతెలుగు రచయితా ఆయన చేసినంత అమోఘమైన సేవచెయ్యలేదని నిస్సంశయంగా చెప్పవచ్చు. అప్పారాయమహాకవికి పూర్వమే యుగపురుషుడు వీరేశలింగంగారు సాహిత్యాన్ని సంఘసంస్కరణానికి ఆయుధంగా చేపట్టేరు.

---

* చూ. 'గురజాడ అప్పారావుగారి డైరీలు'

కాని[1] "వీరేశలింగంపంతులు వీలగుచోటనెల్ల ఒక ధర్మవిధిగా సంఘసంస్కారభావములు పాత్రములనోట యత్నతః పలికింపగా, ఈతని (అప్పారాయమహాకవి) కావ్యముల పాత్రములు, ఒకసహజ భావోద్రేకముతో ఈతనివలెనే, కావ్యౌచిత్యమును కుంటువడక మెరుగుదేరునట్లు సంస్కారాశయములను వెలిబుచ్చును."

వీరేశలింగంగారి ప్రచారవేగంలో కుంటుపడిన కావ్యశిల్పం అప్పారాయమహాకవిలో పరిపక్వతచెందింది.

అప్పారావుగారి రచనలు సంస్కారాశయాలను ప్రచారంచెయ్యడానికి ఉద్దేశించబడినా, కావ్యకళారూపం, అందచందాలకు లోపంకలిగించలేదు. 'సాహిత్యపరిశుద్ధతావాదులూ,' 'కళకోసమేకళ' అనే మతంగలవారూ, అప్పారాయమహాకవి రచనలను - ముఖ్యంగా కన్యాశుల్కాన్ని - ప్రచార సాహిత్యంకింద లెక్కవెయ్యకపోవడానికి యిదేకారణం. సాహిత్యానికి ప్రయోజనం వుండనక్కరలేదనే వీరిని నిందించడానికి బదులు, సాహిత్య ప్రయోజనాలను సమాజాభ్యున్నతికి వినియోగపర్చే రచయితలు, తమరచనలలో అప్పారావుగారివలె శిల్పాన్ని తీర్చిదిద్దినట్టయితే, సమాజానికీ, సాహిత్యానికీ యెంతైనా మేలుచేసినవారవుతారు.

కన్యాశుల్కం

"సంఘసంస్కరణోద్యమాన్ని బలపర్చడానికీ, తెనుగుభాష నాటక రంగానికి అనుకూలమైనదికాదన్న అపోహ నెదుర్కోవడానికీ, నేను కన్యాశుల్కాన్ని రాసేను."

అని కన్యాశుల్కం రెండవకూర్పు పీఠికలో అప్పారావుగారు రాసేరు. కన్యాశుల్కం రచనకు పురికొల్పిన పరిస్థితులనుగురించి మొదటి కూర్పు పీఠికలో అప్పారావుగారిలాగ చెప్పేరు :

"విజయనగరం మహారాజులుంగారి (ఆనందగజపతి) ఆజ్ఞానుసారం, విశాఖజిల్లాలో మూడు సంవత్సరాలకాలంలో జరిగిన బ్రాహ్మణ శుల్కవివాహాల లెక్కలు పదిసంవత్సరాలక్రితం[2] తీసుకోబడ్డాయి. శుల్కాన్ని పుచ్చుకున్నవారు అది చెప్పడానికి సహజంగా బిడియపడతారు

---

1. 'ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము'లో కొంపెల్ల జనార్దనరావుగారు.

2. మొదటికూర్పు పీఠిక 1-1-1897 నాడు రాయబడింది గాబట్టి 1887 ప్రాంతం అయివుండాలి.

గాబట్టి యీ లెక్కలు సమగ్రమైనవికావు. అయినప్పటికీ యీ లెక్కలు బాల ముఖ్యమైనవి; ఆసక్తిని రేకెత్తిస్తాయి. ఈ లెక్కలప్రకారం తేలిన పెళ్ళిళ్ళసంఖ్య ఒక వెయ్యి ముప్ఫయినాలుగు. సగటున సంవత్సరానికి మూడువందల ముప్ఫయినాలుగు శుల్కవివాహాలు జరిగేయన్నమాట. తొంభైతొమ్మండుగురు బాలికలు ఐదేళ్ళప్పుడు, నలభైనలుగురు నాలుగేళ్ళప్పుడు, ముప్ఫైఆరుగురు మూడేళ్ళప్పుడు, ఆరుగురు రెండేళ్ళప్పుడు, ముగ్గురు ఒక ఏడాదివయస్సునా వివాహితలయ్యేరు. ఒక ఏడాదివయస్సులో వివాహితులైన బాలికలకు ఒక్కొక్కతెకూ రూ. 350 నుండి రూ. 400 వరకూ శుల్కం పుచ్చుకోబడింది. వింతగా కనిపించవచ్చును కాని, కడుపులోవున్న పిల్లలకోసంసైతం అప్పుడప్పుడు బేరాలు జరిగేవి. ఈ నీచమైన పరిస్థితులు సంఘానికి కళంకం. ఇటువంటి దురాచారాలను బయటపెట్టి ఉన్నత నైతిక భావాలను ప్రచారం చెయ్యడంకంటె ఉత్కృష్టప్రయోజనం సాహిత్యానికుండదు. ప్రజాసామాన్యంలో పుస్తకాలు చదవడం అభ్యాసమయ్యేవరకూ, యిటువంటి సత్ఫలితం నాటకరంగంనుండి మాత్రమే ఆశించవలసివుంది."

కళ కళకోసమే అనీ, సాహిత్యం ప్రచారమయం అయిపోతున్నదనీ, కన్యాశుల్కరచనజరిగి అర్ధశతాబ్దం అయినా, యీనాటికికూడా కంగారు పడేవారు అప్పారాయమహాకవికేం సమాధానంయిస్తారో ?

ఆయనకు సాహిత్యం ఒకభోగవస్తువుకాదు. చూపరులకు దిగ్భ్రమ కలిగించే గారడీఆట కాదు.

మహాకవి అప్పారావుగారికి సాహిత్యం అవశ్యాచరణీయమైన పరమ ధర్మం. సాహిత్యం ఆయనకు మానవసేవా సాధనం. అందుకే

"యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయి?"

అని గుండెలు పట్టుకునే - హృదయమున్నవారికి - ప్రశ్నవేసేరు. అందుచేతనే కన్యాశుల్కాన్ని రచించేరు.

* "అవినీతికరములైన విషక్రిములతో కూడుకొన్న దుర్భర బానిసత్వంనుండి దిక్కులేని మనస్త్రీలను కొందరిని రక్షించడానికి" ఆనంద గజపతి మహారాజు ఆలోచిస్తున్నప్పుడు. "ప్రజాసామాన్యానికి గ్రాహ్య

* చూ. కన్యాశుల్కం కృతిసమర్పణం.

మయ్యేనాటకంలో యీ చెడుగును వెల్లడిచేసి, ఆందోళనను ప్రేరేపించ డానికి" అప్పారావుగారు తమ "అల్పశక్తిని వినియోగించి" ఈ కన్యా శుల్కాన్ని రచించేరు.

ఆంధ్ర నాగరికతా సంస్కృతులమీద భూస్వామిక ప్రాబల్యంపోయి మధ్యతరగతి ప్రాబల్యం ఆవరించుకొంటున్న రోజులవి. వీరేశలింగంగారు ఆంధ్రసమాజ చరిత్రలో నూతనయుగ ప్రారంభానికి పునాదులు వేస్తున్నారు. మౌఢ్యాలపైనీ, దురాచారాలపైనీ త్రిశూలంవంటి ప్రశ్నార్థకాన్ని ప్రయోగించేరు, వారి సంఘ సంస్కరణోద్యమం గుడ్డినమ్మకాలకు సుత్తిపెట్టి యింది. హేతుబలంలేని ఆచార సాంప్రదాయాల్ని నిర్దాక్షిణ్యంగా ఆయన తన ప్రహసనాల్లో విమర్శించేరు. ఆంధ్రసమాజ జీవితంలో వీరేశలింగం గారు అద్వితీయ పురుషులైనారు మేధావంతులనేకాక సామాన్యులనుకూడ చాలమందిని వారి చరిత్రాత్మక ఉద్యమం ఆకర్షించింది. ఆదర్శవాదిఅయిన అప్పారాయ మహాకవినిసైతం వీరేశలింగంగారు ఆకర్షించేరు.

[1] "అప్పటికి ప్రసిద్ధులైన ఆంధ్ర ధీరాగ్రేసరులు రావుబహద్దరు కందుకూరి వీరేశలింగం పంతులుగారి జీవితం కొంతవరకాయనకు మార్గదర్శకమై యుండునని నాఊహ....సాహిత్యరచనతో సాంఘిక సేవచెయ్యడ మనేది అప్పారావుగారికి వీరేశలింగంగారి రచనలవల్ల స్ఫురించివుంటుంది." అని అప్పారాయ మహాకవి శిష్యులైన శేషగిరిరావుగారన్నారు.

[2] "వీరేశలింగం పండితుడు - నిశ్చయముగా మహాపురుషుడు. సాహిత్యములో ఒకశాఖచేసి, సంఘములో పురోభివృద్ధిపంథా లేవదీసి నాడు." అని మహాకవి రాసుకున్నారు.

సంఘ పురోభివృద్ధికి సాహిత్యాన్ని సాధనంగాచేసిన వీరేశలింగం గారి యెడల మహాకవికి చాలా భక్తిభావముండేది. ఒక మహాపురుషుడు యింకొక మహాపురుషుణ్ణి ఆకర్షించేడు.

సంఘపురోభివృద్ధి సాహిత్యానికి పరమార్థమని నమ్మిన అప్పారావు గారికి నాటిసాహిత్యధోరణి కాలానుగుణంగా లేకపోవడమేకాకుండా అభివృద్ధి నిరోధకంగాకూడా వుందని స్పష్టపడింది. వ్యవహారికభాషావుద్యమం ఆయనకు సాహిత్య సంస్కరణోద్యమం మాత్రమేకాదు. పైనుదహరించ

1. చూ. 'గురజాడ అప్పారావుగారి డైరీలు'
2. డిటో 12-1-1911 డైరీ.

వడిన కన్యాశుల్కం పీఠికల్లో అప్పారావుగారు చెప్పినదానినిబట్టి "....దురాచారాలను బయటపెట్టి ఉన్నత నైతికభావాలను ప్రచారంచెయ్యడంకంటె ఉత్కృష్టప్రయోజనం సాహిత్యానికుండదు"— అంటే సంస్కారాశయాల్ని వెలిబుచ్చి, సంఘాభ్యున్నతికి తోడుపడడమే సాహిత్యానికి ముఖ్యకర్తవ్యం అని ఆయన నమ్మకమైనట్టు తేటతెల్లమవుతుంది.

పండితుల రహస్యమైన గ్రాంధికభాషద్వారా కాకుండా ప్రజాసామాన్య భాష అయిన వ్యవహారికభాషద్వారా, ప్రజాభ్యుదయానికి దోహదంచేసే సంస్కారభావాలను వెదజల్లడమే కావ్యప్రయోజనంగా పెట్టుకొని అప్పారావుగారు కన్యాశుల్కాన్ని రచించేరు. అందుచేతనే. "నాది ప్రజల ఉద్యమము; దానిని ఎవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేను" 1 అని తన ఆదర్శాన్నీ, కార్యదీక్షనూ తమ దినచర్యలో రాసుకున్నారు.

ఆయన తపస్సు ఆనాడేఫలించింది. "సంఘసంస్కరణం వ్యవహారికభాషఅంటే గిట్టని కొక్కొండ వెంకటరత్నంగారిని మినహాయిస్తే మొదటికూర్పు విజయవంతమయింది. పత్రికలు ప్రేమతోస్వీకరించి తెలుగు సాహిత్యచరిత్రలో ముఖ్యమైన సంఘటన అని ప్రశంసించేయి. ఎంతో ఆసక్తితో పురుషులు, స్త్రీలు, పిల్లలు చదువసాగేరు. కొద్దివారాలలో మొదటి కూర్పు ప్రతులన్నీ చెల్లిపోయేయి." 2

కన్యాశుల్కరచనను పురికొల్పిన పరిస్థితులనుగురించీ, ఆనాటి మన నాటకరంగాన్నిగురించి రెండవకూర్పుపీఠికలో యిలారాస్తున్నారు :

"ఈ నాటకంరాసినప్పుడు, నాకు ప్రచురిద్దామన్న ఉద్దేశంలేదు. సంఘసంస్కరణోద్యమాన్ని బలపర్చడానికి, తెలుగుభాష నాటకరంగానికి అనుకూలమైనదికాదను అపోహ నెదుర్కొవడానికి, నేను కన్యాశుల్కాన్ని రాసేను. ఊరూరాతిరిగే మహారాష్ట్ర నాటకసంఘాలు తెలుగుజిల్లాల్లో హిందీ నాటకాలువేసి డబ్బుసంపాదించేవి. స్థానికనాటకసంఘాలు వీటిననుకరించేవి. తమకు అర్థంకానిదానిని ప్రేక్షకులు ఆనందంగా వినేవారు. అజ్ఞానాన్ని గురించి యింతకన్న ఎక్కువగాచెప్పడానికి సాధ్యంకాదు. తళుకు, బెళుకు వేషాలు, కామాన్ని ప్రేరేపించే నృత్యగీతాలు, కృత్రిమయుద్ధాలు, మొదలైన తక్కువరకపు నాటకాకర్షణలకు కన్యాశుల్కం తావివ్వలేదు. ఆయినా

1. చూ. 1911 మార్చి 27.

2. చూ. కన్యాశుల్కం రెండవకూర్పు పీఠిక.

తండోపతండాలుగా ప్రజలను ఆకర్షించింది. మాతృభాషహాస్యాన్ని స్థిరపర్చింది.

"హిందీ నాటకప్రదర్శనాలు నానాటికీ తగ్గిపోతున్నందుకు నాకు సంతోషంగావుంది కాని ఆంధ్రనాటకరంగంస్థితి సంతృప్తికరంగా వుందనుకోవడానికి యేవిధంగాను వీల్లేదు. చెప్పుకోదగ్గ నాటకసంఘాలు లేవు. నాటకాభినయాన్ని కళగా అభ్యసించేవృత్తి - నటకులులేరు. మంచి నాటకాలుకూడా అట్టేలేవు విషమ సాంఘికపరిస్థితులను ముందుపెట్టే అధునాతన జీవితాన్ని, ప్రహసనాలకుతప్ప, నాటకరచయితలు ఉపయోగించుకోవడంలేదు. పురాతన శృంగారవిషయాల్నే పిండిపిండి రాయడం కల్పనాదారిద్ర్యాన్ని తెలియజేస్తుంది. నాటకసాంకేతికాన్ని యెరిగిన రచయితలు చాలతక్కువ. యాభై సంవత్సరాల విశ్వవిద్యాలయవిద్యాభ్యాసమూ పాశ్చాత్యసంస్కృతి ప్రాబల్యమూ జరిగిన తరవాత, సాహిత్యశిల్పం యింత తక్కువస్థాయిలో వుండడం ఆశ్చర్యపడవలసినవిషయం. మన కళాశాలల్లో యింగ్లీషుబోధనాక్రమం లోపభూయిష్ఠంగా వుండడమే దీనికి కారణమని చెప్పాలి. ఇంగ్లీషు ప్రొఫెసర్లూ, విద్యాధికారులూ దేశభాషల్ని దోహదం చెయ్యడానికి బాగాకృషిచేసి బాధ్యతతీసుకున్నదాకా, బహుశా మంచిపరిస్థితులు వస్తాయనుకోవడానికి వీల్లేదు."

నాటక ప్రయోజనాన్ని అప్పారావుగారు సరిగా గుర్తించేరు. సంఘంలోవున్న దురాచారాల్ని వెల్లడిచేసి నైతికభావాల్ని ప్రజాహృదయంలో నాటడానికి, ప్రజాసామాన్యానికి చదవడం అభ్యాసమయ్యేవరకూ నాటకరంగమే చాలా ఉపయోగకరమన్న నమ్మకమే కన్యాశుల్క-నాటక రచనకు పురికొల్పింది. 'కొండుభొట్లీయం' నాటకరచనకుకూడా యిదే కారణం అని చెప్పనక్కరలేదు.

కన్యాశుల్కంరచన జరిగిననాటికి ప్రాచ్య పాశ్చాత్య నాటకాలు - యింత నిజమైనవి, యింత చక్కనివి, యింతటి ఉపజ్ఞాపూరితాలైనవి, అధునాతన జీవితాన్ని అచ్చుగుద్ది ప్రాణంపోసినవి, యెన్నివున్నాయో, అవి కన్యాశుల్కంముందు ఎలా నిలబడగలవో బహుభాషాకోవిదులైన విమర్శకులు నిర్ణయించవలసిన విషయం.

1"ముఖ్యంగా నాటకరచనవిషయంలో నీవుప్రదర్శించినప్రతిభ సమకాలిక భారతదేశంలోనేకాదు; సమకాలిక ప్రపంచంలోనే గణితించదగినట్టిది.

1. చూ. "అప్పారాయకవి:" - నార్ల వెంకటేశ్వరరావుగారు.

"సీఫ్ఘ 'కన్యాశుల్కము' నాటకాన్ని - ఒక సమకాలిక సమస్య యితి వృత్తంగా - ప్రకటించిననాటికి యూరప్‌ఖండలోనైనా క్రొత్తనాటకం అంతగా ప్రచారంలోనికి రాలేదు."

కన్యాశుల్కం అత్యుత్తమకావ్యం కావడానికి కారణం, అప్పారావు గారికి, దురాచారాలను రూపుమాపి సమాజాభ్యున్నతికి తోడుపడాలని దీక్ష, ఆవేశం వున్నంతమాత్రంచేతకాదు. కావ్యనిర్మాతకు ఆవేశం వున్నంత మాత్రానచాలదు. ఆదీక్షనూ, ఆవేశాన్నీ రూపంలోపెట్టగల పదజాలంతో రచనా సామర్ధ్యం అలవడినాచాలదు. "భూతకాలం కూర్చిన మహత్తరత నంతా.... స్వాయత్తం చేసు(కుని) ....భవిష్యత్తులోనికి ఉత్తమమార్గాన సంఘాన్ని నడిపించడం తన నిరంతరలక్ష్యంగా ఎంచు"కోవాలి. "భూత భవిష్యత్తుల ఎంత విలువగలవి అయినప్పటికీ (తన).... ఆందోళనా యత్నమూ, వర్తమానానికి చెందినవే....(తన) హృదయం కొట్లాట వర్తమానంలోనే" [1] అన్న సత్యాన్ని మర్చిపోకూడదు తన కావ్యాన్ని సాక్షాత్కారం చేసుకోవాలి. తన కావ్యంలోని పాత్రలలోనూ సంఘటనల లోనూ తాను జీవించాలి, జీవితాన్ని ప్రపంచాన్ని సునిశితదృష్టితో పరిశీలన చెయ్యాలి. చేసి ముందువెనకల దృష్టితో, ప్రస్తుతాన్ని అవగతంచేసుకొని, తాను తనకావ్యాన్ని చదివి ఆనందించేవారితోబాటు వెలుగుబాటలోనికి నడవాలి.

తను వెలుగుబాటలోనికి నడిచి తనవెంట వేలకొలది తెలుగువారిని వెలుగుబాటలోనికి నడిపించేరు అప్పారాయమహాకవి. అంచేతనే ఆయన [2] 'నవ్యాంధ్ర సారస్వతమునకు శ్రీరాములుచుట్టిన ఆదికవి' కాగల్గేరు. "అప్పారాయకవి ఆంధ్రవాఙ్మయానికి ఒక సరిహద్దు. ఈయనతో నవ్య సారస్వతయుగం మొదలైనది."

కన్యాశుల్కాన్ని ఆనాటి జీవిత సర్వస్వమని అనవచ్చు. అనేక జాతులు, వృత్తులు, దృక్పథాలు వాటివాటి సహజమైనభాషతో, ప్రవర్త నతో, సంఘర్షణలతో, సుఖదుఃఖాలతో కళ్ళకుకట్టినట్టు చిత్రించబడ్డాయి, మహాకవి అప్పారావుగారు జీవితాన్ని ప్రపంచాన్ని అనేక దృక్కోణాల నుండి సునిశితంగా పరిశీలించి, నాటి జీవితాన్నేకాకండా సమస్యల్నికూడా అసమానమైన కల్పనా కౌశల్యంతో ప్రదర్శించేరు. సాహిత్య పురోభివృద్ధికి

1. చూ. 'వైతాళికులు' పీఠికలో ముద్దుకృష్ణగారు.

2. చూ. 'గురుజాడ వాల్మీకి' — ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు.

సంకెళ్ళుగా పరిణమించిన పండిత సాంప్రదాయాలను, లోకరీతిపాటుగా పరిణమించిననాటి కావ్యరచనా విధానాన్ని ధిక్కరించి సహజమైన, సజీవమైన భాషలో, నాటినుంచి నేటివరకూ అక్షరాలా అద్వితీయంగా నిలిచినకావ్యాన్ని తెలుగుజాతికి ప్రసాదించేరు. సంఘంలోని మౌఢ్యాన్నీ నికృష్టతనీ బహిర్గతంచేసి. సంఘాభ్యుదయానికి విత్తనాలునాటేరు.

'కావ్యబొమ్మలు' శిల్పంతో తీర్చిదిద్దినవి కావచ్చు. సజీవమైనవేమో అని భ్రమపెట్టినప్పు అయినా అవి వాస్తవికంగా నిర్జీవాలు.

కాని "అప్పారావుగారి పాత్రలు సంపూర్ణంగా మానవత్వంతో నిండినవి. ప్రాణమున్న ప్రతిఒక్కరిలోనూ అవి జీవించి, జీవితాన్ని ఉత్సాహవంతంగా చేస్తాయి." 1

లోపంలేనిది సృష్టిలోనేలేదు. అలాగే కన్యాశుల్కానికికూడా కొన్ని లోపాలున్నాయి,

ప్రదర్శించడానికి అనుకూలంగానంతగా కన్యాశుల్కం పెరిగి పోయింది.

యీనాటి అభిరుచికి సరిపోని స్వగతాలు కన్యాశుల్కంలోవున్నాయి. యీ రెండులోపాల్ని అప్పారావుగారుకూడా గమనించేరు.

తను ప్రదర్శించదలుచుకున్న సమస్యలను అంతకన్న తక్కువగా కుదించడం తనకు సాధ్యంకాలేదని అప్పారావుగారనేవారట. అంచేతనే కాబోలు కన్యాశుల్కాన్ని మూడుభాగాలు (ట్రియాలజీ)గా రాయడానికి అప్పారావుగారు ఉద్దేశించేరు. ఒకటి రెండు రంగాలుకూడా రాసేరు. అసంపూర్ణంగా నిలచిపోయిన 'బిల్హణీయం' నాటకం, కన్యాశుల్కం ట్రియాలజీ, గ్రాంధిక వ్యవహారికభాషావాదోపవాదాల్లో విడుచుకోవలసివచ్చింది.

అదేవిధంగా స్వగతాలుతీసివేసి నూతన అభిరుచులకు అనుగుణ్యంగా కన్యాశుల్కాన్ని మార్చడానికీ అప్పారావుగారు ప్రయత్నించేరు. స్వగతాలున్నచోట్ల తమప్రతిలో గీట్లుపెట్టేరు — కాని జీవితం కలసిరాలేదు.

అయినప్పటికీ రామలింగారెడ్డిగారన్నట్టు :

"2 అది జీవితంతోనూ మానవత్వంతోనూ పరిపూర్ణమైవుంది. దానిలోనిస్త్రీలుపురుషులూ దయాదాక్షిణ్యాలతోను, విపరీతాలతోను అయుక్తాల

---

1. చూ. కె. కృష్ణయ్యంగారు చేసిన కన్యాశుల్కం కన్నడ అనువాదంలో కట్టమంచి రామలింగారెడ్డిగారి పీఠిక.

2. చూ. అదే పీఠిక.

తోను, క్రౌర్యాలతోను కుయుక్తులతోనూ, పవిత్రతతోను వంచకత్వంతోనూ, తిరుగులాడతారు ప్రకృతి-ఆచారం, హేతువు-సాంప్రదాయం, అభిప్రాయం-వాస్తవం, ఒకదానితో నొకటి తీవ్రసంఘర్షణకు తలపడ్డ నిజజీవితంతో యిది నిండివుంది.

కన్యాశుల్కాన్ని విపులంగా చర్చించడానికి యిది స్థలంకాదు. దాని ప్రయోజనం, కల్పన, శైలి, నవ్యత, సాటిలేనివి అని చెప్తేచాలును.

మోటుసరసాన్ని హాస్యంగా అలవాటుచేసుకొన్న తెలుగుసాహిత్యానికి, సభ్యమైన సరసమైన హాస్యాన్ని అప్పారావుగారు ప్రసాదించేరు, హాస్యంకోసం సన్నివేశాలు కల్పించబడక, సహజంగా, పాత్రపోషణచేస్తూ నాటకంలో హాస్యం అల్లుకపోయివుంటుంది. ఇవి అప్పారావుగారి విశిష్టత.

గంభీరమైన సన్నివేశాలుకూడావున్నాయి. కరటకశాస్త్రులు, లుబ్ధావధానులుపడ్డ ఆవస్థలు ఆలోచించండి. వాళ్ళిద్దరూ ఎంతప్రమాదకరమైన స్థితికి వచ్చేరో గమనించండి.

పాత్రలు మాటాడే హాస్యంకంటే, వారి మాటలతో భావాలతో ప్రవర్తనతో వేరులేరు వ్యక్తులు హాస్యపాత్రులవుతారు. తమబండారాన్ని బయటపెట్టుకుంటారు.

కాని 'తూకం'లో హాస్యరసం బరువు కన్యాశుల్కంలో యెక్కువై పోయింది. ఏడిపించవలసిన పరిస్థితులు నవ్విస్తాయి. అప్పారాయ మహాకవి 'మీపేరేమిటి?'లో చూపిన 'తూకం' కన్యాశుల్కంలో చూపలేదు. అగ్నిహోత్రావధాన్లు రామప్పంతులు గిరీశం మొదలైనవారు తీవ్రంగా గర్హించవలసినవారు. హేళనచేసి తేలికగా దాటిపోనియ్యవలసినవారుకారు.

అయినప్పటికీ మానవప్రకృతిని చూపడానికి కన్యాశుల్కం అద్దమై నిలిచింది. 'లోకమందలి మంచిచెడ్డలు, లోకులెరుగుదురా?' అని ప్రశ్నించి అప్పారాయమహాకవి, లోకమందలి మంచిచెడల్ని లోకం కళ్ళయెదుట నుంచి మహాపురుషుని బాధ్యతను నిర్వర్తించేడు.

కన్యాశుల్కంలోని వివరాలలోనికివెళ్తే ఒకంతట బయటపడడం సాధ్యంకాదుగాబట్టి, యీసందర్భంలో అప్పారావుగారి నాటకకళాపాండిత్యాన్నీ కృషినీ కొంచంచూదాం.

తక్కిన సాహిత్యంలాగనే నాటకకళకూడా ఊసుపోని విలాసం కోసం కాదనీ, ముఖ్యంగా ప్రజాభ్యుదయానికి సాధనంగా ఉపయోగించాలనీ ఆయన నమ్మకమైనట్టు కనిపిస్తుంది.

"యూరేషియనులను గురించి ఒకనాటకం నేను వ్రాసి వారియెడల అనుకంపాదృష్టి కలిగించవలెను ఈసంకరులను యింగిలీజులుపెట్టే క్షూణత నాఇంగిలీజులే సిగ్గుపడేటట్లు చేయవలెను." అని 1895 మే 4 వ తారీఖున తమడైరీలో రాసుకున్నారు.

మద్రాసు మొదలైన పట్టణాలకు వెళ్ళేటప్పుడు ఇంగ్లీషువారి సహవాసమూ, యూరేషియన్ల సహవాసమూ ఆయనకుండేది. కాబట్టి యూరేషియన్లను యింగ్లీషువారుపెట్టే క్షూణత ఆయనలో యీ భావాన్ని రేకెత్తించి వుండవచ్చు. ఇటువంటివే అప్పారావుగారు నాటకాలు మొదలైనవి రాయడానికి అనేక సూచనలు తమ డైరీలలో రాసుకున్నారు.

అప్పారావుగారు తమ డైరీలలో రాసుకున్నదానిబట్టి ఆయన "గ్రీకు, రోమన్, ఇంగ్లీషునాటకక్రమములు జాగ్రత్తగా పరిశీలించుచుండినట్లు తోచును. ప్రదర్శనయోగ్యములైన నాటకములపైన మోజుకనబడుచున్నది. అయన ఇంగ్లీషు, పరాసు, ఫారసీ, చీనా మొదలగు విదేశీయ నాటక ప్రయోగములనుగురించియేగాక నాటకములో హాస్యరసము గురించిన్నీ, విదూషకులను గురించిన్నీ, సంఘటనములకూ పాత్రరచనలకూగల సంబంధము గురించిన్నీ, పాత్రోచితమైన వేషమును గురించిన్నీ, ఆయానాటక కర్త లాయానాటకము లేల వ్రాయుదురనిన్నీ; నాటకరచయితల కష్టనిష్టురముల గురించిన్నీ విపులమగు విమర్శలు చరువుచుండినట్లు కనపడును. మన నేటి నవ్యసాహిత్యపరులకుకూడా పై విమర్శలవంటివి రచనా రహస్యములను స్ఫురింపజేయగలవు." 1

అప్పారావుగారు మననాటకాలను విదేశనాటకాలతో సరిపోల్చి చూసుకొనేవారు. అనేక నాటక ప్రదర్శనాలు చూసేవారు. డైరీలలో తాము చూసిన నాటక ప్రదర్శనలగురించి తమ అభిప్రాయాలను రాసుకునేవారు. వీటినిబట్టి, నాటకకళపట్ల ఆయనకు యెంత పరిపక్వమైన భావాలుండేవో విశదమవుతుంది.

ఒకనాడు మద్రాసులో 'డంబాచారివిలాస' మన్న నాటకప్రదర్శనాన్ని చూసేరు. అందులో నాయికవేషం ధరించిన "బాలామణి" అన్న వేశ్యలో వున్న ఆత్మవ్యతిరేకతగురించి యిలాగ రాసుకున్నారు :

1. బుర్రా శేషగిరిరావుగారు - "గురుజాడ అప్పారావు డైరీలు"

"పిల్లిమేపుటంటే మేకపిల్లను బంగారుపిచికనో సర్వనాశనం చేసిన యీ భోగప్రపంచం, ఈ దండాహారినాటకంలో అట్టి సర్వనాశము చేసే పశుప్రకృత్వ వేషం అభినయించి తన జీవితమునే గర్హింపజేసే నీతిని బోధించుట."

నాటకరచనలో అప్పారాయ మహాకవి పాశ్చాత్య పద్ధతి చాలవరకు అలవర్చుకున్నారు. కన్యాశుల్కంలో పాశ్చాత్యనాటకకర్తల ప్రభావం కనిపిస్తుంది.

1907 లో రాసిన కొండుభట్టీయంలో రైలుబండికూడా ప్రవేశపెట్టబడింది. భారతీయ నాటకరంగంలో నేటివరకూ అది ప్రదర్శన సాధ్యం కాకపోయినా, పాశ్చాత్య నాటకరంగంలో యిది సాధ్యం చేయబడింది. [1]

వ్యావహారిక భాషాఉద్యమం

"కుమారుని మహాభారత తర్జుమాతో ప్రారంభమైన తెనుగువారి సారస్వతం, క్రమేణ ప్రబంధాల్లోకిదిగి, గతశతాబ్దపు మధ్యభాగంవరకూ, ప్రబంధాల్లోంచి బయటపడలేకపోయింది. అంతవరకూ దేశంలో పర మతాలూ, పరప్రబోధాలు వ్యాపిస్తూయున్నా, హిందువుల్లో మట్టుకు సాంఘిక పరివర్తనము అంతయెక్కువగా జరిగినట్లు కనిపించదు. ఇంగిలీషులు దేశంలో ఎక్కువభాగాన్ని స్వాధీనపరుచుకొని, స్థిరంగాయుండి పరిపాలన సాగించేవరకు, హిందుప్రజల్లో మార్పు అంతవిశేషంగా బయటపడలేదు; పూర్వాచారాల్నే, పూర్వసాంప్రదాయాల్నే, ప్రజలనుసరిస్తూయుండేవారు. విద్యావిధానంలో మార్పు క్రమశః అటుతరువాతనే యెక్కువుగా కనిపించడం ప్రారంభించింది. ప్రకృతి శాస్త్రజ్ఞానవ్యాప్తితో చదువుకున్నవాళ్ళ నమ్మకాల్లో కొంతమార్పు కనిపించింది. ఇంగిలీషు సారస్వతాన్ని పరీక్షలకైనా చదవడంచేత, కోరినా కోరకపోయినా, మన సారస్వత సాంప్రదాయాలతో భిన్నించే సొగసైనవి గొప్పవి. పర సారస్వత సాంప్రదాయాలు కూడా యున్నాయని చదువుకున్నవాళ్ళకి స్పష్టమైంది. వారు చదివి యానందించిన పరభాషల్లోని యుద్గ్రంథాలు వారిలో నూతనవికాసాన్ని పుట్టించాయి. చిరకాలంనుంచి వస్తున్న సంస్కృత కావ్యాలు, నాటకాలు, ఆంధ్రప్రబంధాలు, ఆంధ్రభారతాదులే, సాహిత్యం సంపాదింప ప్రయత్నించేవాళ్ళకి ముఖ్యమైన గ్రంథాలై యుండేవి. పండితులు వీనినే చదివి. వేరేమీ చూడ

1. See 'Distant Point,' a Soviet Play

కుండా కాలక్షేపం చేస్తూయుండేవారు. రాజభాష యింగిలీషుభాష యవటంచేత, రానురాను ఈ పురాణ సారస్వతాన్ని చదివేవారిసంఖ్య తగ్గిపోయింది ....యింగిలీషు ప్రభుత్వం సుస్థిరంకాగానే, దిగజారుచున్న ఆర్థిక పరిస్థితులు బట్టబయలైనాయి. ప్రజలు అన్నంలేక మాడిపోతున్నారనీ, ఈ దుస్థితి ప్రజలకు కలగడం మన దుష్టసాంఘిక పరిస్థితులవల్లనే కలుగుచున్నదనీ, సంఘం మరామత్తుకయి, ప్రజాప్రభుత్వము స్థాపనముయి, పరప్రభువుల స్వచ్ఛందవిహారం కట్టి పడవేసేగాని ప్రజలకు మరి ముక్తి లేదని ప్రజల్లో కొంత యలజడి కలిగింది. ఈ కలవరమునకు కారణమైన పరప్రబోధం, ప్రజలకళ్లు విప్పడంచేత, వారిలో నూతనోద్రేకం పుట్టింది. ఆత్మగౌరవం కల్గింది. మనవారు తిరిగి మన ప్రబోధాన్ని పరీక్షించడానికి యారంభించేరు. జాతీయభావాలతో ఆత్మగౌరవము పెరిగింది. అంతవరకూ కొంత నిరసించబడ్డ జాతీయ సారస్వతం తిరిగి ప్రజలదృష్టి నాకర్షించింది. ....ప్రబంధాలాధారపడియుండిన అనేక సాంప్రదాయ ధర్మాలు అడుగంటేయి. సంఘంలో నూతన పరిస్థితులేర్పడ్డాయి. సూర్యచంద్రులు దూరిపోయేటంత యెత్తైనభవనాలు, సముద్రమంతలోతుగాను, వెడల్పుగాను యుండే అగడ్తలు, మన్వాది ధర్మశాస్త్రాల్లో నియమాలనుదాటని చాతుర్వర్ణ్యం, లక్షణగ్రంథాల్లోని నియమాల ననుసరించియుండే నాయకనాయికలూ, వారి శృంగారచేష్టలూ, వారి వియోగం, నాయిక కాంభోజిలోనో యింకో రాగంలోనో రోదనం చేయడం — ఇవన్నీ ప్రజలకంతగా రుచించడం మానాయి. ప్రజల రుచులలో విపరీతమైన మార్పు కలిగింది. ప్రాచీన సాంప్రదాయాలనే పట్టుకొనియుండిన పండితులు, ఇది తెలుసుకోలేక పోయేరు. కలుగుతున్నమార్పు సారస్వతానికి ముప్పుతెస్తుందన్నారు. ప్రాచీన లక్షణ విరుద్ధంగా గ్రంథాలుండకూడదన్నారు. కవిత్రయం, ఆటుతరువాత విశిష్ట ప్రబంధకర్తలు ఉపయోగించిన భాషే. ప్రయోగాలే తప్ప వేరేవి గ్రంథాల్లో వినియోగింపబడకూడదన్నారు. వాడుకభాష గ్రంథాల్లోవాడ్డానికి వీల్లేదన్నారు. శాస్త్రుల్లవారు కవులకనుశాసకులు కాడానికి ప్రయత్నించారు. వాడుకభాష గ్రామ్యం, అశ్లీలం అన్నారు. కాదన్న వాళ్ళని తర్జించారు. కొత్తవ్రాతలు, కొత్తపోకళ్ళ ననుసరించి మహాప్రవాహంగా వస్తుంటే నెత్తిమొత్తుకున్నారు. గంతులేసేరు, విలపించారు. లాభం లేకపోయింది. పాండిత్యంలేకపోయినా, ప్రాచీనగ్రంథాలను బట్టీ వేయలేకపోయినా, కొత్తవ్రాతగాళ్లు పండితుల తర్జనలను, విలాపాలను,

వెక్కిరింపులను నిరసనలను లెక్కచేశారుకారు. ప్రజాసామాన్య సారస్వత రక్తధ్వజం ఎత్తబడింది. ఈ రక్తధ్వజమే పండిత వృషభములకు రక్త వస్త్రశకలం అయింది. వారు బెదిరారు, వారు బెదిరిచేసిన చేష్టలు చూపరులకు కొంత తమాషా కలుగజేసింది; ఇందుల కలవాటుపడ్డారు. బెదురు తగ్గింది. కాని బెదురుమాత్రం సుతరాం పోలేదు పోదు. ఐతేనేం. ఉండనీ! ఈ రక్తధ్వజాన్ని ఎత్తినవారిలో నగ్రగణ్యులు గురుజాడ వేంకట అప్పారాయ కవి". 1

కిళాంబి రంగాచారిగారి పై వాక్యాలు, పందొమ్మిదవ శతాబ్దం ఆఖరు సంవత్సరాలలోవున్న మన సారస్వత స్థితిని సూక్ష్మంగా చెపుతున్నాయి.

అప్పారాయ మహాకవి వ్యవహారికభాషా ఉద్యమాన్ని కాకతాళీయంగా చేపట్టలేదు. దాని ఒడుదుడుకులు సాధక బాధకాలు సాకల్యంగా పర్యావలోకనంచేసి ఒక నిశ్చయానికి వచ్చేరు:

2"తెనుగు భాషను పెద్ద నాగరికతా సాధనంగా చెయ్యాలంటే, అనవసరంగా వ్యవహరింపబడుతున్న పదాలనుండీ సంస్కృత పదాలనుండీ తెలుగుభాషకు విముక్తికలిగించాలి. పరిపూర్ణమైన వ్యవహారికభాషను ప్రవేశ పెట్టాలి. తెలుగుదేశంలో వేరువేరు ప్రదేశాల్లో మాటాడే భాషలో అట్టే తేడాలేదు, కాబట్టి సమర్థులైన రచయితలు గట్టిగా పూనుకున్నట్టయితే తెలుగువారందరికీ సామాన్యమైన కొత్తభాషను తేలికగా స్థాపించవచ్చును"

"చాలా కృత్రిమమైన సారస్వతభాషా నియింతృత్వం వల్లనూ, అనుప్రాసముతోకూడుకొని కఠినమైనపద్యరచనాపద్ధతివల్లనూ, చాలకాలమై గతించిపోయిన పురాతన సారస్వత పద్ధతులవల్లనూ, తెలుగు మేధస్సు ప్రమాదకరమైన కూపంలో పడిపోయింది....

"తెలుగు సారస్వతభాష, సాంప్రదాయంవల్ల తెలుగువారి నెత్తిమీద రుద్దబడిన పెద్ద ఆటంకమని నాఉద్దేశం. సంకెళ్ళను ప్రేమించేవారిని దానిని పూజించనివ్వండి. ఏభాషలోనైతే మనసుఖదుఃఖాలను మనసుందరమూ జంకులేకండా వ్యక్తపరుస్తున్నామో - కాని ఏభాషలోనైతే కొందరు తమ భావాలను రాతద్వారా వ్యక్తంచేసుకోడానికి జంకుతున్నారో - ఆ సజీవమైన

1. 'ముత్యాలసరాలు' రెండవకూర్పు 'మొదటిమాట'లో.

2. చూ. కన్యాశుల్కం మొదటికూర్పు పీఠిక.

తెలుగు, 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అనబడే తెలుగు. నా మాతృభాష యైన వ్యవహారిక తెలుగే నాకు కావాలి. వ్యవహారికభాషలో రచింపబడిన సారస్వతం మనదేశంలోని రైతులను మేలుకొల్పుతుంది. మనదేశంలోని ఇంగ్లీషువారిని కదుపుతుంది. దానివల్ల అసంఖ్యాకములైన ప్రయోజనాలున్నాయి."1

అప్పారాయ మహాకవి భాషాప్రేమనూ భాషాకృషినీ కార్యదీక్షనూ పైనుదహరించిన వాక్యాలు వ్యక్తంచేస్తాయి.

"ఇంగ్లీషుభాషాశైలి ప్రాకృతాల చరిత్రలు తెలిసివున్నవారితో, మన మాతృభాషా సారస్వతాలగురించి వాదించనక్కరలేదు; క్రొత్తతెలుగు భాషను పరిణతిచెందించేవి వాదోపవాదాలు కావని నేనెరుగుదును. ఒక గొప్పరచయిత దాన్ని రాసి సృష్టించాలి. ఆగొప్పరచయితకోసం మనం పునాదులువేద్దాం." 2

ఆ నూతన భాషాశైలిని సృష్టించిన గొప్పరచయిత తానే అని అప్పారాయమహాకవికి తెలియదేమో ?

మహాభారతయుద్ధంలో కృష్ణార్జునులవలె అప్పారాయమహాకవీ, గిడుగురామమూర్తి పండితుడూ ఆనాటి అభివృద్ధినిరోధకులను ఓడించి తమ ఆదర్శాన్ని స్థాపించుకోగల్గేరు. మహాకవి అప్పారావుగారు సారధియై వ్యావహారికభాషారథాన్ని ముందుకు నడిపించుకపోయారు గిడుగు పండితుడు ప్రతికక్షులతో యుద్ధాలుచేసి ఓడించి రథానికి దారిచేసేరు.

ఒక ఆశయంగా ప్రారంభమైన వ్యవహారికభాష రానురాను మహా ఉద్యమమైంది. వ్యవహారికభాష ఒక ఆశయంగావున్న రోజుల్లోనే అప్పారావుగారు కన్యాశుల్కాన్నిరాసి, దాని హక్కులను అందచందాలను స్థిరపర్చేరు.

ఆశయమై వుంటున్నరోజుల్లోనే, జె.ఎ. ఏట్సుగారు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్సుగా 1906 లో పర్లాకిమిడివచ్చి గిడుగువారితో బోధనాపద్ధతులను గురించి చర్చించేరు; దైనందిన జీవితంతో ప్రసక్తిలేని భాషలోనూ, బోధనా పద్ధతులలోనూ, తీవ్రమైన మార్పులురావాలని రామమూర్తిగారితో చర్చించి ఒక నిశ్చయానికి వచ్చేరు.

---

1. చూ. కన్యాశుల్కం రెండవకూర్పు పీఠిక.
2. ,, ,,

మాట్లాడేభాష, రాసేభాష వేరువేరుగా వుండడం సారస్వతాభివృద్ధికి పెద్ద ఆటంకం కాకతప్పదు. ఉగ్గుపాలతో నేర్చుకొనే నిజమైన మాతృభాష వ్యవహారికభాషను మూలపెట్టి, గ్రంథాల్లో జీవించే కృత్రిమభాషతో సారస్వతరచన సాగించడం శోచనీయంగా కనపడింది.

వాడుకభాషనుకూడా వ్యాకరణసమ్మతమైనదిగా చేయవలసిందని గిడుగు రామమూర్తిగారు వాదించేరు. వీరేశలింగంగారు రామమూర్తిగారి సహకారంతో వ్యవహారికభాషకొక వ్యాకరణాన్ని రాయడానికికూడా సిద్ధపడ్డారు. సుప్రసిద్ధ విద్యావేత్త రామానుజాచారిగారు పోలవరం జమీందారుగారు మొదలైన పండితులు వాడుకలోలేని పదాలను నవ్యసారస్వతంనుంచి తొలగించాలని వాదించేరు. 1914 సం వరకూ వ్యవహారికభాషా సిద్ధాంతం ఒక ఆశయంగా మాత్రమే వుంది.

తరువాత పి. టి. శ్రీనివాసయ్యంగారు 'లైఫ్ ఆర్ డెత్—ఎ ప్లీ ఫర్ వెర్నాకులర్స్' * అన్న పుస్తకంలో సులభమైన వ్యవహారికశైలిని యెక్కువగా సారస్వతంలో వుపయోగించవలసిందన్నారు. గ్రాంధిక వ్యవహారిక భాషల మిశ్రమంగా సెట్టి లక్ష్మీనరసింహంగారు తమ 'గ్రీకుపురాణ కధ' లను రాసేరు. 'గ్రీకుపురాణకధలు' యస్. యస్. యల్. సి పరీక్షకు పాఠ్య పుస్తకంగా పెట్టబడింది. ఇది పండితలోకంలో పెద్దతుపాను రేగగొట్టింది; ఆందోళన చెయ్యడంతోబాటు మంత్రతంత్రాలనుకూడా చేసేరు. పలుకుబడి గల పదవులలోవున్నకొందరు వారిపక్షం అవలంబించి 'గ్రీకుపురాణకధలను' పాఠ్యపుస్తకాలనుండి తప్పించివేయగల్గేరు. ఏదో ఒక అభిప్రాయంగా, ఆశయంగా, ప్రారంభమైన వ్యవహారికభాష ఒక కార్యక్రమంగల మహా ఉద్యమంగా అభివృద్ధికాసాగింది కిళాంబి రామానుజాచారిగారి అధ్యక్షత క్రింద విజయనగరంలో ఏర్పడ్డ ఆంధ్రసాహిత్యసంఘం, ఆధునిక విజ్ఞాన ప్రచారం వ్యవహారిక భాషద్వారా జరగాలని ఆందోళన చెయ్యసాగింది.

పిఠాపురం మహారాజావారి ఔదార్యంతోను, జయంతి రామయ్య పంతులుగారి నాయకత్వంతోను, వ్యవహారికభాషా వ్యతిరేకోద్యమం తీవ్రత దాల్చింది. సభల్లోను, పత్రికల్లోను, మహజర్లతోను ఆందోళన ప్రారంభించేరు.

విద్యార్థులకు అనువైన శైలి నిరూపించమని మద్రాసు విశ్వవిద్యాలయం ఒక కమిషనును ఏర్పరచింది. భాషాశైలినిచర్చించి నిర్ణయించడానికి

---

* 'Life or Death - a plea for Vernaculars'

తెలుగుదేశంలో చాలచోట్ల సభలు జరిగేయి. సర్. బయ్యా నృసింహేశ్వర శర్మగారి నాయకత్వంకింద, వ్యవహారికభాషకు వ్యతిరేకంగాను వచ్చి శృంగార ప్రబంధ ప్రచురణకు అనుకూలంగాను డిప్యూటేషను పంపడానికి ప్రయత్నాలు జరిగేయి.

ఈ ఉద్యమంలో గిడుగు రామమూర్తిగారు పడిన శ్రమ, చూపిన ప్రతిభ తెలుగుజాతి గర్వించదగ్గది. బరంపురం మొదలు చెన్నపట్నం వరకూ వ్యయప్రయాసాలను లెక్కించక ఆయన సంచారంచేసేరు. భాషాతత్త్వాన్ని మథించి, ఛాందసదృక్పథాన్ని బట్టబయలుచేసి, తమవాదాన్ని నిరూపించుకోగలిగేరు. ఈ సందర్భంలో ఆయనరాసిన 'Memorandum on Modern Telugu' 'నిజమైన సాంప్రదాయము', 'ప్రాదెసుగు గద్య' మొదలైన రచనలు ఆయన ప్రతిభను ప్రదర్శిస్తాయి. *

ఇంతకుపూర్వమే దుర్గ్రాహ్యమైన కొక్కొండ వెంకటరత్నంగారి ప్రబంధశైలికీ, ప్రజలకు సుబోధకమైన కందుకూరి వీరేశలింగంగారి సులభ శైలికీ, భీషణమైన పోరాటం జరిగింది. వ్యవహారికభాషాశయమైన సులభ శైలి తరఫున వీరేశలింగంగారు నాయకత్వం వహించేరు. తరువాత వ్యవహారికభాషా ప్రవర్తకసమాజం అధ్యక్షత నంగీకరించి వీరేశలింగం గారు. వ్యవహారికభాషా ఉద్యమంతో ఏకీభవించి, దానికి నైతికబలాన్ని చేకూర్చేరు.

ఈ సంఘర్షణలో గ్రాంధికభాషాపక్షం గెలిచివున్నట్టయితే తెలుగు సారస్వతం కొన్నితరాలు వెనక్కి వెళ్ళవలసివచ్చేది. విద్యావ్యాప్తికి పెద్ద ఆటంకం కలిగివుండేది. ఈనాడు ప్రజల్లోనికి చొచ్చుకుపోతున్న తెలుగు సారస్వతం పండితుల జనానాలో బంధించబడి వుండవలసివచ్చేది. కాని వీరేశలింగం, గిడుగు రామమూర్తి, అప్పారాయ మహాకవివంటి యోధుల పరాక్రమంవల్ల మన తెలుగుభాష ఆదుస్థితినుండి తప్పించుకుంది.

---

* చూ. 'వ్యాససంగ్రహం'లో బుర్రా శేషగిరిరావుగారి వ్యాసం—

"And the permanent contribution made by him (గిడుగువారు) to this great urge for democratic self-expression in Andhra literature entitles him to the greatest veneration of the Andhra youth, as the great literary enfranchiser, in some respects even greater, because less compromising than his great leader Veeresalingam pantulu, the maker of Modern Andhra life and literature."

వ్యవహారికభాషను వీరేశలింగంగారు ప్రహసనరచనకు మాత్రమే వినియోగించేరు. ఆయననుండి అప్పారావుగారు, రామమూర్తిగారు నైతిక దీక్షను అలవర్చుకొని, తెలుగుసంస్కృతిని పెంపొందించడానికి వ్యవహారిక భాషను వినియోగించేరు. వీరేశలింగంగారు వుంచిన ఆకాస్త ముసుగును కూడా తొలగించి, వ్యవహారికభాషకు గౌరవమైనస్థానాన్ని సంపాదించడానికి పూనుకున్నారు.

"నాది ప్రజల ఉద్యమము దానిని ఎవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేను." అని తమ ఆదర్శాన్ని 1911 మార్చి 27 వ తేదీని అప్పారాయ మహాకవి తమ డైరీలో రాసుకున్నారు వ్యవహారికభాషా ప్రయోజనాలు అశేషమైనవనీ, వ్యవహారికభాష రైతులకళ్ళు తెరుస్తుందనీ, భారతదేశంలోవున్న ఇంగ్లీషువారికళ్ళుకూడా తెరుస్తుందనీ, కన్యాశుల్కం రెండవకూర్పు పీఠికలో అప్పారావుగారు రాసేరు. ప్రజల ఉద్యమమని యీనాడు రుజువైన వ్యవహారికభాషా ఉద్యమస్వభావాన్ని అర్ధశతాబ్దంక్రితం స్పష్టంగా చెప్పగలిగిన ఆలోచనాపరుడు అప్పారావుగారు! ఆమహోద్యమాన్ని 'ఎవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేని' దీక్షాపరుడైన ప్రజాభిమాని అప్పారావుగారు!

ఆనాడు వ్యవహారికభాషను చేపట్టడమంటే ఏటికి ఎదురీతవంటిది. ప్రబలులైన పండితులతో ఢీకోవడమన్నమాట. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, శ్రీరాముల సచ్చిదానందశాస్త్రి, వావిలకొలను సుబ్బారావు, భోగరాజు నారాయణమూర్తివంటివారు నీచంగా తూలనాడుతున్నా, అప్పారావుగారు తాను రెచ్చిపోయి వారిస్థాయికి దిగకుండా, తమసహజసౌమ్యతతో ప్రతికక్షులకు నొప్పికలిగించని విధంగా జవాబులిచ్చేవారు. వ్యవహారికాన్ని దూషించడానికి రాసిన వారి భాషలోనే దోషాలను చూపి, గ్రాంధికభాషలో అటువంటి పండితులుసైతం తప్పుల తడకలు రాస్తున్నప్పుడు సామాన్యులమాటేటని ప్రశ్నించేవారు.

"గ్రాంధికభాషలో రాయడమన్నది గరిడీవిద్య. భగవంతుడు కాళ్ళు యిచ్చినందుకు సుఖంగా నడవక గెడలెక్కుదురు; యేమిచెయ్యను ?"

"శిష్టులు రాత్రిపగలూ వాడుకచేసే భాషను గ్రామ్యమనడము అనాలోచితమనుకుంటాను. అదే గ్రామ్యమౌట నిజమైతే, యిప్పటి గ్రంథకర్త అంతా గ్రామ్యజనమే![1]"

1. చూ. "మాటా - మంతీ"లో అప్పారావుగారి వ్యాసాలు.

ఇటువంటివి ఆనాటి యుద్ధాలలో అప్పారాయ మహాకవి ప్రయోగించిన అస్త్రాలు సబబూ సందర్భమూ లేకండా శాస్త్రప్రమాణాలవేపు పరుగులెత్తేవారిని అప్పారావుగారు 'లవణరాజుకల'లో యీవిధంగా వర్ణించేరు :

"పుస్తకంబులలోని మాటలు
విస్తరించుచు, ననుభవమ్ముల
తత్వమెరుగక, శుకములగుదురు
వొట్టి శాస్త్రజ్ఞుల్ !"

తమ పరమమిత్రులైన గిడుగురామమూర్తిగారితో కలిసి వీరిని చివరివరకు ఎదిరించి పోరాడి తమ ఆదర్శాన్ని అప్పారావుగారు స్థాపించకోగల్గేరు.

ఈసందర్భంలోనే అప్పారావుగారికి రవీంద్రనాథఠాగూరుగారికీ ఉత్తరప్రత్యుత్తరాలు నడిచేయి. అప్పారావుగారు వ్యవహారికభాషను బలపర్చడం ఆయనకు గ్రాంధికభాషలో రాయడంచేత కాకపోవడంవల్లనే అని కొందరు పండితులు ఆక్షేపించేవారు. ఆ కుంటివాదాన్ని ఎదుర్కొనడానికి 'సుభద్ర' అన్న పద్య కావ్యాన్ని 1913 లో ప్రబంధశైలిని ప్రశంసనీయంగా రాసి, పండితుల కుంటివాదానికి యింకొక దెబ్బకొట్టేరు.

విశ్వవిద్యాలయం శైలిని నిర్ణయించేనిమిత్తం ఒక సంఘాన్ని ఏర్పాటుచేసింది. అందులో అప్పారావుగారుకూడా ఒక సభ్యులు. గ్రాంధిక వాదుల ప్రాబల్యంగల ఆ సంఘం వ్యవహారికభాషకు వ్యతిరేకంగా నిర్ణయం చేసింది. అప్పారావుగారు ఆనిర్ణయానికి అసమ్మతి తెలియజేస్తూ భాషాచర్చ మీద చక్కని వ్యాసాన్ని 1914 లో రాసేరు.[1] ఇది భాషావిషయమై అప్పారావుగారు చేసిన కృషిని తెలియజేస్తుంది.

క్రమేపీ వ్యవహారికభాషను ఎదిరించిన వారొకొక్కరూ వ్యవహారిక భాష పక్షానికి రావడమో, తటస్థంగా వూరుకోవడమో, తమ వాదంలో బలంలేదని తేలిపోయినప్పటికీ మొండిగా వాదించడమో చెయ్యసాగేరు. వ్యవహారికభాషను 'గ్రామ్య'మనీ 'కులట'అనీ 'లంజసంతతి'అనీ సబబు తప్పి, తిట్టిన భోగరాజు నారాయణమూర్తివంటివారుకూడా "చిన్నయసూరి సూత్రముల జిక్కుకృశించి విషాదమొందుతూవున్న తెనుంగు, శృంఖలము

1. 'The Minute of Dissent to the Report of the Telugu Composition Sub-committee'

లూటి, సుఖంబుగ షేడ పెడగూర్చున్నది; నూత్నకాంతిగనుచున్నది; హాయిగ నేడు సంచరిస్తున్నది...." [1] అని మెచ్చుకొని వ్యవహారికంలో వృత్తాలు కూడా రాశేరు.

పాడుకభాషలో వచనమేకాకుండా గీతాలుకూడారాసి, అప్పారాయ మహాకవి దాని మాధుర్యాన్ని తెలుగువారికి పంచిపెట్టేరు. ఈనాడు యిన్ని పత్రికలు, యింతమంది రచయితలూ. పాఠకులూ వున్నారంటే, గిడుగు వారి పాండిత్యంతోపాటు అప్పారావుగారి చలువే కారణమని చెప్ప నక్కరలేదు.

ఉ త్త మ క ళా వే త్త:

"యుగయుగంబులనుండి మ్రోగెడు
విశ్వగాన వియత్తగంగిణి
భంగముల నుప్పొంగు నాతని
గీతశీకరముల్" 2

ఊహాపూరితమైన కళాసృష్టికంటె, జీవితదృశ్యాల్ని, సమస్యల్ని కళారూపాల్లో పెట్టడానికి, కళాకారుడికి మానవజీవితాన్ని పరిపాలిస్తున్న వివిధ శక్తుల విషయపరిజ్ఞానం విశేషంగావుంటేనేగాని సాధ్యంకాదు ఇది 'కళ కళకోసమే' అన్న సిద్ధాంతంగల రచయితకు అనవసరం. ఇతర హంగులకోసం యితను తాపత్రయపడతాడుగాని, జీవితంతోను జీవితంపై ప్రభుత్వం చేస్తున్న యితరశక్తులతోను జోక్యం కలుగజేసుకోడు. కళ కళ కోసమే అని ప్రాకులాడి జీవితానికి వెన్నుచూపని కళాకారుడు వీటిని హృదయస్థంచేసుకోవడమేకాకండా, కళారూపాల్లో వెల్లడించాలి. అందుచే తనే యితనిపని చాలకష్టమైనది. అట్టి ఎగుడుపనికి పూనుకొని సమర్థతతో నిర్వహించి తెలుగు సాహిత్యంలో విప్లవకరమైన మార్పులుతెచ్చిన మహా కవి అప్పారావుగారు.

"ఆకులందున అణగి మణగీ
కవితకోకిల పలుకవలెనోయి
పలుకులనువిని దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయి."

---

1 చూ. 'వ్యాసపంగ్రహం' — సంపాదకుడు. తెలికిచర్ల వెంకటరత్నంగారు
2 దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు.

బాహ్యాడంబరంలేని ఉన్నతహృదయంలాగ అప్పారాయమహాకవి పాడిన యీగేయం, ఆదర్శ సాహిత్యమేమో తెలియజేస్తోంది.

కవిత కోకిలపలుకులు దేశమందభిమానములు మొలకెత్తించాలి.

అప్పారావుగారు మనకిచ్చిన కవితాదర్శంయిది.

"మేలిమిబంగరు మెలతల్లారా!
కలువల కన్నుల కన్నెల్లారా!
తల్లులగన్నా పిల్లల్లారా!
విన్నారమ్మా యీకథను.

ఆటలపాటల పేటికలారా!
కమ్మనిమాటల కొమ్మల్లారా!
అమ్మలగన్నా అమ్మల్లారా!
వినరమ్మా మీరీ కథను"

పై రెండుపాటలు అప్పారాయ మహాకవి పద్యకథానిక 'పూర్ణమ్మ' లోనివి; ఆడపిల్లలకోసం రాయబడినవి. రాళ్ళను కరిగించే విషాదగాథ.

"పళ్ళనుమీరిన తీపులనడలను
పువ్వులమీరిన పోడుములున్
అంగములందున అమరెను పూర్ణకు
సౌరులుమించెన్ నానాటన్."

ఈ పుత్తడిబొమ్మ పూర్ణమ్మను 'కాసుకులోనై తల్లీ తండ్రీ నెనరూ న్యాయం విడనాడి' కాటికికాళ్ళు చాచుకున్న ముసలివానికి ముడివేస్తారు.

"ఆమనిరాగా దుర్గకొలనులో
కలకలనవ్వెను తామరలు;
ఆమనిరాగా దుర్గవనములో
కిలకిలపలికెను కీరములు"

కాని పూర్ణమ్మ ఎలాగవుంది ?

"ముద్దునగవులూ మురిపెంబు మరి
పెనిమిటిగాంచిన నిమిషమున
బాసెను కన్నియ ముఖకమలమ్ము
కన్నులగ్రమ్మెను కన్నీరు."

కొన్నాళ్ళకు భర్త తీసుకవెళ్ళడానికొచ్చేడు. పూర్ణమ్మను సాగనంపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పూర్ణమ్మకూడా సిద్ధమయింది — భర్తయింటికిమాత్రంకాదు - యింకోచోటికి.

"పెద్దలకప్పుడు మొక్కెను పూర్ణమ
తల్లీ తండ్రీ దీవించ్రి;"

కాసుకులోనై తనబతుకు బద్దలుచేసిన తల్లిదండ్రులు దీవించేరు:

"దీవనవింటూ పక్కున నవ్వెను
పుత్తడిబొమ్మా పూర్ణమ్మా!"

హిందూసంఘమంతా దద్దరిల్లవలసిన నవ్వునవ్వింది. పూర్ణమ్మ సెలవు - తుదిసెలవు - తీసుకుంటూంది:

"నలుగురు కూచని నవ్వేవేళల
నాపేరొకతరి తలవండి;
మీమీ కన్నబిడ్డల నొకతెకు
ప్రేమను నాపేరివ్వండి."

"బలబల కన్నుల కన్నీరొలికెను
పుత్తడిబొమ్మకు పూర్ణమకు"

ఒక్క పూర్ణమకేకాదు. బంధువులందరితోబాటు పాఠకులుకూడా 'బలబల కన్నీరు' కార్చుతారు. తల్లికూడా కంట తడిపెడుతుంది. కాని

"కాసుకులోనై అల్లుని తలుచుకు
ఆనందించెను అమ్మొకదె."

పూర్ణమ్మ దుర్గపూజకు వెళ్ళిపోయింది.

"ఆవులు పెయ్యలు మందలజేరెను
పిట్టలు చెట్లను గుమిగూడెన్;
మింటను చుక్కలు మెరయుచు పొడమెను
పూర్ణమ యింటికిరాదాయె.

చీకటినిండెను కొండలకోనల
మేతకు మెకములు మెసలజనెన్."

కాని పూర్ణమ్మ యింటికితిరిగిరాలేదు. పూర్ణమ్మఏమయిపోయింది?

"కన్నుల కాంతులు కలువలచేరెను
మేలిమిజేరెను మేనిపసల్
హంసలజేరెను నడకలబెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ."

ఈ కన్నీటి కథ సమాప్తమయింది. ఈ కావ్యంలోని ఒకొక్క అక్షరం మహాకవి అప్పారావుగారు ఒకొక్క కన్నీటి చుక్కతో చెక్కినది. ఈ కావ్యంలో, 'బలబల కన్నీ'రోడుతూ, పాఠకుడికి మహాకవికూడా కనిపిస్తాడు. 'కన్యాశుల్కం'లో లోపించిన శోకరసం 'పూర్ణమ్మ'లో ప్రత్యక్షమవుతుంది.

'పూర్ణమ్మ' నిరాడంబరమైన కావ్యం. సాంప్రదాయసిద్ధంగా కావ్య శిల్పాన్ని గుత్తగొన్న కృత్రిమత్వం, మహాకవి యితరరచనలలోలాగనే, యిందులో వెలివేయబడింది. నిరాడంబరమైన, జాతీయమైన సౌందర్యం యీకావ్యంలో తొణికిసలాడుతుంది. అది అప్పారాయమహాకవి ప్రత్యేకత, విశిష్టత.

అందుచేతనే, జీవితాన్ని వదులుకొని కళలంటే మేఘాలమీద పునాదులువేసి కట్టిన గాలిమేడలనుకొనే కృత్రిమజీవులను

"కొయ్యబొమ్మలె మెచ్చుకళ్ళకు
కోమలుల సౌరెక్కునా?"

అని ప్రశ్నిస్తున్నారు మహాకవి.

తండ్రి ధనాశకూ, పుస్తెకట్టిన ముసలివాడి కసాయితనానికీ పూర్ణమ్మ బలిఅయిపోయినట్టే. 'కన్యక' కావ్యంలో రాజు మదాంధతకు కన్యక బలి అయిపోతుంది.

"తగటు బంగరుచీరెకట్టి
కురుల పువ్వులసరులుజుట్టి
నుదుట కుంకుమబొట్టుపెట్టి
సొంపు పెంపారన్.

తొగలకాంతుల కనులుపరపగ
మించుతళుకులు నగలునెరపగ
నడక లంచకు నడలుకరపగ"

దేవాలయానికి వెళ్తున్న కన్యకకు ఆవూరు రాజు ఎదురై, 'కన్నె సొగసుకు కన్నుచెదురై, మరునివాడికి గుండెబెదురై'

"జాబిల్లి చుక్కల నడుమచందురు
నట్లు వెలిగెడు కన్నెముందర,
వన్నెకాంచిన నగరిసుందరు
లందరొకలెక్కా ?
పట్టవలెరా దీనిబలిమిని
కొట్టవలెరా మరునిరాజ్యం
కట్టవలెరా గండపెండెం
రసిక మండలిలో"

అని తలపోస్తూ కన్యకను పట్టుకోవడానికి ప్రయత్నిస్తాడు. కన్యక సమయస్ఫూర్తితో

"ముట్టబోకుడు దైవకార్యం
తీర్చివచ్చెద, నీవుపట్టం
యేలురాజువు, సెట్టికూతుర,
వేటకు పోనేర్తున్"

అని తాత్కాలికంగా తప్పించుకొంటుంది. కన్యక తండ్రి, బంధువులు వస్తారు. కన్యకను అగ్నిసాక్షిగా వివాహంచేసుకోవలసిందని తండ్రి రాజుకు విన్నవించుకుంటాడు. రాజు తృణీకారపు నవ్వునవ్వి

"....ఓహో! ధర్మమార్గం
పట్టమేలే రాచబిడ్డకు
పెట్టి కరపడమా!
రాజుతలచిందేను ధర్మం
రాజుచెప్పిందెల్ల శాస్త్రం
రాజులకు పేరైనపద్ధతి
కాద, గాంధర్వం ?"

అని తన నిరంకుశత్వాన్ని ప్రకటిస్తాడు. తన రాక్షసత్వాన్ని గాంధర్వం అని కప్పిపుచ్చబోతాడు.

"దేగ, పిట్టనుపట్టి విడుచున ?
కన్నె, యింటికి మరలి నడచున ?"

అంటూ తన నిశ్చయాన్ని తెలియజేస్తాడు దైవకార్యం అయ్యేక తమచిత్తం అని కన్యక తండ్రి గిపిప ఒప్పుకుంటాడు.

కన్యక రాజుకు పాఠంచెప్పి తనమానాన్ని రక్షించుకోవడానికి నిశ్చయించుకుంటుంది.

"పట్టమేలే రాజుఅయితే
రాజునేలే దైవముండడొ?
పరువునిలపను పౌరుషము మీ
కేల కలుగదొకొ?"

అని అక్కడ గుమిగూడిన వారిని హెచ్చరిస్తుంది.

"....కానువీసం
కలిగివుంటే చాలుననుకొని,
వీర్యమెరుగక, విద్యనేర్చక,
బుద్ధిమాలినచో
కలగవాయిక్కట్లు? మేల్కొని,
బుద్ధిబలమును బాహుబలమును"

పెంపొందించుకొని స్వరక్షణచేసుకోవడమే కాకుండా సంఘంలో తగిన స్థానం సంపాదించుకోవలసిందని వైశ్యకులాన్ని ప్రబోధిస్తుంది. అవమానానికి గురిఅయిన కన్యక స్త్రీ సహజమైన ధోరణిలో, కామాంధుడైన రాజును సంబోధిస్తుంది.

"పట్టపగలే నట్టివీధిని
పట్టి బోరే జారచోరులు
పట్టదలచితివింక నీవొక
పట్టమేలే రాజువట!
కండకావరమెక్కి నీవీ
దుండగము తలపెట్టినందుకు
వుండడా ఒకదైవమంటూ,
వుండి వూర్కొనునా?"

అని అంటూ కన్యక రాజును సవాలుచేసి మంటలోనికి దుముకుతుంది. దాంతో 'పట్టమేలే రాజుగర్వం మట్టిగలిసెను'!

వైష్ణవుల కులదేవత అయిన కన్యకాపరమేశ్వరికథను యితివృత్తంగా తీసుకొని అప్పారాయ మహాకవి అతిగంభీరమైన కావ్యాన్ని అల్లేరు. కందకావరమెక్కి దుండగంచేసే దుర్మార్గుడైనరాజు. లావణ్యవతి మానాభిమానవతి అయిన కన్యక, రాజు దౌష్ట్యాలకు అలవాటుపడి అణగి మణగి వుండే తండ్రీ, అనన్యసామాన్యంగా చిత్రించబడ్డారు.

ఇరవయ్యో శతాబ్ది మధ్యభాగంలోవున్న యీ రోజుల్లోకూడా యిటువంటిదుర్మార్గాలుజరగకపోలేదు. స్వదేశసంస్థానాలనుండీ, జమీందారీలనుంచీ, అప్పుడప్పుడిటువంటి వార్తలు వస్తూనేవున్నాయి. కాగా, సాంఘికమైన యీశోకవిషాదాన్ని, అప్పారాయ మహాకవి యీకావ్యంలో చూపెట్టేరు.

నానావర్ణ సహపంక్తి భోజనంలో పాల్గొని యింటికివచ్చిన భర్త భార్య పడ్డ ఆందోళనకు ఎలాగ కారకుడయ్యేడో, 'ముత్యాలసరములు' అన్న పద్యకథానికలో అప్పారావుగారు చూపెట్టేరు. ఈ సహపంక్తి భోజనం సనాతన కుటుంబంలో యెటువంటి ఫలితాల్ని యిచ్చిందో మహాకవి స్త్రీ నోటితో చెప్పిస్తున్నారు. ఇటువంటి స్త్రీ ప్రతి సామాన్యకుటుంబంలోనూ వుంటుంది,

"వింటి మీ పోకిళ్లు వింటిని,
కంటనిద్దుర కానకుంటిని;
యీచిన్నమనసును చిన్నబుచ్చుట
యెన్నికని యోచించిరో ?"

ఆవిణ్ణి తోటికోడలుదెప్పింది; సానుభూతిచూపి సాటివారోదార్చేరు. ఇవ్వన్నీ సహించింది. కాని

"మాటలాడక చూచినవ్వెడి
మగువ కేమందున్"

అని బాధగా భర్తసడుగుతూంది. భావాలు పరిపరివిధాల పరుగెడుతున్నాయి.

"తోడుదొంగని అత్తగారికి
తోచెనేమో యనుచుగుండిలి:
కాలగతియని మామలెంతో
కలగ సిగ్గరినై."

అక్కడితో ఆగక, భర్తకు ప్రేమతో చీవాట్లుపెట్టడానికి ప్రారంభిం చింది. ఇంగ్లీషుచదువే యీ మురువు తెచ్చిందని—

"చాలునహా! మీ చాకచక్యము
*చదువుకిదె కాబోలు ఫలితము
ఇంతయగునని పెద్దలెఱిగిన
యింగిలీషులు చెప్పుదురా?

"కోటపేటలు నేలగలరని
కోటివిద్యలు మీకు కఱపిరి;
పొట్టకూటికి నేర్చువిద్యలు
పుట్టకీట్లు కదల్చెనా?"

కట్టుకున్న తనమాటెలాగున్నా, కనిపెంచిన తలితండ్రుల ముఖ మైనా చూడవద్దా అని ప్రశ్నిస్తుంది. శృతి యింకాకొంచం యెక్కువచేసి—

"కలసిమెలసిన యంతమాత్రనె
కలుగబోదీ యైకమత్యము;
మాలమాదిగ కన్నెనెవతెనొ
మరులుకొనరాదో?"

అని భర్తకొక అమోఘమైన సలహానిస్తుంది. కోపం ఆపలేక, సంస్కరణప్రియుడైన భర్తమనసు వికలముచేసి వెళ్ళిపోతుంది. కవి యీవిడమీద మనకు కోపాన్ని తెప్పించడు. వర్ణధర్మాల్లో కూరుకపోయి వున్న ఒక స్త్రీనిచూపి జాలి రేకెత్తిస్తాడు.

ఇంతలో 'తూర్పు బల్లున తెల్ల'వారుతుంది. ఆదర్శప్రియుడైన భర్త 'లోకమందలి మంచిచెడ్డలు లోకులెరుగుదురా?' అన్న సందిగ్ధంలో వుంటూండగా కథ సమాప్తమవుతుంది.

ఆభరణాలమీద ఆపేక్ష వుండడం స్త్రీలకు సహజం. ఆభరణాలు చెయ్యించితెమ్మని భర్తను అడిగిఅడిగి, విసిగిపోయి, భార్య అలుగుతుంది. 'కాసులు' అన్న ఖండకావ్యంలో (మోనొలాగ్) స్త్రీకి నిజమైన ఆభరణా

* "చదువువారికి వెర్రిభ్రాంతులు
మెదడు కెక్కిన పాయవందురు"
('డామన్ పితియన్')

ప్రేమతో విద్యావంతుడైన భర్తచేత చెప్పించి, భార్య అలకను తీర్పిస్తాడు మహాకవి.

"ధనములు రెండు తెఱగులు;
ఒకటి మట్టిని పుట్టినట్టిది; వే
రొకటి హృత్కమలంపు సౌరభ
మదియు నిది యొక్కెడను కలుగుట యరుదు"

ఈ రెంటిలో స్త్రీ వాంఛించవలసినదేది అని అడుగుతాడు భర్త. ధనమంటే 'హృత్కమలంపు సౌరభ'మని భర్త నిర్వచనం; భార్యకు ధనమంటే బంగారం.

బంగారం స్త్రీలకు అందమిస్తుందని లోకంలోవున్న అభిప్రాయాన్ని ఒప్పుకున్నప్పటికీ, ప్రేమలేని అందం వాసనలేని మంకెనపువ్వు అందం వంటిది.

"................తీవలకు
తవిరులతెరంగున, కాంచనము
సింగారమందురు లలనలకు;
కానిమ్ము; గాని, కమ్మనితావి
గమ్మెడి పుష్పనిచయము ప్రేమ
కా? అదిలేక మంకెన కెంపు
కాంతల యందము."

"....................ప్రేమ
పెన్నిధిగాని, యింటను నేర్ప
రీకళ, ఒజ్జలెవ్వరులేరు
శాస్త్రము లిందుగూర్చి తాల్చె
మౌనము * నేను నేర్చితి భాగ్య
వశమున, కవుల కృపగని, హృదయ

---

* "విద్యయందలి మాయమర్మము
దిద్ది చెప్పిందబల యొక్కతె
విద్యలెరుగని ప్రేమభరమును
వింతగా చూపెన్"
('డామన్ పితియస్')

మెల్లన నించినావను ప్రేమ
యను రతనాల........"

వాటినే ఆభరణాలుగా గ్రహించి అలంకరించుకో మంటాడు.

"..............సతుల సౌరను
కమలవనముకు పతుల ప్రేమమె
వేవెలుగు; ప్రేమ కలుగక బ్రతుకు చీకటి"

ప్రేమ ఎటువంటిది? మరులా ప్రేమా ఒకటేనా అన్న ప్రశ్నలకు

"మరులు ప్రేమని మది దలంపకు;
మరులు మరలును వయసుతోడనె;
మాయమర్మములేని నేస్తము
మగువలకు మగవారి కొక్కఁడే
బ్రతుకు సుకముకు రాజమార్గము—
ప్రేమనిచ్చిన, ప్రేమవచ్చును—
ప్రేమనిలిపిన ప్రేమనిలుచును."

ఈ ఖండకావ్యం మన నవ్యసాహిత్యంలోని ప్రేమసాహిత్యానికి 'ఓనమాలు'. కాని యీ ఒరవడి రాలేదు; అంతేకాకుండా వెనకకు నడుచు కొంటూ ప్రబంధ సాహిత్యంవేపు దారితీసింది.

ఈ సందర్భంలో అప్పారాయమహాకవిచేసిన స్త్రీ సౌందర్యవర్ణనను ఒకసారి చూడవలసివుంది.

"అరమొగిడ్చిన కన్నుగవతో,
చెదరియాడెడి ముంగురులతో,
బెదురుయెరగని బింకమొప్పిన
బెడగు నడకలతో,

కూటికడవను బుజముపైనిడు
వాటమదియొక మురువుగులుకగ
పాటపాడెను, పాటలాధరి
చెట్లుచేమలకై.

తెలివియొలికెడి తేటకన్నులు
మురువుగులికెడు ముద్దుమోమును

వేల్పుచేడియలైన నేఁ౭ని
గానమాధురియున్"

('లవణరాజు కల')

"తగటు బంగరు చీరెకట్టి
కురులపువ్వుల సరులుజుట్టి
నుదుట కుంకుమబొట్టుపెట్టి
సొంపు పెంపారన్;

తొగలకాంతులు కనులుపరసగ
మించు తళుకులు నగలు నెరపగ
నడకలంచకు నడలుకరపగ
కన్నెపరతెంచెన్"

('కన్యక')

"పళ్ళనుమీరిన తీపులనడలను
పువ్వులమీరిన పోడుములున్
అంగములందున అమరెను పూర్ణకు
సొరులుమించెను నానాటన్"

('పూర్ణమ్మ')

అప్పారాయమహాకవి స్త్రీని వర్ణించి, తను రెచ్చిపోయి చదివే వాళ్ళను రెచ్చగొట్టలేదు. ఆయన కొయ్యబొమ్మలను సృష్టించలేదు. కోమలిని మాత్రం వర్ణించేరు.

అప్పారాయ మహాకవి చేసిన శృంగార వర్ణనలు ఉత్తమజాతికి చెందినవి. "పచ్చి" లేనిశృంగారంలోని వివిధ రూపాలను మహాకవి చక్కగా చిత్రించారు. "నాటిమాట" అన్నపాటలో మోసగింపబడిన స్త్రీ, ప్రియుణ్ని ఉద్దేసించి అనిన మాటలలో యెంతచక్కటి వ్యంగం వుందో గమనించండి.

ప్రియుడు విరహిణిని తన "ప్రాణ" మని చెప్పేడు. తన్ను "ముమ్మాటికి" విడననిఅన్నాడు. ఆ "మాటను మూటకట్టుకొని" నేరం ప్రియునిదే అనడం తనపొరపాటేనని ఒప్పుకుంటుంది. "మాటన నేపాటిర నీసాటిదొరకు" అనీ, బ్రతుకే స్థిరంకానప్పుడు మాటమట్టుకు స్థిరమా అనీ మాటతప్పిన ప్రియుణ్ని యెత్తిపొడుస్తుంది. వేషభాషల బూటకాలను

నమ్మి మోసపోయే ఆడవాళ్ళదే తప్పని తన్నుతాను నిందించుకుంటుంది. "సాటిలేమ" అని తన్ను పొంగించిన ప్రియుడిమాట నిజమేనని సమర్థి స్తుంది. "నమ్మి భంగపాటుపడి పడతికెందు" "సాటికలదె?" అని ప్రియుడి గుండెలు కరిగించేప్రశ్న వేస్తుంది. ఇప్పుడైనా ఒక్కసారివచ్చి అనుగ్రహించమంటుంది! అతని దగామాటనే "కోటిధనములిచ్చి కొందు" నంటుంది: *

---

* సంగీతాభిలాషులకొరకు స్వరాలతోపాటు పాటంతా యివ్వబడింది:

సాటిమాట

అఠాణా - రూపకం

పల్లవి

సాటిమాట మరచుటయే
సాటికైన మనసువశమ ॥

అనుపల్లవి

కోటిప్రాణమీవంటి, ము
ముమ్మాటికి నిను విడనంటి ॥

చరణములు

1. మాట మూటగట్టుకొని
పాటిదప్పితనుట నా పొర
పాటుగాగ, మాటననే
పాటిర నీసాటిదొరకు ॥

2. బ్రతుకునందు లేని స్థిరత
వెతకనేల భాషయందు
నతుకు వేషభాష కోతు
నతివలదే తప్పుగాక ॥

3. సాటిలేదు నాకంటివా
మాటనిజము నేడుగంటి
సాటికలదె నమ్మి భంగ
పాటుపడిన పడతికెందు ॥

పల్లవి

గామపాపనిపనిపధా - నిసరీసనిసధాధపమప

అనుపల్లవి

నిసగారిస - సరిసనిధానిస
సనిసరిసరిసనిపాప - పానిధపమగమపాప - గామప

"లేవాకో మంత్రములు" అన్నపాటలో "నాటిమాట"లోని విరహిణిలాగ ప్రియునికి లొంగిపోకుండా యెంత రమ్యంగా మందలిస్తుందో చూడండి :

మంత్రమహిమచేత ప్రియుణ్ని 'లేమగా జేయ'గలిగినట్లయితే, అతనికి అతనిలాంటి ప్రియుడే తటస్థించి బాధించి వుండేవాడనీ, అప్పుడు తనవేదనను ప్రియుడు అర్థం చేసుకోగలిగేవాడనీ అంటుంది. పగతీర్చుకో డానికా మగతీవయ్యేవు అని అడుగుతుంది. *

'చిత్తరువనిచూడ' అన్నపాట సౌందర్యవతిఅయిన స్త్రీ చిత్రపట మును చూసి "చిత్తము" అర్పించిన పురుషుడు పాడినది. తనసర్వస్వమూ ఆ చిత్రపటంలోని సౌందర్యవతికి అర్పిస్తానంటాడు; తన మనస్సు ఆమె వశమైపోయిందని

చ ర ణ ము

పాపపాపగామపప -
ధాదధాధపదనిదపగామప - నిసగారిస -
సరిసనిధానిస - సనిసరిసరిసనిపాప - పానిధపమగా
మపాప - గామప

* లేవాకో మంత్రములు

శంకరాభరణము - ఝంప.

1. లేవాకోమంత్రములు - లేమగా జేయనిను
లావపుడు బయలుబడు నొక్కొ
కావనుచు నీలాటి - కాంతునకు జిక్కినీ
భావమున నలయిక కనుబడుదొ॥

2. మంచియును చెడ్డయును మానమును గనక పటు
వంచనను పరకాంతదగిలి
యించుకయినను లోక - మెంచునని భీతిలక
కొంచతనమూనుటది కోమరొ॥

3. మగడవై పగతీర్చు - పగతుడవుగాక నిది
తగునటర తలపోయకుంట
మిగిలినదిలేదు దికమీద నినునమ్మనా
నగధరుని నమ్మెదనులేరా॥

మగమపాపాపపమగమపమగాగరి - గామపమమగగిరీగమపా
మగమపాధనిసానససరిసధనిసని - పాదనీధపమగరిస॥

"మనసులేనితనువు — మరియేలనేనాకు
చెనటిదీనిగూడ — చేకొనగదవె"

అంటాడు. వానికిబదులుగా ఒక్కమాట అనమంటాడు. ఆమె ఒక్క మాటకు, తనమనసూ తనువూ "విలువచాలదన్న" మన్మథునిసాక్షిగా ఆమెపలుకుకోసం "కలుగు జన్మములను కానుకగా" సమర్పిస్తానంటాడు! *

ఈమాట శృంగారపదాలలో, తెలుగుసాహిత్యంలో సాధారణంగా కనుపించని ప్రత్యేకతను మహాకవి కనుపర్చేడు. శృంగారం నిజమైన లలితకళగా చిత్రించబడింది.

---

* చిత్తరువనిమాడ

శంకరాభరణము — మిశ్రచాపు

పల్లవి

చిత్తరువని చూడ - చిత్రము గొంటివి
చిత్తజునపరంజి - చిలుక యెవ్వతెవే॥

అనుపల్లవి

వత్తువొ నా మ్రోల - వలరాజువేడిన
మత్తకాశిని నీదు - మనమైననీగదె॥

చరణములు

1. ఇచ్చిపుచ్చుకొంట - యిలలోనిమర్యాద
ముచ్చిలిమౌనము - మెచ్చుదురటవే
వచ్చిచూచినంత - వంచనజేయుదె
పచ్చిదొంగతనము - పడతిరో వదువె॥
2. మనసులేనితనువు - మరియేలనేనాకు
చెనటిదీనిగూడ - చేకొనగదవె
వానికిబదులొక్క - వాక్కునే వేడెద
మానిని యీపాటి - మన్నింపజెల్లునె॥
3. విలువచాలదన్న - విరివిల్తుపైనాన
కలుగుజన్మముల - గానుకకొనవె
ఎలమినానందేంద్రుడు నేలినవెన్నుడు
పలుతెలుగుల మేలు - పడతినీకిచ్చునె॥

పల్లవి

సగామాపధపాప
మధపమగగమపగామరి - మధపాపమగమరిసాసా
సగాగామపరిస -

ఎంతమంది కవులు యిది చెయ్యగలిగేరన్నది ప్రశ్న.

'డామన్ పితియస్' 'లవణరాజు కల' అన్న పద్యకథానికలలో అద్భుతమైన ప్రకృతిదృశ్యాల్ని ప్రదర్శించేరు,

"తదియచంద్రుడు దబ్బిసోకెను
చదలవిడబడి, యిరులుప్రాకెను;
అమనుకాంచిన రిక్కమూకలు
అంతటను ప్రబలెన్.

చారుతరముగ పసిడి పమిదల
బారుతీరి వెలింగె జోతులు;
వారి యంత్రము తళుకు ముత్తెపు
సరులు విరజిమ్మెన్"

('డామన్ పితియస్')

"వెలుగు నీడలు కనులకింపై
మెలగిచెలగెడు నాకసంబున
ప్రేలుమబ్బుల యంచులంటను
రగిలె రత్నరుచుల్.

పాటపక్షులు పౌజు పౌజుల;
జీరెకోయిలలొకటి వొకటిని;

అనుపల్లవి

పమగామాధానిస
నిసరీసనిధపసా
పదదానిసానిధధని
సాసానిధపమదపామగరిస-సా॥

చరణము

మపామపమాగగమరి
గగపామాపమాపధ
గమధపమాగరిస
గగామాపధపావమగామాధానిస
నిసరీసనిధనిసా
పదధానిసానిధధని
సాసానిధపమదపామగరిస॥ పా॥

మారిగూడల వాసలాడెను
    పిట్టలెల్లెడలన్.

గగనరాజ్యము గ్రమ్ముకేడుక
మగటిమిని తన కళల జూపుచు,
పగలు వెన్నెల వన్నె సోముడు
    పైనపై వెడలెన్.

తాడివనముల తూర్పుకొండను
గొడుగులెత్తెను; చామరంబుల
విడిచె, జీబగు ఈదు గణంబులు
    దవ్వులను నిలిచెన్.

చల్లగాలులు సాగి యరుగ
జల్లుజల్లున రాల్చె పూవుల;
ఉల్లమలరెను......"

ఇంతలో నాయకి పాటపాడుతుంది.

"పాటపాడెను, చెట్లుచామలు
కోటిచెవులను గ్రోలియలరగ;
తాటివనమున నాగి చంద్రుడు
    తాను చెవియొగ్గెన్"

"....రావికిందను రచ్చశిలపై
కొమ్మలను జేరి చంద్రకాంతులు...."

('లవణరాజుల కల')

ఈ గేయాలను అప్పారాయ మహాకవి, కవిగా రాసేకన్నా చిత్రకారుడుగా రాసేరంటే సమంజసంగా వుంటుంది, వాటి అందచందాలను చెప్పడానికి పూనుకుంటే వాటి అందచందాలను పాడుచెయ్యడమవుతుందేమో!

ఇదేవిధంగా చక్కటి తత్వధోరణిగలగేయాలు అప్పారాయ మహాకవి కావ్యాల్లో అక్కడక్కడ నక్షత్రాలలాగ కనిపిస్తాయి. తత్వశాస్త్రం అభిమాన విషయంగా అప్పారావుగారు పట్టభద్రులయ్యేరు. అంతేకాకండా ఆయనకు తత్వశాస్త్రమంటే చాలా ప్రీతివుండేది.

'.... నిన్నయన్నదె, నేడు రేపులు....'

"మంచిచెడ్డలు మనుజులందున
యెంచిచూడగ, రెండెకులములు;
మంచియన్నది మాలయైతే,
మాలనే అగుదున్"

"కాని మనుజుని బుద్ధిలోపల
కలవు, తన మేలొరుల కీడును
తలచు వృత్తుల; కానబోయిన
కలచు నెవ్వారిన్.

మాన్పగలిగితి కత్తికోతలు;
మాన్పవశమే మాటకోతలు?
కత్తిచంపును; మాటవాతలు
మానవేనాడున్!"

మాయావాదానికి అప్పారావుగారి సమాధానం వినండి,

"..........
కలగవలదట! కల్లయిదియట!
కలిగినది లేదన్నయంతనె
తొలగునట వేదల్!

పుస్తకంబులలోని మాటలు
విస్తరించుచు, ననుభవమ్ముల
తత్వమెరగక. శుకములగుదురు
వొట్టిశాస్త్రజ్ఞుల్!

యెప్పటికి అనుభూతమెద్దియొ
అప్పటికి యది నిక్కువంబే;
యెప్పుడో లోకంబు కల్లగు
ననుట యిపుడెట్లో?"

పై నుదహరింపబడిన గేయాలన్నీ 'లవణరాజు కల'లోనివి.

"లవణరాజుకల జ్ఞానవాసిష్ఠంలోనిది. ఐతేనేం కధను స్వతంత్రంగా వాడుకచేసేడు. సంఘ సంస్కారణ విషయం అందులో చొప్పించినా,

కళకుమట్టుకు కళంకం గలుగలేదు. అందన్న వాస్తవికత్వం నిష్ఠురమైనా, మనస్సుని కలియగొట్టడంలో నెంతమాత్రం వెనుకపడలేదు. ఇది చదువు తున్నంతసేపూ ఆనందమయమైన నిద్రలో మనంకూడా కల గాస్తున్నట్లవు తుంది. రాజుతో మనమూ మేల్కొని కళ్ళునులుపుకొని చూసేసరికి, ఒక కొత్త లోకానుభవం కలిగినట్లవుతుంది." *

"పరులకలిమికి పొర్లి యేడ్చే
పాపికెక్కడ సుఖం కద్దోయి?
ఒకరిమేల్ తనమేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయి!"
('దేశభక్తి')

"మగడువేల్పన పాతమాటది"
('కాసులు')

"..........
నిక్కమేకద చావు నరునకు
యెక్కడెప్పుడు, యెటులగూడిన
నొక్కటేగాదా?

"మ్రందుటన్నది బొందిమార్పుట"
.........................."

"ఒకటి ఆయెను రెండుమూడులు
ఒకటి ఆయెను కోటిసంఖ్యలు
పెక్కు లొక్కటిగ జూచువాడే
ప్రాజ్ఞుడన వినమే?"

"బ్రతికి. చచ్చియు. ప్రజలకెవ్వడు
ప్రీతిగూర్చునొ, వాడె ధన్యుడు"

"పంజరమ్ములనున్న పిట్టలు
మంజులారణ్యములు మరచెను
శింజితములౌ కాలిగొలుసులు
శిక్షయని మరచెన్

* 'ముత్యాలసరములు' రెండవ కూర్పులో కిళాంబి రంగాచారిగారు.

వారిపోయేవారి కొక్కటి
కారవాసః * కల్పదాయెను
దారికాదిని విరియటంచును
తలచుటొకవింత"

"పండగలదని కాయకుడుతురె?
తిండియెల్లిది నేడుతిందురె
అండమందున చిలుక కలదని
అరచి జీరెదరే?"

('డామన్ పితియస్')

గ్రీకు కథను కథావస్తువుగా తీసుకొని అప్పారాయ మహాకవి 'డామన్ పిథియస్' పద్యకథానికను రాసేరు. కావ్యానికి పాశ్చాత్య వాతావరణం, దానికి అనుగుణ్యమైన జిలుగుపనీ తెలుగుసాహిత్యానికి నూతనమైన వాక కొత్త అందాన్నిస్తున్నాయి. మిత్రుని ప్రాణాన్ని రక్షించడానికి తన ప్రాణం త్యాగంచెయ్యడానికి సిద్ధపడ్డ పితియస్, భర్త ప్రాణానికి బదులు తన ప్రాణం యివ్వడానికి సిద్ధపడ్డ పితియస్ భార్యా, మరణశిక్ష నుండి తప్పించుకోవడానికి అవకాశంవుండికూడా ధైర్యంతో శిక్ష ననుభవించడానికి వచ్చిన డామన్ పాత్రలు చాల నైపుణ్యంగా చిత్రించబడ్డాయి. అందుకే మరణశిక్ష విధించిన రాజే యీ మూడు పాత్రల నుద్దేశించి

"వినగతగినది వింటినిచ్చట;
కనగదగినది కాంచినాడను;
మనుజులిద్దరు మగువయొక్కతె
మాన్యులీ జగతిన్"

అంటాడు. విషాదాంతాన్ని సూచిస్తున్నకథ సుఖాంతం అవుతుంది.

దేశంలో వ్యాపిస్తున్న బ్రహ్మసమాజ భావాలు, వీరేశలింగం ప్రభృతుల ప్రచారం, మహాకవికి విగ్రహారాధనపట్ల విముఖత్వం కలిగించేయి. తోటిమానవులు దారిద్ర్యబాధలో కూరుకొనిపోయివుంటే వారికి కాసుసాయం చెయ్యక దేవుడిపేరుతో దుబరా ఖర్చులు చేసేవారినిచూసి అప్పారాయ మహాకవి :

---

* ఎడారి మజిలీ అని భావం.

"మనిషిచేసిన రాయిరప్పకి
మహిమకలదని సాగిమొక్కుతు
మనుషులంటే రాయిరప్పల
కన్న కనిష్టం
గాను చూస్తావేల, బేలా ?

దేవుడెక్కడో దాగెనంటూ
కొండకోనల వెతుకులాడేవేలా ?
కన్నుతెరచిన కానబడడో ?
మెరిగి, కోరిన కరిగి యీడో ముక్తి.

అని ప్రశ్నించారు. ఇంకోసందర్భంలో "దేవుడు చేసిన మనుషల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా : మీపేరేమిటి ? అని ప్రశ్నించారు.

"గరుడాళ్వారి నఖములు పెరిగి, ఖండన ఐనప్పుడు ఆముక్కలు నావంటి భక్తులుగా ఆవిర్భవించి పరమతసంహారంచేస్తవి..." అని వైష్ణవమత నాయకుడు మునివాళ్ళయ్య; శైవమత నాయకుడైన శరభయ్య తాను శివుడి వృషభవతారాన్నని చలాయించుకొని బతుకుతుంటారు.

"....పాతరోజులైతే, వీళ్ళే అవతారాలయి పోదురు. వీళ్ళ పేరట బొమ్మలునిలిపి దేవాలయాలుకట్టి, మనమే పూజిస్తుం. మరి బుద్ధుడూ యిలాంటి మనిషేగదండి...." అనీ 'మీపేరేమిటి' అన్న కథానికలో నేడు చలామణీ అవుతున్న దేవుళ్ళ పుట్టుపూర్వోత్తరాలు మనకు కొంత తెలియ జేస్తారు.

కాని 'పాతరోజులైతే....' అన్న అప్పారావుగారి వాక్యానికొక్క మినహాయింపువుంది.

ఉత్తరంవిశాఖజిల్లా ప్రాంతాల్లో యీనాడుకూడా గాంధీజీని అవతారం కింద లెక్కవేసి పూజలూ, ఉత్సవాలూ చేస్తున్నారు. ముడుపులుకట్టడమూ మొక్కుబళ్ళు చెల్లించడమూ జరుగుతూంది. ఇంకోవిచిత్రంకూడావుంది. పురుషుడైన గాంధీజీని స్త్రీగా జమకట్టి 'గాంధీ అమ్మోరు' అని మూర్ఖ ప్రజలు కొలుస్తున్నారు, 'హరిజననిధి' కోసరం గాంధీజీ యాత్రాప్రాంతాలు సంచారం చేసినప్పుడు, 'గాంధీ అమ్మోరు'కు కట్టిన ముడుపు నిధికోసం అడుగితే సంతోషంగా చెల్లించారు!

అందుచేతనే అప్పారాయ మహాకవి సామాన్యుని మొదలు సర్వేశ్వరుని వరకూ ప్రశ్నించారు.

"విరిగి పెరిగితి; పెరిగి విరిగితి
కష్టసుఖముల పారమెరిగితి;
పండుటన్నవి ఆశలెన్నో
యెండి రాలగ బొగిలితిన్

అందజాలని పళ్ళకోసము
అఱ్ఱుజాపితి; నేలప్రాకిన
చెట్లపళ్ళను విలువలెరుగక
పాదరక్షల మట్టితిన్

తీపివిరిగి చెరుకువలె ఆ
నాటి కోర్కెలు నేడు బెండౌ
టెంచి నవ్వితి; బుద్ధిచపలత
కొత్త కోర్కెల తగిలితిన్"

"పంజరమ్ముననున్న కట్లను
పగలదన్నగలేక స్రుక్కితి
నింగి పర్వగలేని జన్మము
నీచసంబని రోసితిన్"

('లంగరెత్తుము')

'పై పుటలలో నుదహరింపబడ్డ అప్పారావుగారి తత్త్వాభిప్రాయాలతో మనమేకీభవించకపోవచ్చును. కాని కర్మవాదంమీద ఆధారపడ్డ మన సాహిత్యానికి ఆయన వాస్తవిక పురుషప్రయత్నాన్ని చాలవరకు చేకూర్చి, భూలోకవాసన కలిగించేరన్నది మనం గుర్తించకతప్పదు.

అప్పారావుగారు జీవితంలో అనేకరకాలైన అనుభవాలు, కష్టసుఖాలు అనుభవించారు. ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. శిథిలమవుతున్న శరీరం ప్రాథాన్ని యిముడ్చుకోలేకపోతూంది. మానసికంగాకూడా అశాంతి ఆవరించుకుంటూంది. 'ఉపుదుల' పైమహాకవికి 'విసుగు'పుట్టింది. ఆయనకు ప్రాణం తానుమెయ్యలేని భారంగా పరిణమించింది. 'పుడమి' అంతా 'శూన్యంగా' కనిపించింది. తను ఆశించినవన్నీ వికలమయి

పోయేయి. జీవితమనే రేవులో తన ప్రాణమన్న నౌక వుండి లాభంలేదని పించింది. నౌకను రేవు విడిచిపెట్టమన్నాడు; లంగరెత్తమన్నాడు.

అదే 'లంగరెత్తుము' అన్న ఖండకావ్యం.

"ఉసురులకు విపత్తివా? యుద్ధము
కలదు: దేశముకొరకు పోరుము
యుద్ధమా? ఇకనేమి లోకము:
చాలు! చాలును! లంగరెత్తుము"

ఓ ప్రయోజనం వుంది. '....దేశముకొరకు పోరుము....' అని తన అంతర్వాణి అప్పారాయమహాకవిని హెచ్చరిస్తూంది. కాని మన దురదృష్టం కొద్దీ ఆయనకు జీవించడం సాధ్యంకాలేదు. "....ఇకనేమి లోకము: చాలు! చాలును! లంగరెత్తుము!" అంటూ ప్రాణనౌక జీవిత తీరాన్ని విడిచిపెట్టింది.

ఈ ఖండకావ్యం 1915 సం. ప్రాంతంలో రాసినది. అంటే మహాకవి చనిపోవడానికి కొద్ది నెలలకు పూర్వం.

గత మహాయుద్ధజ్వాలలు ప్రపంచాన్ని ఆవరించుకుంటున్న రోజులవి, ఈనాటిలాగానే ఆనాడు మనదేశంలో తీవ్రమైన భావసంచలనం జరుగుతూంది. 'జాతీయోద్యమ చరిత్ర'లో పాలమూడు సుబ్రహ్మదత్తుగారు అప్పటి రాజకీయ పరిస్థితుల నీవిధంగా వర్ణించారు.

"యుద్ధ ప్రథమదశలో, సామ్రాజ్యవాదానికి రాజకీయ వుద్యమంలోని పైతరగతులవారు యిష్టపూర్వకంగా చేసిన సహకారం లభించింది. మితవాద నాయకుల చేతులలోనున్న కాంగ్రెస్ తన రాజభక్తిని ప్రకటించింది, యుద్ధాన్ని సపోర్టుచేసింది. యుద్ధకాలంలో జరిగిన నాలుగు కాంగ్రెసులలో పై విధంగా తీర్మానాలు గావించింది. చివరకు 1918 లో యుద్ధానంతరం, ఢిల్లీ కాంగ్రెసులోనైతం, రాజుగారికి భక్తిని తెలుపుతూనూ, "జయప్రదంగా యుద్ధాన్ని ముగియజేసినందులకునూ" అభినందన తీర్మానాలను గావించింది, ఇందులకు బదులుగా కాంగ్రెస్ యెడల అధికారులు అనుకూలవైఖరి ప్రదర్శించారు. 1914 కాంగ్రెసుకు మద్రాసు గవర్నరు లార్డు పెంట్లండు హాజరయ్యేడు. 1915 కాంగ్రెసుకు బొంబాయి గవర్నరు లార్డు విల్లింగడన్ హాజరయ్యేడు. 1916 కాంగ్రెసుకు యు. పి.

గవర్నరు సర్ జేమ్సుమెస్టన్ హాజరయ్యాడు. ప్రభుత్వ ప్రతినిధులు వచ్చి వప్పులు హర్షధ్వానాలతో సత్కరించేవారు. యుద్ధం బయలుదేరిన రోజులతో లండన్‌లోవున్న హిందూదేశ నాయకులు, ప్రభుత్వానికి తమ సహోద్యమ యివ్వడానికి త్వరపడ్డారు. లండన్‌లో కాంగ్రెస్ ప్రతినిధుల రాయబారవర్గము - వీరిలో లజపతిరాయ్, జిన్నా, సిన్హా. యింకా యితరులు వున్నారు - సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కు ఒక లేఖను పంపుతూ తమ అభిప్రాయాన్ని యీ క్రిందివిధంగా తెలియజేశారు. "సామ్రాజ్యంయొక్క శీఘ్ర విజయం" కొరకుగాను, "హిందూదేశప్రజలు, సంస్థానాధీశులు, తమశక్తి కొలదీ వెంటనే యిచ్ఛాపూర్వకంగా సహకారంచేస్తారు. ఇంకా హిజ్ మెజస్టీ (రాజు) గారి చేతులలో తమ దేశసంపదను (రిసోర్సెస్) వుంచుటద్వారా పైనచెప్పిన సహకారాన్ని యిచ్చే అవకాశాన్ని పొందుతారు" అని తమ నమ్మకమని తెలియజేశారు. దక్షిణాఫ్రికానుండి అప్పుడే లండన్ వచ్చిన గాంధీజీ హొటెల్‌సిసిల్ వద్ద తనకిచ్చిన సన్మానానికి జబాబుచెబుతూ తన యువక హిందూదేశ స్నేహితులను "సామ్రాజ్యదృష్టితో మాట్లాడమనీ వారి కర్తవ్యాన్ని వారు చేయవలసిందనీ" కోరాడు. సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కు వ్రాసిన లేఖలో గాంధీజీ తదితరులూ సంతకాలు చేశారు. దానిలో తన సేవలను తీసుకోవలసిందని కోరాడు:

"సామ్రాజ్యాన్ని క్రమ్ముకున్న సంక్షోభకాలంలో బ్రిటన్‌లో నివసించుచున్న హిందూదేశీయులు యెట్టి షరతులు లేకుండా తాము ప్రభుత్వ చెప్పుచేతలలో (అలాచేయగల్గినవారు) వుండటం మంచిదని మాలో చాలమంది అభిప్రాయడుచున్నారు. మేమూ యీ ఉత్తరానికి అనుబంధంగా వ్రాసిన లిస్టులోని పేర్లవారు, ప్రభుత్వాన్ని మా స్కీమును గ్రైకొనమని ప్రార్థించుచున్నాము........" వాస్తవంలో మితవాద నాయకుల అంచనా వారు తర్వాత తామే విశదపరచినాట్లుగా సామ్రాజ్యవాదానికి యుద్ధకాలంలో యిలా సేవజేయడంవలన హిందూదేశ స్వపరిపాలనా కవాటాలను త్వరగా తెరుస్తున్నామని తలిచారు....ఆ తర్వాత తమ భ్రమతొలగిపోనట్లు మితవాదులు తెలియజేయవలసివచ్చింది."

మన జాతీయోద్యమం భ్రమపడినట్టుగానే సామ్రాజ్యవాదుల పట్ల అప్పారాయమహాకవికూడ భ్రమపడ్డారు. అందుచేతనే గత సామ్రాజ్యవాద మహాయుద్ధకాలంలో భారతీయులు యుద్ధకృషికి తోడ్పడ్డారు. ఈ భారతీయ

దృక్పథాన్నే 'డించు లంగరు' అన్న ఖండకావ్యంలో అప్పారావుగారు వ్యక్తంచేశారు.

"వచ్చెనిది బంగారుకాలము
వాంఛలెల్లను తీర సుజనుల
కాంగిలేయుల ధర్మరాజ్యము
జ్ఞానమును స్వాతంత్ర్య మిచ్చుచు
సంతతము వర్ధిల్లుగావుత !"

పైపంక్తులు చదవగానే మనస్సు చివుక్కుమంటుంది. బ్రిటిషువారి మీదనున్నకోపం, వారి బాగుకోరిన అప్పారావుగారిమీదకు కూడా కొంత చెదురుతుంది. కాని, అధినివేశ స్వాతంత్ర్యం భారతదేశంయొక్క అనాటి ఆశయమని మనం జ్ఞాపకముంచుకోవాలి. సామ్రాజ్యవాదుల సుహృద్భావం పట్ల అనాటిభారతీయులకు విశ్వాసంవుండేది. "ఆంగిలేయుల ధర్మరాజ్యము" స్వాతంత్ర్యము యిస్తుందన్న నమ్మకముండేది. గతయుద్ధంలో మన జాతీయోద్యమాన్నంతట్నీ దగాచేసినట్టే బ్రిటిషు సామ్రాజ్యవాదులు అప్పారావుమహాకవినికూడా దగాచేశారు. ఈ వాతావారణంతో మనం పైపంక్తులను చదివినట్టయితే అప్పారావుగారిని అర్థంచేసుకోగలుగుతాం.

ఈపంక్తులు అప్పారావుగారి దేశభక్తికి కళంకంకాదు. సామ్రాజ్య వాదుల మోసాన్ని తెలిపే శిలాక్షరాలు !

ఫాసిస్టు దుష్టశక్తులు పతనమవుతూ, ప్రజాశక్తులు విజృంభిస్తున్న యీ ఉషఃకాలంలో, గత ప్రపంచ మహాయుద్ధసమయంలో అప్పారాయ మహాకవి రాసిన ఖండకావ్యం 'డించు లంగరు' కొంతఆసక్తిని కలిగిస్తుంది.

"డించులంగరు దీర్ఘ యుద్ధం
ధర్మపక్షము ముల్లుచూపెను
నరులపీనుగ పెంటపోకల
నాటివెలయును శాంతివృక్షము

పాతసంధులు పాతిపెట్టుము
యుద్ధముల కవి ఉనికిపట్టులు
శోకమంతయు ఏకమై
యుద్ధమునె మారణముచేయును."

ఆ నాటికన్న యీనాడే మహాకవి వాక్కులు సిద్ధిని పొందబోతున్నాయి!

శాంతితీరంలో యుద్ధనౌకను లంగరు వెయ్యమన్నారు. సుహృద్భావంతో కాకండా వొకరిపై వొకరు రుద్దుకున్న 'ఒడంబడికలు' - వెర్సైల్సు ఒడంబడికలాగనే - నివురుగప్పిన నిప్పువంటివి సమయంరాగానే అవి జ్వలించక తప్పదు. 'యుద్ధములకవి ఉనికి పట్టులు.'

"లోకమంతయు ఏకమై
యుద్ధమునె మారణము చేయును."

ఆ బంగారుకాలంకోసం మహాకవి కలలుగన్నారు. మహాకవి కలలు నిజమయ్యే అవకాశాలు ఆనాటికన్న యీనాడే యెక్కువ కనిపిస్తున్నాయి.

మ హా పు రు షు డు

మహాపురుషుడు కానివాడు మహాకవి కాలేడు. ఆత్మగతంకాని కవిత్వంలో, కవి కృత్రిమత్వం తొంగిచూడక తప్పదు. ఆత్మవంచకుడైన కవి, తన కృత్రిమత్వాన్ని యితర హంగులతో కప్పిపుచ్చి, పరవంచనం కూడా చేస్తాడు. కొంతకాలం యీ కృత్రిమత్వం సాగవచ్చు. కొందరిని దగాచెయ్యగల సామర్ధ్యం సంపాదించవచ్చు. కాని అందరినీ కలకాలం యిది దగాచెయ్యలేము. కాబట్టే, టాల్‌స్టాయ్, షేక్స్పియర్, కాళిదాసు, తిక్కన, పోతన, ఇబ్సన్ మొదలైనవారికి చావులేదు. నక్షత్రాలుగా కొంతకాలం భ్రమపెట్టిన కొందరు కవులు, చమురునిండుకున్న దీపపుబుడ్లగా స్పష్టపడ్డారు. మహాపురుషుడుకాబట్టే అప్పారావుగారు మహాకవి కాగలిగేరు. ఏమహాదాదర్శానికి త్రికరణశుద్ధిగా దీక్షవహించారో దానికోసం తన యావజ్జీవితాన్ని నిష్కామంగా ధారపోసిన మహాపురుషుడు అప్పారాయ మహాకవి!

"ఆయన మన ఆంధ్రులలో - మాకు ముందటితరమువారిలో చాలా ప్రసిద్ధ పురుషులు. 'గ్రేట్‌వార్' అనే గత ప్రపంచ సంగ్రామమునకు పూర్వపు దినములలో చెన్నరాజధానిలో గవర్నర్లతోను గవర్నమెంటు మెంబర్లతోను సాయిలాపాయిగాగా మిత్రునివలె నిర్భయముగా యేయంశమును గురించి అయినా ప్రసంగించగలిగిన యీరాజధానీయులలోని బహుకొద్దివారిలో ఆయన ప్రముఖుడు. తనమాటచెల్లివచ్చినచోటనల్లా మన ఆంధ్రులకు, ఆంధ్రసంస్థలకు సాయపడిన నిశ్చలమైన దేశాభిమాని."

అని అప్పారావుగారి గురించి బుర్రా శేషగిరిరావుగారు రాశారు. అప్పారావుగారు ప్రతిభాశాలి మాత్రమే కాదు; తనకాలంలో చాల పలుకు బడిగల మనిషిని పై నుదహరించబడిన వాక్యాలు తెలియజేస్తాయి.

విజయనగర సంస్థానంలో పెద్ద పలుకుబడివుండికూడా, తన పలుకు బడిని ధనార్జనకు వినియోగించలేదు అప్పుడప్పుడు ఆర్థికమైన యిబ్బం దులుకూడా పడుతుండేవారు.

కుటుంబఖర్చులతోబాటు, పుస్తకాలకోసమూ పేదవిద్యార్థులకూ పండితులకూ సహాయం చెయ్యడంకోసమూ అప్పారావుగారికి చాలడబ్బు ఖర్చు అవుతుండేది. విజయనగరం కాలేజీ గ్రంథాలయంలోవున్న అప్పారావుగారి పుస్తకాలు, యీనాడు అప్పారావుగారి యింట్లోవున్న పుస్తకాలు వేలసంఖ్యలోవున్నాయి. అవి చూస్తే, అనేకవిషయాలలో ఆయనకుగల అభిరుచులూ, పుస్తకాలకోసం ఆయన ఖర్చుచేసిన ధనమూ కొంతవరకు మనమూహించుకోవచ్చు. భాషాశబ్దశాస్త్రం, చరిత్ర, వేషభాషలు, శిల్పం, చిత్రలేఖనం, విమర్శ, నాటకీయవిషయాలు, మతం, ఆహారవ్యవహారాలు మొదలైన అనేకవిషయాలమీద రాయబడిన పుస్తకాలు ఆయన గ్రంథాలయంలో వున్నాయి.

సుమారు పాతికసంవత్సరాలకాలం విజయనగర సంస్థానంలో ఒక ప్రధాన పురుషుడుగా వుండడమేకాకుండా, ఆనందగజపతిమహారాజుకు, అలకరాజేశ్వరిమహారాణి (మహారాజు తల్లి)కీ, రీవామహారాణి (మహారాజు సోదరికీ) తలలోని నాల్కగా వుంటూకూడా, అప్పారాయమహాకవి ఋణబాధ నుండిసైతం తప్పుకోలేకపోయారు.

“విజయనగసంస్థానమును ప్రస్తుతపు వంశమువారికి నిలువబెట్టి, రాజభక్తిపరాయణుడై, మహాధనికుడు కాగలపరిస్థితులలో వుండిన్నీ, సంస్థానమునకు ఋణపడి గతించినారు.” అని కాంగ్రెసు మాజీ అధ్యక్షులైన యస్. శ్రీనివాసయ్యంగారు తమకు విజయనగరం పెద్దదావా నడిపించుటలో కలిగిన అనుభవ తో అప్పారావుగారి గురించి అన్నారు.

* * * *

అప్పరాయిమహాకవి పెద్దకళ్ళు అందమైనముక్కు విశాలమైన నుదురుతో, చూసినవారికి అసాధారణవ్యక్తిగా కనిపించేవారు.

బహూపల్చనిమనిషి, వేసవికాలంలోకూడా ఉన్నిచొక్కామీద కోటు వేసుకొని, దానిమీద శాలువకప్పుకొని, మేజోళ్ళు తొడుక్కుంటేనే గాని వుండలేకపోయేవారు.

కళ్లు తరుచుగా మూసుకొన్నట్టుండేవి. ఎప్పుడూ ఏదోచదువుతూనో రాస్తూనో వుండేవారు. ఏదోపుస్తకం లేనిదే ఎప్పుడూ వుండేవారుకారు. ఎక్కడికెళ్ళినా పుస్తకాన్నొకటి తీసుకొనిపోతూవుండేవారు. స్నేహితుల యిళ్ళలో పుస్తకాలు మర్చిపోవడం, వారి పుస్తకాలు తీసుకపోవడమూ సర్వసామాన్యంగా జరుగుతూ వుండేది.

అప్పారావుగారు సామాన్యంగా కాగితంమీద యేదోరాస్తూ కనిపించేవారు. మిత్రులమధ్య ఛలోక్తులతోను, హాస్యప్రసంగాలతోనూ సంభాషిస్తూ కనిపించేవారు. బంకు (కోటలో రాజదర్శనానికి వేచివుండే స్థలం) దగ్గర, విద్వద్విషయాలతోబాటు, తను రచించబోయేది అక్కడ సమావేశమైన కవి పండితాది కళావేత్తలతో ముందుగా చర్చించేవారు. మిత్రులు అప్పారావుగారిని 'కింగ్ ఆఫ్ బంక్' అన్న 'బిరుదనామం'తో పిల్చేవారు.

అప్పారావుగారు ఏకాగ్రతగల వ్యక్తి. బంకువద్ద సమావేశమైన వారి మాటల కోలాహలంలోఅయినా, ఒంటరిగా వున్నంత నిశ్చలంగా, తనపని తాను చేసుకునేవారు. స్నేహితులతో కష్టసుఖాలు మాటాడేటప్పుడు యెంతటి చిక్కుసమస్యనైనా సులువుగావిడదీసి వారికి ఆశ్చర్యం కలిగించే సలహాలిచ్చేవారు విజయనగర రాజసభాకృత్య నిర్వహణంలోనూ, సంస్థానపు దావా నడిపించడంలోను, ఆయనచూపిన ప్రతిభ స్నేహితులనుండి "విజయనగర చాణుక్యుడ"న్న బిరుదు సంపాదించింది.

ఈ సందర్భంలో న్యాయశాస్త్రంలో అప్పారావుగారి ప్రతిభనుతెలిపే ఒక వుదంతాన్ని మనవిచేస్తాను.

ఒకసారి అప్పారాయ మహాకవి యస్. శ్రీనివాసయ్యంగారితో రైలుప్రయాణంచేస్తున్నారు. శ్రీనివాసయ్యంగారు ప్రతిభావంతులైన మన చెన్నరాజధాని న్యాయవాదుల్లో వేళ్ళమీద లెక్కపెట్టవలసినవారు. శ్రీనివాసయ్యంగారు అప్పుడు టాకర్ అండ్ సన్స్ అన్న పెద్ద బంగారంవర్తకుల పక్షం మాననష్టందావా నడిపిస్తున్నారు. రైలుప్రయాణంలో ఆయనా అప్పారావుగారూ యీ దావావిషయం ముచ్చటించుకున్నారట. తరువాత కొద్ది

సేపట్లో అప్పారావుగారు ఆ దావాను యేపద్ధతులమీద నడపాలో అన్న విషయాన్ని చిన్న కాగితంమ్కుమీదరాసి శ్రీనివాసయ్యంగారికిచ్చేరు. “ఈ పద్ధతితోనేను దావాను నడిపినట్టయితే మా పక్షం గెలవకతప్పదు,” అని న్యాయవాది ప్రముఖుడైన శ్రీనివాసయ్యంగారు ఆశ్చర్యంగా అప్పారావుగారి ముఖంలోనికి చూసేరట.

తాను ఎంతకార్యనిమగ్నుడైనప్పటికీ, చుట్టుప్రక్కల జరుగుతూవున్న వాటినన్నిటినీ సూక్ష్మంగా కనిపెడుతుండేవారు, వివిధవర్గాలకు జెందిన వ్యక్తులు ఆయాపరిస్థితుల్లో యేవిధంగా మాటాడుతారో యెలాగ్రప్రవర్తిస్తారో యెప్పటికప్పుడు రాసుకొనేవారు. నీళ్ళకుపోయే ఆడవాళ్ళ మాటలూ, దెబ్బలాడుకుంటూన్న హిందూ - ముస్లిముల మాటలూ అప్పారావుగారు రాసుకోవడం తానెరుగుదునని ఒక సభలో గిడుగు రామమూర్తిగారు చెప్పారు.

అప్పారావుగారి పరిశీలనను వ్యక్తంచేసే వారి డైరీలలోని భాగాలను రెంటిని ఉదహరిస్తాను:

“25–3–95 సోమవారం: ఏకాంగి — ఈయన ఒక యోగి. అడ్మిరాల్టీకి కృష్ణంరాజుగారి కొరకు వస్తూవుంటాడు — స్ఫోటకపుమచ్చల ముఖము, కొంచమునిడుపు, నలుపుతలగుడ్డ—చక్కటి రంగుజరీ అంగీ—కాషాయరంగుది — మేలురకముబట్ట — మహాజ్ఞానివలె నటన — కొన్ని యింగిలీషు భాషనులుకూడా వున్నవి. మాటల ధోరణి సాగుతూవుంటే చీటికీ మాటికీ చేతిరుమాలుతీసి వాడుతూవుంటాడు. యెవరైనా ప్రశ్నిస్తే పండితుడులాగ తలపంకించుతాడు. మాటలధోరణి తెచ్చిపెట్టుకున్నదిగాని సహజంకాదు. పాపము ముసలికృష్ణంరాజుగారికీ తనివల్ల చాలాడబ్బు ఖర్చవుతూవుంది. వచ్చినప్పుడల్లా రు. 2-8-0 బండి అద్దెకే యిచ్చుకుంటున్నారు. ఈతడు తెలివితేటలుగలవాడే. పామరులను బాగా ఆకర్షించగలడు. అంతసుళువుగా కొట్టిపారవేయవలసిన మనిషివాడు. మావద్దకివచ్చే బ్రాహ్మణులకితడంటే రోత. యిదే దాఖలా. శూద్రులీదని పాదాలకు మ్రొక్కుతారు. కృష్ణంరాజుగారివెంట ఒక వైష్ణవభిక్షువుకూడా తిరుగుతున్నాడు. వాడు పచ్చిదొంగ.”

“ముఖమునకు కనుబొమలు కొంత అందంయిస్తవి. పొటమరించుకొని బొద్దుగా వుండేవి బాగుండవు. చర్మమునకు అంటుకొనిపోయినట్లు

వుంటే క్రూరత్వమును సూచిస్తవి. అతిసున్నితముగా పెన్సిలుగీతవలె వుంటే చులకన మనిషి అని సూచన క్రమముగా విల్లువలె వంగి సాధారణపు దళసరిగలిగి కండ్లకు అతిదూరముగా గాని అతి దగ్గరగా గాని కాకుండా వుంటే అది ముఖమునకందమిస్తుంది. ఏ వరసగా అయినుగా కాకుండా యెగుడు దిగుడుగా సోగగావుంటే తెలివితేటలను సూచించును."

మహాకవి తన స్వభావంగురించి 'మాట — మంతి'లో యీ విధంగా చెప్పుతున్నారు :

"చిన్నతనంలో బొమ్మలాట నేర్చివుండుటచేత లోకమనే రంగంలో చిత్రకోటిరీతులను ఆటాడే మనుషులనే పాత్రముల సొగసునే కనిపెట్టడము నాకు అలవాటైనది. సొగసులేని మనిషే వుండడు. స్నేహమూ – ప్రేమా – అనే అనాది అయిన్నీ యెప్పటికీ సరికొత్తగా వుండే రెండు వెలుగులను నరులమీద కాంచి తిప్పి కాంచితే వింతవింత సొగసులు బయలుదేరుతవి. అసూయ అనే అంధకారంలో అంతా యేకనలుపే!"

"ముఖంలోశాంతం, మాటల్లోశాంతం, నడవడిలోశాంతం, మెల్లని మాట, మీదపడికొట్టినా తొందరలేనివ్యక్తి. అపరిమితమైన ప్రపంచానుభవం, అపారమైన యింగితజ్ఞానం ఆయన ప్రతిచర్యలోనూ కనిపిస్తుండేవి. [1]

"ప్రతివిషయములోను - తన విషయములోకూడా మినహాయింపు లేకుండా, పరిశీలనగా చూడడము ఆయనకు సహజమైపోయినది ఇట్లే అలవాటులు అభ్యాసయోగంవల్ల సహజమైపోతవి. అనగా అప్రయత్న ప్రవృత్తులవుతవి. అట్టివృష్టి స్వోత్కర్షగాను, స్వాతిశయముగాను విఱ్ఱవీగుగాను, మారిపోకుండా ఆయనలో 'హాస్యదృష్టి'కూడా యెన్నోమారులు కనిపెట్టితిని — ఆయన కితరులలో నవ్వుపుట్టించే అంశములు చప్పున బొడకట్టేవి. అది స్వవిషయంలోకూడా వుండేది....ఆయన ఒక విచిత్ర పురుషుడువలె కనపడేవాడు. అవసానకాలంవరకూ వేషం పాతఫక్కీగా రాజదర్బారు లాంఛనముగా వుండేది. ఆ పాతవేషంచూస్తే మావంటి యువకులకు మందహాస కలిగేది. పెద్దలంతా గుఱ్ఱపుబళ్ళలో సభలకువస్తే ఆయన పల్లెటూరి మొఖసాదారులాగి మంచి రెండెడ్ల విశాలపు బండిలో

1. ముత్యాలసరాల రెండవకూర్పు పీఠికలో కీశా. బి రంగావారిగారు.

పరుపులూ, తలగడలూ వేసుకొని సుఖాసీనులై వచ్చేవారు. గాలితగులు తుందని రాత్రికూడా గొడుగు వేసుకునేవారు పరులు తననుచూచి నవ్వు కుంటారని ఆయన యెరుగును. అప్పుడప్పుడు తననుగురించీ, తన పిల్లల గురించీ వేళాకోళముగా అనేవారు. ఇట్టి నిష్పాక్షికమైన విమర్శనశక్తి పెంపొందించుకొని, సాహిత్యము, చిత్రలేఖనము, వక్తృత్వము, రచన, నడతలు, శీలములు, వేషభాషలు, దేశపరిస్థితులు, సాంఘిక సంఘటనలను చెన్నపురిలోను, ఇతరత్రాను నిశితంగా చూచిన అప్పారావుగారు...."

అని అప్పారాయమహాకవి గురించి ఆయన పరిచయభాగ్యంగల శేషగిరిరావుగారు రాశారు.

అప్పారావుగారు 1915 ఏప్రిల్ 9 వ తేదీన అంటే చనిపోవడానికి ఏడునెలల పూర్వం — వైద్యసలహాకు పంపడానికి తమదేహస్థితిని రాశారు. ఇది ఆయన మనస్థితినీ, ఆరోగ్యంగురించి ఆయన తీసుకునే జాగ్రత్తనూ కూడా వ్యక్తంచేస్తుంది. అప్పారావుగారు చాలకాలం అజీర్ణరోగంతో బాధ పడ్డారు. చాల కొద్దిగా ఆహారం తీసుకునేవారు. అయినా జీర్ణంగాక బాధ పడేవారు. ఇది రాసినప్పటికి ఆయనవయస్సు 54 సంవత్సరాలు; బరువు 78 పౌన్లు!

అప్పారావుగారు వైద్యసలహాకోసం రాసిన పట్టికలోనుంచి కొంత భాగాన్ని ఉదహరిస్తాను :

"బాల్యంనుంచీకూడా నాకు అలసట అధికంగా వుండేది. నేను అత్యల్పంగా వుండేవాణ్ని. నేను చేస్తూండే మేధసంబంధమైనపని నాస్నే హితులకు నాకూ చాలా ఆశ్చర్యంకలిగించేది. నేను యువకుడుగా వుంటు న్నప్పుడుకూడా నాకు శరీరంలో అలసట కనిపించేది. నాకెప్పుడూ పక్క మీద పడుకోవాలనే వుండేది. శరీరాన్ని కష్టపెట్టడమంటే యిష్టంవుండేది కాదు. అయినా తెలివితక్కువగా, నామేధస్సును కష్టపెట్టేవాణ్ని. మొన్న మొన్నటివరకూ యిలాగే చేసేవాణ్ని........

శీతోష్ణపరిస్థితులు నాశరీరంమీద తొందరగా పనిచేసేవి. ఎప్పుడో గాని సాధారణమైన గాలినికూడా నేను భరించలేను. నడుస్తున్నప్పుడుగాని, బండిలో వెళ్తున్నప్పుడుగాని గాలికెదురుగా గొడుగు అడ్డంపెడతాను. శీతోష్ణస్థితుల కనుగుణంగా, ఒక్కశాలువ లేక శాలువలు, టోపీలు, కోట్లు లేక ఉన్నిదుస్తులు, యిబ్బందిలేకుండా వుండడానికి తొడుక్కొనివుండం

నాకు పరిపాటి, కొండలమీద * చొక్కాపైని చొక్కా కోటుపైని కోటు తొడుక్కుంటాను. నాలుగైదుసంవత్సరాలనుండి ఆరోగ్యకరమైన వాతావరణంగల కొండలమీదకూడా, నాశరీరం బాగుపడలేదు. నామేధస్సుకు విశ్రాంతి యివ్వకపోవడం బహుశా కారణంగావచ్చు. కొండలమీద నాకు ఆకలి బాగావేస్తుంది. కొంచం బలంగావుంటాను. కాని సాధారణంగా బాధపడుతుంటాను."

అప్పారావుగారి ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. ఆఖరు రోజుల్లో ఆయన ఆరోగ్యంకోసం విశాఖపట్నంలో కొన్నిమాసాలు గడిపారు. కాని శిథిలమైన శరీరం ఆమహదాత్మను భరించలేకపోయింది. 1915 నవంబరు 30 వ తేదీని, ఉద్యోగంనుండి విరమించిన రెండుసంవత్సరాల తరవాత అప్పారావుగారు దేహంచాలించారు. ఉద్యోగంనుండి విరమించిన 1913 సం. లోనే ఆయనను మద్రాసు యూనివర్సిటీ సెనెట్ యావజ్జీవిత సభ్యునిగా ప్రభుత్వం నియమించిది.

అప్పారావుగారి సంతానం ఒక కుమారుడు, యిద్దరు కుమార్తెలు, ఒక్కకుమార్తె తప్ప తక్కినవారు సజీవులు.

మహాకవి కావ్యసంతతిలో పూర్తిగాకండా అముద్రితంగా నిలిచిపోయిన నాటకాలు, నవలలు, కథానికలు, పద్యకావ్యాలు మొదలైనవి నలభై యాభై వరకూ వుంటాయి. తెలుగు సాహిత్యం దురదృష్టంవల్ల అవి సంపూర్ణంకాకుండానే మహాకవి మరణించారు. సంపూర్ణమైవుండి కూడా 'మిటిల్డా' అన్న కథానిక ఒక్కటే ప్రచురింపబడిన ఆయన రచన.

నాటకాలకో నవలలకో రాసుకున్న కథాసూచనలు కొన్ని మహాకవి డైరీలలో కనిపిస్తున్నాయి. 1895 మార్చి 27 డైరీలో :

"మాడుగులు లోవయు, పార్కులో జరిగిన అగ్నిప్రమాదమును యేదేనా నవలలో వాడదగినవి."

ఇంకో కావ్యవస్తువు :

"కావ్యవస్తువు— భోగముపిల్ల—తల్లిలేదు—ముత్తవ్వవున్నది—తండ్రి చనిపోవును — యిల్లు వెడలగొట్టబడును — ధనముకొరకాసించని తల్లివల్ల తండ్రిజీవితము బాగుపడినది—ఒక బ్రాహ్మణ రంగేలా—భార్యను వద..ను-

* రాజకుటుంబీకులతో అప్పారావుగారు వేసవిలో నీలగిరి మొదలైన చల్లని ప్రదేశాలకెళ్లేవారు.

ఆమెచెల్లె ఉపాధ్యాయిని — తండ్రిలేదు, (పెండ్లిలేదు—ఈతడు) బి. ఏ. బి. యల్. చదువు మానును."

"1895 సం॥ డైరీనుండి పై నుదహరించిన 'భోగముపిల్ల' కథ సూచనను బట్టి చూడగా, యెంతటి నీచకులమువారికైనా మంచి శీలమూ, నిలకడా, సుగుణములూ కనపడవచ్చుననే భావము 'కన్యా శుల్కము' రచించకముందే ఆయనలో దృఢపడినట్లు స్పష్టమగుచున్నది. మనుష్యులలో మంచితీసి నజరుగా—లోకోపదేశ జనకముగా నాటకములలో చూపవలయునని ఆయన నిశ్చయించుకొనియుండెను." అని బు|రా శేష గిరి రావుగారు అభిప్రాయపడుతున్నారు,

"ఈరోజున రవివర్మ వ్రాసిన 'రాధ'ను చూచితిని మొద్దుమనిషివలె వుంది. కళ్ళు అంత పెద్దవిగావుండడం బాగులేదు; స్త్రీ ముఖము ఆలాగు వుండునా అనిపించింది. మీది పెదవికొన కొంచెం అణగారినట్లున్నది. మొత్తముపైని చాలా సాధువుగానూ, మొగమాటిగాను కనపడుతుంది. ఆమెలో భోగలాలసత్వమూ, చలాకీచూ స్తీ చూడడంలోనే స్ఫురించవద్దూ?"

అప్పారాయ మహాకవికి చిత్రలేఖనం, సంగీతం, వ్యవసాయం మొదలైన వాట్లో మంచి అభిరుచి వుండేది.

పైనుదహరించిన ఆయన డైరీలోని భాగం చిత్రలేఖనంలో అప్పారావుగారి పరిశీలనను ద్యోతకం చేస్తుంది. అంతేకాకండా ఆయన స్వయంగా చిత్రలేఖనంలో కృషిచేసేరు. ఆనందజగపతి మహారాజుతో విజయనగరం సమీపంలోవున్న వెలగాడకొండమీదికి విహారానికి వెళ్ళినప్పుడు, అప్పారాయ మహాకవి జ్ఞాపకాన్ని అనుసరించి అద్దంలేకండా తనబొమ్మను తానేచిత్రించుకున్నారు. అప్పారావుగారు వ్యక్తులహావభావాల్ని బట్టి చిత్రించిన బొమ్మల యింకా కొన్ని వున్నాయి. ఆయన చిత్రకళా సాంకేతికాన్ని చాలా పరిశీలనగా అవగతం చేసుకున్నారు. పాశ్చాత్య చిత్రాల్ని తెప్పించి పరిశీలించేరు. పాశ్చాత్య చిత్రాల్లో మేఘాలు అందంగా వుండడానికి అక్కడవున్న శీతోష్ణ పరిస్థితులు కారణమని అప్పారాయ మహాకవి అవగతం చేసుకున్నారు.

ఇదేవిధంగా మహాకవికి సంగీతంలోకూడా చాలా ఆసక్తి వుండేది. ఆయన వీణ వాయించేవారు. తాను రచించిన 'నీలగిరి పాటల' కు తానే స్వరాలు వేసుకున్నారు.

అప్పారావుగారు చరిత్ర పరిశోధన, భాషాశబ్దశాస్త్రం నాటకకళ మొదలైనవాట్లో విశేషకృషిచేసిన ఆనాటి మహారథులలో ఒకరు. ఆయన రచనలు అధికంగా లేకపోవడానికి అనారోగ్యం, వారు జీవించిన ఏభైనాలుగు సంవత్సరాలలో పదిహేను సంవత్సరాలు మింగిన సంస్థానపు వారసత్వపుదావా, వ్యవహారిక – గ్రాంధికభాషల సంఘర్షణలతోబాటు అనేక విషయాల్లో అప్పారాయ మహాకవికి ఆసక్తివుండడం కారణమనుకుంటాను. నూతన శకస్థాపకుడనీ, విప్లవకారకుడనీ ఆయనకు బ్రహ్మరథం పట్టినవారే ఆయన ఆదర్శాలనుండి దిగజారి నవ్యసాహిత్యాన్ని ప్రేయసీమయంగా చేయడానికి, అప్పారావుగారి ఆదర్శాలను సరిగా వంటబట్టించుకోకపోవడమే కారణం కావాలి. అప్పారావుగారి రచనలే అధికసంఖ్యలో వుంటే, అవి వారి చెవినిల్లుకట్టుకొని పోరి పలాయన సాహిత్యానికి ప్రవేశం కలుగకుండాచేసి వుండేవేమో. తత్కారణంగా సాహిత్యంలో అప్పారాయ మహాకవి ప్రవేశపెట్టిన అభ్యుదయభవాలు కావలసినంతగా అభివృద్ధికాలేదు. ఇది తెలుగు సాహిత్యంలో విప్లవప్రతీఘాతమైన విషాదసంఘటన.

ప్రపంచ సాహిత్యాలలో దేనికికూడా తీసిపోని ఉచ్ఛస్థితిని అనుభవించిన తెలుగు సాహిత్యం, తక్కిన భారతీయసాహిత్యాలతోబాటు వెనకపడిపోయింది. ముఖ్యంగా పాశ్చాత్యసాహిత్యాలు ఒకశతాబ్దంముందునడిచాయి. మఠంవేసుకొని కూర్చున్న తెలుగుసాహిత్యాన్ని నిలబెట్టి ముందుకు నడిపించవలసిన బాధ్యత వీరేశలింగం, అప్పారావు, రామమూర్తిగార్ల మీద పడింది.

ఆ పురోగమనంకోసమే అప్పారావుగారు 'కొత్తపాతల మేలు కలయిక'తో కొత్త సాహిత్యాన్ని సృష్టించారు. పాతదైన మన సంస్కృతిని కొత్తదైన పాశ్చాత్య సంస్కృతితో మేళవించి అప్పారాయమహాకవి అపూర్వమైన సాహిత్యసృష్టిచేశారు. మోలియర్‌లోని హాస్యాన్ని ఇబ్సన్‌లోని సంస్కారాశయాల్ని, తెలుగువాతావరణంతో మేళవించి కన్యాశుల్కాన్ని రచించారు. సానిని కథానాయికగాచేసికూడా బూతును వెలివేసిన మొట్టమొదటి కావ్యాన్ని తెలుగు సాహిత్యాన్నికి ప్రసాదించారు. కృతకమైన భాషకూ భావాలకూ స్వస్తిచెప్పి, ముద్దుకృష్ణగారన్నట్టు "ముందురాగలవారికి మార్గనిర్మాణం సంపాదించినారు." ప్రజాసాహిత్యానికి బలమైన పునాదులు వేశారు.

ప్రజల్నీ బంధుమిత్రుల్నీ పొట్టబెట్టుకున్న మహాభారతయుద్ధం తర వాత శూన్యమైన రాజ్యాన్ని పరిపాలించవలసివచ్చిందని ధర్మరాజు విలపి స్తాడు. ఆభావాన్నే హెచ్చరికగాచేసి అప్పారాయమహాకవి :

"దేశమంటే మట్టికాదోయి
దేశమంటే మనుషులోయి"

"యీసురోమని మనుషులంటే
దేశమేగతి బాగుపడునోయి ?"

అనీ తెలుగుజాతిని ప్రబోధించారు.

"మనిషిచేసిన రాయిరప్పకి మహిమకలదని సాగిమొక్కుతు, మనుషులంటే రాయిరప్పలకన్న కనిష్టంగాను చూస్తావేల ?" అని ప్రశ్నిం చారు. మాధవసేవకన్నా మానవసేవే పరమధర్మమని ఎలుగెత్తి చాటేరు.

దేవుళ్ళూ, రాజులూ, ధనికులూ ఆక్రమించుకొన్న సాహిత్యాన్ని ప్రజలకు సంపాదించిన మహాపురుషుడు అప్పారాయమహాకవి : సాహిత్య విప్లవకారకుడై నూతన సంస్కృతిని నెలకొల్పిన మహాపురుషుడు !

అప్పారాయమహాకవి తెలుగుజాతికి పెన్నిధి ! ప్రపంచకవుల కుటుంబానికి చెందిన విశ్వకవి !